


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

‘శుద్ధీకరణ’ నేరం
మల్లికార్జున ఖర్గేకు న్యాయం జరగాలి

గడువు తీరిన ఆహార పొట్లాలు
హింగోలిలో ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన అభిజీత్ దీప్కే

మనోజ్ జారంగే నిరాహారదీక్ష
సిఎం నివాసం ముట్టడిస్తామని హెచ్చరిక 07

సంపుటి 09, సంచిక: 270 | ఆదివారం | 30-08-2026 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## నేపాల్‌లో 2500 మంది
# ఆచూకీ గల్లంతు

- 18 వేలమంది భద్రతా సిబ్బందితో గాలింపు చర్యలు
- 675 పైగా మృతదేహాలు స్వాధీనం
- మృతుల్లో మొత్తం 320 మంది భారతీయులు

### హిమాలయ దేశానికి మళ్లీ వరదముప్పు



**కాఠ్మండు :** టిబెట్‌–నేపాల్ సరిహద్దుల్లో బుధవారం హిమనీనదం విరిగిపడటంతో సంభవించిన మహా జల విలయంలో మరణించినవారి సంఖ్య శనివారంనాటికి 675కు పెరిగింది. మరణించినవారిలో 320 మంది భారతీయులు ఉన్నారు. 80 మంది భారతీయులను సజీవంగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ జల విలయం బారిన పడిన 2,500 మంది జాడ తెలియడంలేదు. మరోసారి ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉందని నేపాల్ జాతీయ విపత్తు నియంత్రణ విభాగం (ఎన్‌డిఆర్‌ఆర్ఎంఎ) హెచ్చరిక విడుదల చేసింది. ఈ హెచ్చరికలనడుమ 5000 మంది సైనికులు సహా మొత్తం 18,700 మంది భద్రతా సిబ్బంది సజీవులు, నిర్జీవులకోసం గాలిం పు చర్యలు కొనసాగిస్తున్నారు. నేపాల్ హోం మంత్రి కూడా ఈ సహాయ చర్యల్లో పాల్గొంటున్నారు. సొరంగ మార్గాల అన్వేషణ నిపుణులు, వైద్యసిబ్బంది సహా 11 మంది భారత్ బృందం కూడా ఈ గాలింపు చర్యల్లో పాల్గొంటున్నది. చైనావైపు టిబెట్‌లో కూడా అనేకమంది మరణించారు. చైనా సైనికులు కూడా రంగంలోకి దిగిన టిబెట్‌–నేపాల్ సరిహద్దులో పేరుకుపోయిన బురద, రాళ్ళను తొలగిస్తూ మృతదేహాలకోసం గాలిస్తున్నారు. “ఎవరైనా ఉన్నారా?” అని గట్టిగా కేకలు వేస్తూ అన్వేషిస్తున్నారు. బురదలో కూరుకుపోయిన 97 ఏళ్ళ వయసుగల ఒక వృద్ధ స్త్రీని సైనికులు ప్రాణాలతో కాపాడి జె.సి.బి. మిషన్‌లో కూర్చోబెట్టి తీసుకువెళుతున్న దృశ్యం ఇప్పుడు నేపాల్ పరిస్థితులకు ఒక దర్పణ చిత్రంగా మారింది.వరద ముంచుకువస్తున్న సమయంలో చైనా సైనిక అధికారి హాంగ్ పెంగ్ ప్రజలను ఇళ్ళు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోవాలని ఆదేశాలు జారీ చేస్తూ వెళ్ళారు. ఆయన చేసిన కృషి సిసి టివి కెమెరాలలో తరువాయి 8లో



## అర్హత ఉన్న ఏ ఒక్కరూ
# ఓటు హక్కు కోల్పోవద్దు

అనర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చనీయొద్దు

అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువు పొడిగించాలని

ఇసికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ కారణంగా అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఓటరు ఎవరూ జాబితాలో చేరకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు సమర్పించే గడువును పొడిగించడంతో పాటు ఓటర్లకు తగిన సమయం, అవసరమైన సహాయం అందించేలా విధానపరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. రాష్ట్రంలో 2026 జూన్ 10 నాటికి 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని (21.7 శాతం) గైర్హాజరైన, నివాసం మారిన, మరణించిన, ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా (ఎఎస్‌డిడి) గుర్తించినట్లు సిఎం రేవంత్ రెడ్డి తన లేఖలో ఈసి గణాంకాలను ఉటంకించారు. ఈ వర్గంలో దాదాపు 62 శాతం మంది అంటే 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మరోవైపు డిజిటలైజ్ చేసిన 2.65 కోట్ల గణన పత్రాల్లో 60.50 లక్షల పత్రాల్లో లోపాలు ఉండగా, 32.36 లక్షల పత్రాలకు గత ఓటర్ల తరువాయి 8లో

# ఉద్యమకారులకు అండగా నిలబడదాం

**అది ప్రజా ప్రభుత్వ బాధ్యత**

వారి సంక్షేమానికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయండి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సిఎంతో భేటీ అయిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కెకె నేతృత్వంలోని ప్రతినిధి బృందం

ప్రజాపక్షం/హైదరాబాద్

స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలను, భవిష్యత్తును పణంగా పెట్టిన తెలంగాణ ఉద్యమకారుల సేవలను గుర్తించి, వారి కుటుంబాలకు అండగా నిలవడం ప్రజా ప్రభుత్వ బాధ్యత అని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమానికి సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం సచివాలయంలో సిఎంతో భేటీ తరువాయి 8లో



## చిన్ననీటిపారుదల చట్టం రూపొందించండి

- చెరువుల ఎఫ్‌టిఎల్ సరిహద్దులను గుర్తించి, ఆక్రమణల నుంచి పరిరక్షించండి
- చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను కలిపే కమాండ్ ఆధారిత నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయండి
- సిఎంకు రైతుసంఘం కమిషన్ సూచన

03

రైతుల సమస్యల పరిష్కారానికి
# కేంద్రంపై ఒత్తిడి తేవాలి

కాంగ్రెస్ ఎంపి మల్లు రవికి సంయుక్త కిసాన్ మోర్చా నేతల వినతి



ప్రజాపక్షం /హైదరాబాద్

రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవిని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకులు కోరారు. 2021 రైతు ఉద్యమం సందర్భంగా కేంద్రం ఇచ్చిన లిఖితపూర్వక హామీలను అమలు చేయాసేలా ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్లు పశ్యపద్మ, టి.సాగర్, కోకన్వీనర్లు వి.ప్రభాకర్, జె.వెంకటయ్య, ఎన్.భిక్షపి, బి.రాము, విజయ్‌లతో కూడిన ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో మల్లురవికి వినతి పత్రం అందజేశారు. అన్ని పంటలకు సి2+50 శాతం ప్రాతిపదికన చట్టబద్ధమైన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి), ప్రభుత్వ కొనుగోలు హామీ తరువాయి 12లో



# ఎఐటియుసి విజయం

## 23 కీలక డిమాండ్లకు సింగరేణి అంగీకారం

ఒప్పంద పత్రాలపై యాజమాన్యం, ఎఐటియుసి ప్రతినిధులు సంతకాలు

ప్రజాపక్షం/చుంచుపల్లి

సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి చేపట్టిన నిరంతర పోరాటం మరో కీలక విజయాన్ని సాధించింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి ఫలించింది. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూన్ 8న ఎఐటియుసి ఇచ్చిన సమ్మె నోటీసుపై ఆర్‌ఎల్‌సీ సమక్షంలో పలుమార్లు జరిగిన చర్చల అనంతరం గురువారం రాత్రి సింగరేణి యాజమాన్యం 23 కీలక డిమాండ్లపై సానుకూలంగా స్పందించి ఒప్పందాలకు అంగీకరించింది. పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యం భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షలు, ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహణ, 2025–26 వాస్తవ లాభాల ప్రకటన, ట్రాన్స్‌ఫర్లలో మూడేళ్ల నిబంధన తొలగింపు, సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు ఓవర్‌మెన్ ప్రమోషన్లపై అంగీకారం లభించింది. అలాగే మారుపేర్ల సమస్యకు కమిటీ, హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుపై సానుకూలత, 22 ఏళ్లుగా మారని మెడికల్ అటెండెన్స్ తరువాయి 8లో

చిచ్చుపెట్టిన వేపచెట్టు
# ఇద్దరు దారుణహత్య

- సూర్యాపేట జిల్లా ఎర్రగట్టు తండాలో భగ్గుమన్న కక్షలు
- అడ్డుకున్న ఎస్ఐపైనా రాళ్ల దాడి



ప్రజాపక్షం/మేళ్లచెరువు

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల పరిధిలోని ఎర్రగట్టు తండాలో వేపచెట్టు విషయమై రెండు వర్గాల మధ్య రేగిన వివాదం తీవ్ర ఘర్షణకు దారి తీసింది. గత పది ఏళ్లుగా ఇరుపక్షాల మధ్య నడుస్తున్న ఈ వివాదం శనివారం ఒక్కసారిగా భగ్గుమన్నది. ఘర్షణలో ఇద్దరు వ్యక్తులు దారుణ హత్యకు గురయ్యారు. మేళ్లచెరువు ఎస్ఐకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వేపచెట్టు విషయంలో మంద వెంకటేశ్వర్లు యాదవ్ (60)పై భూక్య రాము గొడ్డలితో విచక్షణ రహితంగా దాడి చేశారు. ఈ క్రమంలో గొడవను ఆపటానికి వచ్చిన తండ్రి భూక్యసైదాపై కూడా దాడికి తెగబడ్డాడు. మాకు సపోర్టు చేయకుండా వాళ్లకు సపోర్టు చేస్తున్నావా అంటూ తండ్రిపైనే దాడికి పాల్పడటం స్థానికులలో తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో వెంకటేశ్వర్లు అక్కడిక్కడే మృతి చెందగా, రాము తండ్రి సైదా 108 వాహనంలో ఆసుపత్రికి తరువాయి 12లో



పాలిటెక్నిక్‌లను
# సాంకేతిక విద్యాశాఖలోనే కొనసాగించాలి

ఉన్నతస్థాయి కమిటీకి జెఎసి ప్రతినిధులు విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించిన ‘జిఒ 97’ వివాద నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ శనివారం సంప్రదింపుల ప్రక్రియను మొదలు పెట్టింది. హైదరాబాద్‌లోని సచివాలయంలో కమిటీ చైర్మన్ కె.కేశవరావు అధ్యక్షతన తెలంగాణ పాలిటెక్నిక్ జాయింట్ యాక్షన్ కమిటీ (టిపిజెఎసి) ప్రతినిధి బృందంతో ఉన్నత స్థాయి కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రొఫెసర్ శాంతసిన్హా,ఇందన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల విషయంలో ఉన్న అనుమానాలు, ఆందోళనలు, ప్రభుత్వ వైఖరి, జిఒ 97 తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ముఖ్యంగా జిఒ 97 పట్ల ఉన్న అభ్యంతరాలు, అనుమానాలపైన తరువాయి 12లో



‘బద్లావ్ జరూరీ హై’ ర్యాలీకోసం
# కదిలిన ఎర్రదండు

ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఏర్పాట్లను పరిశీలించిన సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తదితరులు

12

వలస పాలన నుంచి విముక్తే స్వాతంత్ర్యం కాదు
# ప్రతి పౌరుడూ స్వేచ్ఛ పొందాలి

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యురాలు డాక్టర్ మేనక గురుస్వామి

ఎస్. జైపాల్ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ‘భారత రాజ్యాంగం–పరిరక్షణ’పై సదస్సు




ప్రజాపక్షం/హైదరాబాద్

భారత రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం, భావవ్యక్తీకరణ శాంతియుతంగా నిరసన తెలిపే హక్కులని, అవి కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రజల నిజజీవితాల్లోను ప్రతిబింబించాల్సి అవసరముందని సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యురాలు డాక్టర్ మేనక గురుస్వామి అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యం అనేది కేవలం వలస పాలన నుంచి విముక్తి పొందడం మాత్రమే కాదని, ఆ స్వేచ్ఛను ప్రతి దేశ పౌరుడు పొందినప్పుడే దాని సార్థకత నెరవేరుతుందన్నారు. హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా), విశ్వేశ్వరయ్య భవన్ ఎస్. జైపాల్ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంథన్ ఫౌండేషన్ సహకారంతో శనివారం జరిగిన ‘భారత రాజ్యాంగం పరిరక్షణ’ అనే అంశంపై మేనక గురుస్వామి, తరువాయి 12లో






## నైపుణ్యానికి అసలైన ధర!






అత్యంత ఆకర్షణీయమైన కథ ఒకటి 1920 ప్రాంతంలో జరిగినట్లు ప్రచారంలో ఉంది. ఇందులోని ప్రతి చారిత్రక వివరానికి పూర్తి ఆధారాలు లేకపోయినా, నిపుణుల జ్ఞానం, అనుభవం విలువను వివరించే సందేశం మాత్రం ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. తరతరాలుగా వినిపిస్తున్న కథనం ప్రకారం, హెన్రీ ఫోర్డ్‌కు చెందిన ఒక కర్మాగారంలో భారీ విద్యుత్ జనరేటర్ అకస్మాత్తుగా పనిచేయడం ఆగిపోయింది. దాంతో మొత్తం ఉత్పత్తి నిలిచిపోయి కంపెనీకి భారీ నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. సంస్థలోని ఇంజినీర్లు రోజుల తరబడి యంత్రాన్ని పరిశీలించారు. వైర్లు, కనెక్షన్లు, సాంకేతిక పత్రాలు అన్నీ పరిశీలించినప్పటికీ లోపం ఎక్కడ ఉందో గుర్తించలేకపోయారు. చివరకు ప్రసిద్ధ విద్యుత్ ఇంజినీర్ చార్లెస్ ప్రోటియస్ స్టెయిన్‌మెట్జ్‌ను పిలిపించారు. ఆయన వెంటనే మరమ్మతులు ప్రారంభించకుండా, రెండు రోజుల పాటు జనరేటర్ పనితీరును పరిశీలించి, కొలతలు తీసుకుని, లెక్కలు వేశారు. అనంతరం ఒక నిచ్చెన, కొలతల పట్టీ, సుద్దముక్క తీసుకురమ్మని చెప్పారు. జనరేటర్‌లో ఒక నిర్దిష్ట ప్రాంతంలో సుద్దతో గుర్తు పెట్టి, అక్కడి కాయిల్‌లోని పదహారు చుట్టలను తొలగించాలని సూచించారు. ఇంజినీర్లు అలాగే చేయగా, అసలు సమస్య అక్కడే ఉందని తేలింది. మరమ్మతుల తర్వాత జనరేటర్ మళ్లీ పనిచేయడం ప్రారంభించింది. కొన్ని రోజుల తర్వాత స్టెయిన్‌మెట్జ్ పంపిన బిల్లు చూసి ఫోర్డ్ ఆశ్చర్యపోయాడట. ఎందుకంటే, ఆ మొత్తం అక్షరాలా 10,000 డాలర్లు. ఆ రోజుల్లో ఇది అత్యంత భారీ మొత్తం. ఆ బిల్లులో స్టెయిన్‌మెట్జ్ వివరాలను ఈ విధంగా ఇచ్చాడట..

**సుద్దతో గుర్తు పెట్టడం: 1 డాలర్**
**ఆ గుర్తు సరైన చోట ఎక్కడ పెట్టాలో తెలుసుకోవడం: 9,999 డాలర్లు**

ఈ కథలోని అసలు సందేశం ఏమిటంటే, నిపుణుడికి చెల్లించే మొత్తం అతను చేసిన పనికి పట్టిన సమయాన్ని మాత్రమే ప్రతిబింబించదు. ఆ పని వెనుక ఉన్న సంవత్సరాల అధ్యయనం, అనుభవం, పరిశీలనా శక్తి, సమస్య పరిష్కార నైపుణ్యానికి విలువ ఉంటుంది. ఏదైనమా సమస్యకు సరైన స్థానాన్ని గుర్తించగల సామర్థ్యం మాత్రం లోతైన జ్ఞానం, అనుభవం ద్వారా వస్తుంది. నిపుణుల సేవలు ఖరీదైనవిగా కనిపించినప్పటికీ, వారి పరిజ్ఞానం వల్ల తప్పించుకునే నష్టం, ఆదా అయ్యే సమయం వాటి అసలైన విలువను తెలియజేస్తాయి.

## 'డిజిటల్' మరణాలు



ఇంటర్నెట్ వినియోగం, ఆన్‌లైన్ గేమింగ్, లైవ్ స్ట్రీమింగ్ వంటి డిజిటల్ కార్యకలాపాలు పెరిగిన తర్వాత, అధిక సమయం స్క్రీన్ ముందు గడపడం వల్ల కలిగే ఆరోగ్య ప్రమాదాలపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. చైనాలో 2011లో సన్ డాన్లిన్ అనే యువకుడు సుమారు మూడు రోజుల పాటు నిరంతరం ఆన్‌లైన్ గేమింగ్ చేసిన తర్వాత ఇంటర్నెట్ కేఫ్‌లోనే కుప్పకూలి మరణించిన ఘటన డిజిటల్ వ్యసనంపై పెద్ద చర్చకు దారితీసింది. ఈ మరణానికి తీవ్రమైన అలసట, శారీరక ఒత్తిడి వంటి అంశాలు కారణాలుగా పేర్కొన్నారు. అలాగే చైనాకు చెందిన వూ యోంగ్‌నింగ్ అనే యువకుడు ఎత్తైన భవనాలపై ప్రమాదకర విన్యాసాలు చేస్తూ వీడియోలు రూపొందించేవాడు. 2017లో ఒక లైవ్ వీడియో సమయంలో భవనం నుంచి పడిపోయి మరణించాడు. ఈ ఘటన అధిక వీక్షణలు, సోషల్ మీడియా గుర్తింపు కోసం ప్రాణాలను పణంగా పెట్టే ధోరణి ఎంత ప్రమాదకరమో చూపించింది. చైనాలో కొంతమంది గేమ్ స్ట్రీమర్లు రోజుకు 10 నుంచి 15 గంటల వరకు స్ట్రీమింగ్ చేయడం, నిద్రను నిర్లక్ష్యం చేయడం వల్ల అలసట, గుండె సంబంధిత సమస్యలు ఎదుర్కొన్నట్లు నివేదికలు ఉన్నాయి. అయితే ప్రతి ఘటనను నేరుగా ఓవర్‌వర్క్ వల్ల మరణంగా నిర్ధారించలేం. జపాన్‌లో 'కరోషి' అనే భావన మాత్రం అధికారికంగా గుర్తింపు పొందిన సామాజిక సమస్య. అధిక పని గంటలు, నిరంతర ఒత్తిడి, నిద్రలేమి కారణంగా గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యలు రావచ్చని అక్కడ గుర్తించారు. అధిక పని ఒక్కటే ఆకస్మిక మరణానికి కారణమని చెప్పలేకపోయినప్పటికీ, దీనివల్ల అనర్థాలు ఎన్నో ఉన్నాయనడంలో తప్పులేదు. జీవనశైలి, దీర్ఘకాలిక ఒత్తిడి, ఆరోగ్య నిర్లక్ష్యం వంటి అనేక అంశాలు కూడా ప్రమాద అవకాశాలను పెంచుతాయి. కాబట్టి, చేసే పని ఏదైనా క్రమశిక్షణ ముఖ్యం.

## జీవపదార్థాలుగా మారే ప్లాస్టిక్!



ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యం అత్యంత తీవ్రమైన పర్యావరణ సమస్యగా మారింది. ముఖ్యంగా ఒకసారి మాత్రమే ఉపయోగించి పారేసే ప్లాస్టిక్ వస్తువులు వందల ఏళ్ల పాటు నేలలో, సముద్రాల్లో అలాగే మిగిలిపోతాయి. కాలక్రమంలో ఇవి చిన్నచిన్న మైక్రోప్లాస్టిక్ కణాలుగా విడిపోయి నీరు, ఆహారం, గాలి ద్వారా జీవుల్లోకి చేరుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం శాస్త్రవేత్తలు స్వయంగా విచ్ఛిన్నమయ్యే కొత్తరకం ప్లాస్టిక్ (సెల్ఫ్‌డిస్ట్రక్టింగ్ ప్లాస్టిక్)ను అభివృద్ధి చేశారు. దీని తయారీ సమయంలోనే జన్యుపరంగా రూపకల్పన చేసిన ప్రయోజనకర బ్యాక్టీరియాలను ప్లాస్టిక్‌లోనే భద్రపరిచారు. సాధారణ పరిస్థితుల్లో ఈ బ్యాక్టీరియా క్రియాశీలంగా ఉండదు. కానీ ప్లాస్టిక్ ఉపయోగం పూర్తయిన తర్వాత నిర్దిష్ట పరిస్థితులను కల్పించినప్పుడు అవి మేల్కొని పనిచేయడం ప్రారంభిస్తాయి. ఆ తర్వాత ప్లాస్టిక్‌లోని పాలిమర్ గొలుసులను విచ్ఛిన్నం చేసే ఎంజైమ్‌లను విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియ వల్ల ప్లాస్టిక్ కేవలం చిన్న ముక్కలుగా విరిగిపోతుంది. ఆ తర్వాత పూర్తిగా జీవపదార్థాలుగా విచ్ఛిన్నమవుతుంది. ముఖ్యంగా ఆరు రోజుల్లోనే అది పూర్తిగా కుళ్లిపోతుంది. ఈ ప్రక్రియలో మైక్రోప్లాస్టిక్ కణాలు ఏర్పడకపోవడం ఈ సాంకేతికతలో అత్యంత కీలకమైన అంశం. ప్రస్తుతం వినియోగంలో ఉన్న చాలా బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్‌లు కూడా కొన్నిసార్లు సూక్ష్మ ప్లాస్టిక్ కణాలను మిగులుస్తాయి. కానీ ఈ కొత్త విధానం ఆ సమస్యను గణనీయంగా తగ్గించే అవకాశాన్ని చూపిస్తోంది. ఈ సాంకేతికత విజయవంతంగా వాణిజ్య స్థాయికి చేరితే, ఆహార ప్యాకేజింగ్, వైద్య వినియోగ వస్తువులు, డెలివరీ కవర్లు, షాపింగ్ సంచులు వంటి ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ ఉత్పత్తులకు పర్యావరణహిత ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంది. అయితే ఇది ఇంకా పరిశోధన దశలోనే ఉంది. పెద్ద ఎత్తున తయారీ, ఖర్చు, నిల్వ సామర్థ్యం, పర్యావరణ భద్రత వంటి అంశాలపై మరిన్ని పరీక్షలు అవసరం. అయినప్పటికీ, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించే దిశగా ఇది అత్యంత ఆశాజనకమైన ఆవిష్కరణగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

– బిఎస్ఎస్ మైత్రేయి

# విద్యావ్యవస్థపై క్రూర పరిహాసం

ఇంతకాలం విద్యార్థుల సమస్యల్ని, విద్యాలయాల్లో కనీస వసతులను పట్టించుకోని ప్రభుత్వాలు ఇప్పుడు విద్యార్థుల ఆందోళన అంటే ఉలిక్కిపడుతున్నాయి. ఆల్ఫా జీ (పాఠశాల విద్యార్థులు) జన్ జీ (హైస్కూలు, కాలేజీ విద్యార్థులు) రోడ్డెక్కగానే మంత్రులు పరుగుపరుగున వచ్చి చర్చలు జరుపుతున్నారు. ఇది ముఖ్యంగా ఉత్తరాదిన బిజెపి పాలిత రాష్ట్రాల్లో కనిపిస్తున్నది. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) జంతర్‌మంతర్ ఆందోళన కేంద్ర ప్రభుత్వాన్ని గడగడలాడించడం తెలిసిందే. విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో అటువంటి తొలి ఘటన. విద్యార్థుల పార్లమెంట్ మార్చ్ (జులై 25) సందర్భంగా శృతిమించిన పోలీసు హింసపై సుప్రీంకోర్టు ఉన్నత స్థాయి దర్యాప్తు ఆదేశించగా, విద్యార్థులపై కేసులు ఉపసంహరణ హామీని పూర్తిగా అమలు చేయకుండా హోంశాఖ తలాయిస్తున్నది. దీనిపై మరోసారి ఆందోళనను సిజెపి హెచ్చరించింది. ఇదిలా ఉండగా, యువతరం ఆందోళన వారి తల్లిదండ్రులను ప్రభావితం చేస్తే ఓట్లు కోల్పోతామని భయపడుతున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ తల్లిదండ్రులకు విజ్ఞప్తులతో పాటు విద్యార్థులతో సంబంధాలు వృద్ధి చేసుకోవాలని నిర్ణయించాయి. మంత్రులు రోజుకొక యూనివర్సిటీ సందర్శించి విద్యార్థులతో సంభాషించి వారి సమస్యలు, మనోభావాలు తెలుసుకోవాలని బిజెపి జాతీయ కార్యవర్గం ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమక్షంలో నిర్ణయం తీసుకుందంటే, సిజెపి ఆందోళన పిలుపుకు వచ్చిన స్పందన బిజెపి పునాదులను ఎంతగా కుదిపిందో అర్థం చేసుకోవచ్చు. జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) ప్రక్షాళన, పోటీ పరీక్షల నిర్వహణను కట్టుదిట్టం చేసేందుకై నందన్ నీలేకని అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు, ఆగస్టు 15న ఎర్రకోట నుంచి ప్రసంగంలో ప్రధాని మోదీ యువతను ప్రత్యేకించి ప్రస్తావించి వివిధ పరీక్షలకు ప్రకటించిన ఆన్‌లైన్ కోచింగ్, కోటిమందికి ఎఐ ఆధారిత శిక్షణ వగైరా అన్నీ ప్రభుత్వ జఢత్వాన్ని వదలగొట్టిన ఈ దేశ యువత శాంతియుత ఆందోళన ఫలితాలే.

అయితే ఎదురులేని, తిరుగులేని వ్యక్తిగా ఏకపక్ష పాలన సాగిస్తున్న మోదీలో మార్పుకు కారణం విద్యావ్యవస్థను మెరుగుపరిచే సత్సంకల్పం కన్నా కోల్పోయిన సానుభూతిని బుజ్జగింపు రాజకీయాలతో తిరిగి పొందే ప్రయత్నం. సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రిత్వశాఖ కింద పోటీ పరీక్షలకు పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ పథకం ఇప్పటికే ఉంది. మూడేళ్లలో 10,500 మంది అభ్యర్థుల నమోదు దానికి నిర్దేశించిన లక్ష్యం. అయితే 2790 మంది అభ్యర్థులే నమోదైనట్లు, పర్యవసానంగా దాని బడ్జెట్ ఏటేటా కోత పెట్టినట్లు ఆ మంత్రిత్వ శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం ఆగస్టు 10న పార్లమెంటుకు సమర్పించిన నివేదిక వెల్లడించింది. తల్లిదండ్రులపై కోచింగ్ ఫీజుల భారం ప్రధానికి ఇప్పుడే గుర్తుకొచ్చిందా? పై అనుభవాన్ని బట్టి ప్రధాని కొత్త హామీ నెరవేరుతుందని ఎవరైనా ఆశించగలరా?

విద్యార్థుల ఆందోళనలను అణచివేసేందుకు పోలీసును ప్రయోగించే రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు విద్యార్థులు అనగానే ఉలిక్కిపడుతున్నాయి. రాజస్థాన్‌లో పాఠశాల తనిఖీకి వెళ్లిన సిజెపి నాయకులపై బిజెపి కార్యకర్తలు మూర్ఖంగా దాడి చేసిన మరునాడే మంత్రి అక్కడికి వెళ్లి విద్యార్థులకు వసతులు ఆదేశించారు. మధ్యప్రదేశ్ స్కూల్ పిల్లలు ప్లకార్డులు చేబూని ప్రదర్శన తీయగానే మంత్రి పరుగున వెళ్లి వాళ్ళ సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. ఛత్తీస్‌ఘడ్ దుర్గ్ జిల్లాలో ఆల్ఫా తరం పిల్లలు తల్లిదండ్రుల అండతో ప్రదర్శన జరపగానే స్కూలు విద్యామంత్రి హుటాహుటిన వెళ్లి స్కూలు హెడ్మాస్టర్‌ను బదిలీ చేశారు. అర్హత గల టీచర్లను నియమించారు. ఇదిలావుండగా, బిహార్‌లో విద్యార్థుల ఆందోళనపై అణచివేత చర్యలకు పాల్పడిన బిజెపి ముఖ్యమంత్రి దిగివచ్చారు. స్కూల్ పరీక్షల బోర్డు పరీక్షలో ఉత్తీర్ణతకు అర్హత మార్కులు సాధించని విద్యార్థుల మార్కు షీట్లపై ''ఫెయిల్'' అని రాయకుండా, ''నైపుణ్య శిక్షణకు అర్హులు'' అని రాయాలని నిర్ణయించారు. టీచర్లు విద్యార్థుల మధ్య నిత్య సంబంధం కోసం 9–12 తరగతుల వారి కోసం ''విద్యా సాథి'' యాప్ కూడా ప్రారంభించారు, శనివారం స్కూలు సమయాన్ని ఒంటి పూటకు పరిమితం చేశారు. పరీక్షల సంస్కరణల కోసం నిపుణుల కమిటీ నియమించారు. కొన్ని రాష్ట్రాలు విద్యా బడ్జెట్‌ను పెంచాయి.

ప్రశ్నాపత్రాల లీకేజీ సమస్యలపై ఇంతరగడ, దిద్దుబాటు చర్యలు జరుగుతున్నా ఆ అవినీతి చోర కళ యథావిధిగా జరుగుతూనే ఉంది. ఛత్తీస్‌ఘడ్‌లోని ఇందిరాగాంధీ కృషీ విద్యాలయం బిఎస్‌సి అగ్రికల్చరల్ మొదటి సంవత్సరం పరీక్ష రద్దు చేసింది. ఇది ఆ యూనివర్శిటీలో 20 రోజుల్లో మూడవ ఉదంతం. కాగా మహారాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నాపత్రం లీకేజీ రూఢీ కావడంతో ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ల రిక్రూట్‌మెంట్ పరీక్షలు రద్దు చేసింది. ఈ పరిస్థితులు మన విద్యావ్యవస్థ తీరుతెన్నులపై క్రూరమైన పరిహాసం!

'పరిశ్రమ' నిర్వచనంపై

# సుప్రీంకోర్టు తీర్పు కార్మికులకు శరాఘాతం



వి.యస్.బోస్
(ఎఐటియుసి మాజీ పూర్వ ప్రధాన కార్యదర్శి)
9391356527

2026 ఆగస్టు 20న, భారత సుప్రీంకోర్టుకు చెందిన తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం, కొత్త కార్మిక వివాదాలకు సంబంధించి 'పరిశ్రమ' అనే పదాన్ని పునర్నిర్వచిస్తూ ఒక తీర్పును వెలువరించింది. ఈ కొత్త నిర్వచనం అనిశ్చితిని సృష్టించడమే కాకుండా, అనేక మంది కార్మికులకు ఉన్న కీలకమైన రక్షణలను బలహీనపరిచే అవకాశం ఉంది. ఈ తీర్పు, సాంకేతిక గారడీని చాకచక్యంగా ఉపయోగించి, 'పరిశ్రమ' అనే నిర్వచనాన్నే మార్చివేసింది. ప్రభుత్వ ఆధీనంలోని పారిశ్రామిక నిట్లను పరిశ్రమలుగా పరిగణించలేమని, అందువల్ల 1947 పారిశ్రామిక వివాదాల చట్టం ద్వారా హామీ ఇవ్వబడిన మరియు తరువాత 1978 సుప్రీంకోర్టు తీర్పులో ధృవీకరించబడిన అనేక రక్షణలు ప్రభుత్వ పారిశ్రామిక యూనిట్లలో పనిచేసే కార్మికులకు ఇకపై వర్తించవని (5:4 తేడాతో) తీర్పు ఇచ్చింది. దీనర్థం ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలు (బిహెచ్ఇఎల్, హెచ్ఎంటి, ఇసిఐఎల్ లాంటి పరిశ్రమలు) అలాగే ప్రభుత్వం నడుపుతున్న ఎన్ఎఫ్‌సి, డిఫెన్స్ లాంటి పరిశ్రమలు, విద్య, వైద్యం లాంటి సంస్థల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు ఈ తీర్పు మూలంగా దాదాపు అన్ని ప్రయోజనాలను, హక్కులు కోల్పోయే భయంకరమైన పరిస్థితిని సృష్టిస్తున్నది. కార్మిక వ్యతిరేక 2020 పారిశ్రామిక సంబంధాల కోడ్ అమలును మరింత బలోపేతం చేస్తుంది. దీనితో కార్మికుల శ్రమను దోపిడి చేస్తున్న పారిశ్రామిక వేత్తలకు మరింత వెసులుబాటు కలుగజేస్తున్నది.

1978లో కృష్ణ అయ్యర్, ఇతరుల నేతత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం, భారత కార్మిక చట్టం 1947 పారిశ్రామిక వివాదాల చట్టంలోని సెక్షన్ 2(జె) ప్రకారం ''పరిశ్రమ''గా దేనిని పరిగణించవచ్చో నిర్వచించే 'త్రివిధ పరీక్ష'ను రూపొందించింది. ఈ నిర్వచనం ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, నీటిపారుదల, అటవీ వంటి అనేక సంస్థలకు, వాటి ఉద్యోగులకు పారిశ్రామిక వివాదాల చట్టం కింద రక్షణ పొందేందుకు వీలు కల్పించింది. గత వారం జస్టిస్ సూర్యకాంత్ నేతత్వంలోని 9 మంది న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం, 1978 నాటి బెంగళూరు నీటి సరఫరా కేసును పునఃసమీక్షిస్తూ... బెంగళూరు (వాటర్ సప్లై సీవరేజ్ బోర్డ్ వర్సెస్ ఆర్.రాజప్ప ఇతరులు) కేసులో, త్రివిధ పరీక్షలోని కొన్ని అంశాలు మరియు బెంగళూరు వాటర్ సప్లై కేసులో రూపొందించిన మార్గదర్శకాలకు మరింత లోతైన పరిశీలన అవసరమని తీర్పు ఇచ్చింది. ముఖ్యంగా, ప్రభుత్వ విభాగాలు, విశ్వవిద్యాలయాలు మరియు ఆసుపత్రులలో పనిచేసే కార్మికులకు ఇప్పటికీ 'పరిశ్రమ' అనే పదం వర్తిస్తుంది. సెక్షన్ 2(జె)లో ఉపయోగించిన విస్తత పదాలను వివరిస్తూ 'పరిశ్రమ' నిర్వచనం యొక్క పరిధిని మార్చుతూ కార్మికులకు సమ్మె, ఇతర హక్కులు అనుమతించబడవు, ఎందుకంటే అవి 'సమాజ సేవ' అనే విధానంతో పనిచేసే సంస్థలు కావున అందుకోసం మేము ట్రిపుల్ టెస్ట్‌ను పునఃరూపకల్పన చేయాలని ప్రతిపాదిస్తున్నాము,'' అని సిజెఐ కాంత్ ట్రిపుల్ టెస్ట్‌ను పునఃరూపకల్పన చేయవలసిన అవసరాన్ని నొక్కిచెబుతూ, సామాజిక సంక్షేమ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలు సమాజ సేవ ఉద్దేశ్యాన్ని కలిగి ఉంటాయని, వాటి విధులు వాణిజ్య సంస్థలను పోలిన సంస్థాగత లేదా కార్యాచరణ అంశాలను కలిగి ఉన్నప్పటికీ, వాటిని ''పారిశ్రామిక కార్యకలాపాలు''గా పరిగణించలేమని అభిప్రాయపడ్డారు. అయితే, 5:4 మెజారిటీతో, పారిశ్రామిక సంబంధాల కోడ్ కింద ''పరిశ్రమ''ను నిర్వచించడానికి ''ట్రిపుల్ టెస్ట్''ను మెరుగుపరుస్తూ నలుగురు న్యాయమూర్తులు తీర్పు ఇచ్చారు. న్యాయమూర్తులు బి.వి.నాగరత్న, దీపాంకర్ దత్తా, ఉజ్జ్వల్ భూయాన్, జయమల్య బాగ్చి తమ భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'కొత్త నిర్వచనం, 1947 పారిశ్రామిక వివాదాల చట్టంలోని సెక్షన్ 2 (జె) పరిధిని విస్మరించటమే కాకుండా, సంక్షేమ, ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధంగా ఉందని తెలియజేస్తున్నాము. అందుకే వారి తీర్పును అమలు చేయరాదని కోరుతున్నాము' అని పేర్కొన్నారు.



చట్టాల సాధన కోసం గత కాలంలో కార్మికవర్గ పోరాటాలు, చట్టాలు రూపొందించిన సమయంలో ఉన్న పారిశ్రామిక, సామాజిక పరిస్థితులను పక్కనపెట్టి మారుతున్న సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకోకుండా న్యాయమూర్తులు తీర్పులు చెప్పటం మన దేశానికి పట్టిన దుర్గతి, కొత్తగా సమాజంలో ఏర్పడ్డ ఫ్లాట్‌ఫాం, యాప్ ఆధారిత లాంటి కొత్త రంగాలలో పనిచేస్తున్న కార్మికులు తమకు ఉద్యోగ భద్రత, సామాజిక సంక్షేమ పథకాలు వాటికి అనుగుణంగా చట్టాలు రూపొందించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేయటం, సామూహిక సమ్మెలు చేయటంతో ప్రభుత్వాలు దిగివచ్చి వారి డిమాండ్‌లను పరిష్కారం చేయటానికి మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులను సుప్రీం కోర్టు న్యాయమూర్తులను పరిగణలోకి తీసుకోలేదు.

భారతదేశంలో కార్మిక సంఘాలు వాటి సామూహిక పోరాటాలు చారిత్రకంగా 1926 నాటి కార్మిక సంఘాల చట్టం, 1947 నాటి పారిశ్రామిక వివాదాల చట్టం ద్వారా సాధించబడ్డాయి. స్వాతంత్ర్య పోరాట సమయంలో జరిగిన అనేక తీవ్రమైన పోరాటాల ఫలితంగా, కార్మిక సంఘాలు సమ్మె హక్కు, కనీస వేతనాలు, పెన్షన్, బోనస్‌లు, పని ప్రదేశంలో గాయాలకు పరిహారం, మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు వంటి చట్టాలలో హామీ ఇవ్వబడిన కొన్ని ప్రయోజనాలను సాధించాయి. అయితే, ఈ ప్రాథమిక చట్టాలను రద్దు చేసి, పారిశ్రామిక సంబంధాల కోడ్, 2020గా ఏకీకృతం చేశారు. ఇది అధికారికంగా 2025 చివరిలో అమల్లోకి వచ్చింది.

పారిశ్రామిక సంబంధాల కోడ్, 2020 పైన పేర్కొన్న రక్షణలను తగ్గిస్తుంది, వారి హక్కులను పరిమితం చేస్తుంది; స్టాండింగ్ ఆర్డర్లు, పారిశ్రామిక వివాద పరిష్కార యంత్రాంగాల వంటి ఆదేశాలను తప్పించుకోవడానికి సంస్థలను అనుమతిస్తుంది. తద్వారా అధికారాన్ని ఫ్యాక్టరీ లేదా సంస్థాగత యాజమాన్యాల వైపు మళ్లిస్తుంది.

ప్రధాన కార్మిక సంఘాలైన ఎఐటియుసితో పాటు ఇతర కార్మిక సంఘాలు ఈ తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇది యాజమాన్య, కార్పొరేట్ ప్రయోజనాల వైపు మొగ్గు చూపే ఒక నిర్మాణాత్మక ధోరణి అని, దశాబ్దాలుగా స్థిరపడిన హక్కులను ఇది నిర్వీర్యం చేస్తున్నదనేది వాస్తవం. ఈ తీర్పు ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల, నయా ఉదారవాద, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిబింబిస్తున్నది. కార్మికులను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు మరింతగా నెట్టివేస్తుంది. గతంలో న్యాయమూర్తులు ప్రకటించిన అభిప్రాయాలను వక్రీకరించటంతో కార్మికులలో అసహనం పెరిగి పారిశ్రామిక శాంతికి ముప్పు ఏర్పడుతుందని పాలకులు గమనించాలి. కార్మికులు కష్టపడి సాధించుకున్న తమ ప్రాథమిక, ప్రజాస్వామ్య హక్కులు, గౌరవం, సామూహిక బేరసారాలను తిరిగి పొందేందుకు కార్మిక వర్గం చారిత్రక పోరాటాలలోకి తిరిగి వెళ్ళవలసి వస్తుంది.

# ఈ దేశ మూలవాసులపై జన్యు పరిశోధనలు



డాక్టర్ దేవరాజు మహారాజు
సుప్రసిద్ధ సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

భారతదేశ మూలవాసులెవరు? ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చినవారెవరు? తేల్చుకోవడానికి కాలక్రమంలో ఇక్కడ కులాలు ఎలా పుట్టాయన్న దానికీ– ప్రపంచ వైజ్ఞానికులు కొన్ని ముఖ్యమైన పరిశోధనలు చేశారు. ఇంకా కొందరు చేస్తూనే ఉన్నారు. మైఖేల్‌బమ్‌శద్, తూమస్ కిమిసిలిడ్, బిన్.బి. జుర్దేలు జరిపిన పరిశోధన సారాంశాన్ని క్రోడీకరించి ప్రకటించారు. భారత ఉపఖండంలో జీవిస్తున్న 1.417 (2022) బిలియన్ ప్రజల మూలాలు గూర్చి తెలుసుకోవడానికి ఈ పరిశోధనలు జరిగాయి.

ఇండో యూరోపియన్ భాష మాట్లాడే వారు కొందరు ఉత్తరాన పశ్చిమదిశ నుంచి–అంటే యురేషియా(యూరప్+ఆసియా) నుంచి వలసలు వచ్చి ద్రావిడ భాషలు మాట్లాడే దక్షిణ భారతీయులతో కలిసి క్రమంగా హిందూ కులవ్యవస్థకు పునాదులు వేశారని–అక్కడి మూలవాసుల్ని బలవంతంగా అణగదొక్కి దేవుళ్ల పేరుతో ధర్మ ప్రభోదాలు చేస్తూ.. వారిపై ఆధిపత్యం సాగిస్తూ వచ్చారని పరిశోధకులు తేల్చారు. 3 నుంచి 8 వేల ఏళ్ల మధ్య కాలంలో అనటోలియా, కాకసస్ వంటి ప్రాంతాల నుండి యురేషియన్లు వచ్చి ప్రాంతీయ స్థితిగతులపై అవగాహన పెంచుకొని మూలవాసుల భూములు ఆక్రమించుకొని, వారిని బానిసలుగా మార్చి, హిందూ కులవ్యవస్థను ప్రతిష్టాపించి అధికారం చేజిక్కించుకున్నారని ధృవపరిచారు. భారతీయులకు యూరోపియన్లతో, ఆసియా వాసులతో గల సంబంధాలు బయటపడడానికి జన్యు పరిశోధనలే శరణ్యమయ్యాయి. అంతవరకు చారిత్రక సిద్ధాంతాలుగా ఉన్న విషయాలకు వైజ్ఞానిక ఆధారాలను సమకూర్చాయి.

ఎంటి డిఎన్ఎ లేక వై–క్రోమోజోమ్ పాలిమార్ఫిజంల వల్ల ఈ దేశ జనాభాలో ఆర్యుల మూలాలున్నావారు, ఆసియా నుంచి లేదా యూరప్ నుంచి వలస వచ్చినవారేనన్నది నిర్ధారణ అయ్యింది. యురేషియన్లు అంటే ఆర్యులు. ఈ దేశంలోకి వలసలు రావడానికైనా, స్థిరపడడానికైనా నియోలిథిక్ యుగం చాలా కీలకమైంది. అలాగే ప్లిస్టోసీన్ యుగంలో జరిగిన వలసలు కూడా ముఖ్యమైనవే. బహుశా అప్పుడే ఆఫ్రికా నుంచి పశ్చిమాసియాకు, అక్కడి నుంచి దక్షిణ భారత దేశానికి వలసలు జరిగాయి. యూనివర్సిటీ ఆఫ్ ఉట్టా (యుటిఎహెచ్) అమెరికా, ఆంధ్రా యూనివర్సిటీ (ఎ.పి.ఇండియా)లలో భారత ప్రభుత్వ సహకారంతో పరిశోధనలు జరిగాయి. ఇంటిపేర్లు, పుట్టినస్థలాలు, వారి వారి కులాలు, వర్ణాలు అన్నీ నమోదు చేయబడ్డాయి. వాటితో పాటు 8మి.లీ. రక్తం, ఐదు తలవెంట్రుకలు కూడా డిఎన్ఎ పరీక్షల కోసం సేకరించడం జరిగింది. వృత్తుల, ఆర్థిక, సామాజిక స్థితిగతుల వివరాలు కూడా సేకరించడం జరిగింది. ఇందులో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య– మొదటి మూడు స్థానాల్లో/స్థాయిలలో ఉన్న వీరు రెండు సార్లు జన్మనెత్తిన వారుగా భావిస్తారు. కాపులు, యాదవులు ఒకసారిగా జన్మనెత్తిన వారిగా భావిస్తారు. వీరిది నాలుగో స్థానం. ఇక చివర ఐదో స్థానంలో ఉన్నవారు–పంచములు. వీరు అంటరానివారిగా పరిగణించబడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాతృభాషగా గల అన్ని కులాల నుంచి నమూనాలు సేకరించి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరిపి క్రిష్ణన్, రెడ్డి అనే ఇద్దరు పరిశోధకులు 1994లో ఫలితాలు ప్రకటించారు.

దీనికి మరింత బలాన్ని చేకూర్చే పరిశోధనలు మన హైదరాబాదు 'సెంటర్ ఫర్ సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ' (సిసిఎంబి)లో జరిగాయి. భారతీయ మూలవాసులు ఎవరన్నది గ్రహించడానికి డాక్టర్ తంగరాజ్ స్వయంగా అండమాన్ నికోబార్ తెగలవారి డిఎన్ఎ సేకరించి, అధ్యయనం చేసి విశ్లేషించారు. హరియాణాలో రాఖిగర్హి అనే సింధూ నాగరికతకు సంబంధించిన ప్రాంతం ఉంది. అక్కడ దొరికిన 60 అస్థిపంజరాల నుంచి ఒక పూర్తి జన్యు క్రమాన్ని పరిశోధకులు నిర్మించగలిగారు. ఇది అండమాన్ నికోబార్ తెగల జన్యు క్రమాన్ని పోలి ఉంది. అంటే హరప్పా ప్రజలకు–అండమాన్ నికోబార్‌లలో ప్రస్తుతం ఉన్న తెగల వారికి (హంటర్ గేదరర్స్) దగ్గరి సంబంధాలున్నాయి. వీరి పూర్వీకులే ఒకప్పటి హరప్పా వాసులన్న మాట!

ఇరాన్, టర్కీల నుంచి ఐదువేల ఏళ్ల క్రితం యూరప్ వైపు మాత్రమే కాకుండా ఆసియాలోని కొన్ని ప్రాంతాలకు కొందరు వలస వచ్చారని తెలిసింది. దాదాపు వెయ్యి సంవత్సరాల క్రితం హరప్పా ప్రాంతంలో నివసించిన ఒక వ్యక్తి జన్యు క్రమాన్ని సిసిఎంబి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ తంగరాజ్, అతని సహచరులు పునర్నిర్మించారు. అలాగే 524 మంది డిఎన్ఎను విశ్లేషించారు. కొన్ని వేల ఏళ్ల క్రితం జీవించిన ఇంతమంది వ్యక్తుల డిఎన్ఎ విశ్లేషించడం ఇదే ప్రథమం. హరప్పా ప్రాంతంలో 12 వేల ఏళ్ల నుంచి రెండు వేల ఏళ్ల దాకా అంటే ఇనుప యుగం వరకు జీవించి ఉన్న ప్రజల అవశేషాల నుంచి డిఎన్ఎ సేకరించగలిగారు. యూరేషియన్లు అంటే సంచార జాతి ఆర్యులు ఇక్కడి మూలవాసులుకాదు అని మైఖేల్ బమ్‌శద్ బృందం చెప్పిన విషయం. ఇక్కడ డాక్టర్ తంగ్‌రాజ్ బృందం చెప్పిన విషయం దాదాపు ఒకటే. నాణానికి ఒక వైపున్న విషయం ఒకరు చెబితే, మరొక వైపున్న విషయం మరొకరు చెప్పారు. దేశంలో అప్పటికే సుసంపన్నంగా ఉన్న సింధూ (హరప్పా) నాగరికతను హింసోన్మాద సంచార జాతి ఆర్యులు ధ్వంసం చేశారు. అది అప్పటికి శాంతి నిలయంగా ఉండేది. చివరికి వారు సప్త సింధు ప్రాంతంలో నివాసాలేర్పరుచుకుని, స్థిరపడి అనేక రకాల సాహిత్యం సృష్టించారు. దాని ప్రకారం బ్రహ్మనుదుటి నుంచి పుట్టిన వారు బ్రాహ్మణులని, వారు మాత్రమే పూజలు చేయాలని, క్షత్రియులు రాజ్యాలేలాలని, వైశ్యులు వ్యాపారాలు చేయాలని, శూద్రులు (ప్రస్తుతం ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు)పై మూడు వర్ణాల వారికి సేవలు చేస్తూ ఉండాలని రాసుకున్నారు.


వర్ణాశ్రమ ధర్మాన్ని రక్షించడానికి 'మనుస్మృతి' ని సృష్టించుకున్నారు. శూద్రుల్ని బ్రాహ్మణులు దోచుకోవచ్చనీ చెప్పారు. దానికి న్యాయబద్ధతను కల్పించుకున్నారు. అందుకే ఇప్పటికీ బ్రాహ్మణుడు పూజామంత్రాల్లో తప్పనిసరిగా 'స్వాహా ' అని అంటుంటాడు. అంటే 'నీ సంపద అంతా నాకు రానీయ్' అని కోరుకోవడమన్నమాట. మన ఇంట్లో పూజ చేస్తూనే, మన ఎదుటే మన సంపద అంతా తనకు దక్కాలని ఈ దేవుణ్ణి ప్రార్థిస్తున్నాడన్నమాట. అందుకే ఈ దేశంలో చెప్పులు కుట్టడం, డ్రైనేజీ శుభ్రం చేయడం నీచమైన పనులయిపోయాయి. ప్రజలకు ఉపయోగపడేవి, ప్రజల ఆరోగ్యం కాపాడే పనులు హీనంగా చూడబడుతున్నాయి. దేనికీ పనికిరానివి, మూర్ఖత్వంలో ముంచే పనులు పిండాలు పెట్టడం, తద్దినాలకి మంత్రాలు చదవడం వంటి పనులు చాలా ఉన్నతమైన పనులుగా చలామణి అవుతున్నాయి. సమాజానికి ఉపయోగపడేవి ఏవో, ఉపయోగ పడనివి ఏవో ఆలోచించుకునే పనే లేదా? ఆర్యులు సృష్టించిన ఈ బ్రాహ్మణీయ వ్యవస్థ చివరికి మూలవాసులైన బహుజనుల్ని అధికారానికి, ఆర్థిక సంపదకు దూరం చేసింది. విజ్ఞానానికి, సామాజిక హోదాకు దూరం చేసింది. బ్రాహ్మణీయ మనువాద వ్యవస్థ బంధాన్ని తెంచుకుని, సమానత్వం కోసమని కొందరు ఇతర మతాల్లోకి మారిన మన మూలవాసుల్ని బహుజనుల్ని ప్రస్తుతం విదేశీయులుగా ముద్ర వేస్తున్నారు. అంటే మన చేయితోనే మనం మనకన్ను పొడుచుకునే పనిని కుట్ర పూరితంగా మనతోనే చేయిస్తున్నారన్నమాట!

భారత రాజ్యాంగంతో మనువాద బ్రాహ్మణీయ వ్యవస్థను బద్దలు కొట్టి, అణగారిన వర్గాలు ఆత్మగౌరవంతో బతికే ఏర్పాటు జరిగింది. కానీ, రాజ్యాంగంపై నమ్మకం లేని మనువాదులు ప్రస్తుతం ఈ దేశాన్ని పరిపాలిస్తూ ఉండడంతో సామాజిక న్యాయం అందని ద్రాక్షే అయ్యింది. మూలవాసులైన ఈదేశ బహుజనులు విదేశీయులు కాదు. మధ్య ఆసియా నుంచి దండెత్తి వచ్చిన ఆర్య మనువాద బ్రాహ్మణ వర్గాలే విదేశీయులు! వైజ్ఞానిక పరిశోధనలన్నీ ఈ విషయాన్నే బలపరిచాయి కదా ! సింధూ నాగరికత చిహ్నాలు, ఆదివాసుల్లో, గోండుల్లో ఇప్పటికీ కనిపిస్తాయి. అలాగే గిరిజనులు రావణుడు, మహిషాసురుడు, నరకుడు తమ పూర్వీకులనుకుని పూజించడం ఉంది, బలి చక్రవర్తి రాజ్యం మళ్లీ రావాలని కేరళలో 'జనం' పండుగ చేస్తారు. ఆర్యులు వచ్చి, ఇక్కడి తెగల వారిని చంపి, వాటి చుట్టూ కథల్లి ఆ ఆదిమ జాతి వారసులి శూద్రులుగా పంచములుగా వెలివేశారు. మన పూర్వీకుల చావుల్ని పండగలని నమ్మించి మన చేత వారనుకున్న పండగలు చేయిస్తున్నారు. అనాలోచితంగా బహుజనులు ఆయా పండగలు చేస్తూనే ఉన్నారు. విశ్వాసం ఎంత గట్టి పడితే అది అంత మూఢమవుతుంది. మూఢ విశ్వాసాలు వదిలేసి బయటపడితేనే నిజాలు నిక్కచ్చిగా తెలుస్తాయి.

కులరహిత భారతీయ మానవ సమాజం రూపుదిద్దుకోవాలంటే తమిళనాడు మహిళ స్నేహ పార్దిబ రాజాను ఆదర్శంగా తీసుకోవాలి, ఎంతో సంఘర్షించి, కుల మతాలు లేని తొలి భారతీయ మహిళగా ఆమె ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ తీసుకోగలిగారు. వాస్తవ పరిస్థితుల్ని తెలియజేస్తూ ప్రధాని మోదీకో ఉత్తరం రాసిన మేధావులు మీద రాజద్రోహం కేసు పెడితే ఇక ప్రజలు ఊరికే చూస్తూ ఊరుకుంటారా? అస్సలు ఊరుకోరు. కులం మతం వద్దనేది వాటి మీద అక్కసుతో కాదు, అందరం మనుషులమే నన్న విశాలభావంతో 'మనిషి' పట్ల ఉన్న గౌరవంతో, ప్రేమతో..

# మారిషష్‌లో తెలుగుకు తెలంగాణ అండ

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
ప్రజాభవన్‌లో డిప్యూటీ సిఎంతో
మారిషస్ బృందం భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మారిషస్‌లో తెలుగు భాష, సంస్కృతి, పురాణ ఇతిహాసాలను ప్రమోట్ చేసేందుకు ఆ దేశానికి అన్ని విధాలా సహకరిస్తామని మారిషస్ ప్రతినిధులకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క్ చెప్పారు. శనివారం నాడు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల మంత్రి లచ్మనా రాజ్ పెంటియా బృందం ఉప ముఖ్యమంత్రితో భేటీ అయింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వారితో మాట్లాడుతూ తెలంగాణ మారిషస్ మధ్య సుదీర్ఘకాలంగా సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పారు. ఇరు దేశాల మధ్య ఉమ్మడి చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ప్రజల మధ్య స్నేహపూర్వ సంబంధాలున్నామని గుర్తు చేశారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల ద్వారా తెలంగాణకు మారిషష్‌తో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. మారిషస్‌లోని తెలుగు సమాజం అక్కడి గొప్ప బహుళ సాంస్కృతిక సమాజంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉందన్నారు. మారిషస్ ప్రభుత్వం చేపడుతున్న రామ భజనం కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క చెప్పారు. మారిషస్‌లోని తెలుగు కల్చరల్ సెంటర్‌లో లక్షలాది మంది తెలుగు ప్రవాసులు తమ సంస్కృతి, సంప్రదాయాలను, భాష పరిరక్షణ చేస్తున్నారని మారిషస్ మంత్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సమాజం పట్ల తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు, తెలుగు భాష, సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించేందుకు చేస్తున్న కృషి పట్ల మారిషస్ మంత్రి లచ్మనా రాజ్ ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

**తెలంగాణతో భాగస్వామ్యానికి మారిషస్ ఆసక్తి: లుచ్మనన్ పెంతియా**


తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటి, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, విద్య, టూరిజం, ఎమర్జింగ్ టెక్నాలజీల రంగాలపై అంతర్జాతీయ ఆసక్తి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ–మారిషస్ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కీలక అడుగు పడింది. మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ రిఫారమ్స్ శాఖ మంత్రి లుచ్మనన్ పెంతియా శనివారం తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పరిపాలన, టూరిజం, ఐటి,ఐటిఇఎస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, నైపుణ్యాభివృద్ధి, విద్య తదితర రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సాంకేతికత ఆధారిత కార్యక్రమాలను మారిషస్‌తో అనుసంధానం చేయడం ద్వారా రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కార్యాచరణ రూపొందించడంపై దృష్టి సారించారు. తెలంగాణ అనతికాలంలోనే అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి సాధిస్తోందని మారిషస్ మంత్రి లుచ్మనన్ పెంతియా ప్రశంసించారు. తెలంగాణను తమ దేశం అత్యంత నమ్మకమైన భాగస్వామిగా పరిగణిస్తోందని పేర్కొన్నారు. మారిషస్ ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని మరింత పెంచడంతో పాటు ఆధునిక పరిపాలనా విధానాలపై వారికి శిక్షణ అందించేందుకు తెలంగాణ సహకరించాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల శిక్షణతో పాటు తెలంగాణలోని ఎంసిహెచ్‌ఆర్‌డి, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఇతర ప్రముఖ విద్యా సంస్థలతో కలిసి పనిచేసేందుకు మారిషస్ ప్రభుత్వం ఆసక్తి చూపుతున్నట్లు లుచ్మనన్ పెంతియా తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, విద్యా రంగాల్లో తెలంగాణ అనుభవాలను మారిషస్‌కు అనుసంధానం చేసుకునే అవకాశాలపై ఆయన ఆసక్తి వ్యక్తం చేశారు.మారిషస్‌కు అన్ని రంగాల్లో అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న సాంకేతిక, విద్యా, నైపుణ్యాభివృద్ధి వనరులను అంతర్జాతీయ భాగస్వాములతో పంచుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు ఆహ్వానం..**

రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7, 8 తేదీల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2026'లో పాల్గొనాలని మంత్రి లుచ్మనన్ పెంతియాను శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణ–మారిషస్ మధ్య పెట్టుబడులు, సాంకేతికత, నైపుణ్యాలు, విద్య, పరిశ్రమల రంగాల్లో మరిన్ని భాగస్వామ్యాలకు మార్గం సుగమం అవుతుందనే ఆశాభావం వ్యక్తమైంది.ఈ సమావేశంలో పబ్లిక్ సర్వీస్ సెక్రటరీ దేవేంద్ర గోపాల్, అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ సర్వీస్ అండ్ ఇన్నోవేషన్ (ఎబిపిఎస్‌ఐ) బోర్డ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ నికోలస్ రాగోడూ, ఎబిపిఎస్‌ఐ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ దుర్బరీ, ఎంఇఎ బ్రాంచ్ సెక్రటేరియట్ హెడ్ మాధవ్ ఆర్. సుల్పులే, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీఈఅండ్‌సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## జపాన్ 'కిటాక్యూషు– తెలంగాణ టెక్నాలజీ బ్రిడ్జి' కి ప్రతిపాదన

మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని జపాన్‌లోని కిటాక్యూషు కంపెనీలను రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆహ్వానించారు. అధునాతన తయారీ, ఎఐ, రోబోటిక్స్, పారిశ్రామిక ఆటోమేషన్, సెమీకండక్టర్లు, గ్రీన్ టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో తెలంగాణ– కిటాక్యూషు మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ప్రతిపాదించారు. మంత్రి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం కిటాక్యూషు డిప్యూటీ మేయర్ చికాకో ఓబాతో సమావేశమై పారిశ్రామిక, సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి అంశాలపై చర్చించింది. హైదరాబాద్‌లోని టెక్నాలజీ, స్టార్టప్ వ్యవస్థను కిటాక్యూషు పారిశ్రామిక, ఆవిష్కరణల వ్యవస్థతో అనుసంధానించేలా 'కిటాక్యూషు తెలంగాణ టెక్నాలజీ బ్రిడ్జి' ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.

**జపాన్ కంపెనీలకు తెలంగాణ యువత నైపుణ్యాలు..**

జపాన్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతకు ప్రత్యేక శిక్షణ అందిస్తామని మంత్రి తెలిపారు. టామ్‌కామ్ ద్వారా ఉద్యోగ అవసరాలను గుర్తించి, అభ్యర్థుల ఎంపిక, ధ్రువపత్రాల పరిశీలన, జపనీస్ భాష, సాంకేతిక శిక్షణ, పని సంస్కృతి, భద్రతా ప్రమాణాలపై శిక్షణ అందించేలా వ్యవస్థను రూపొందిస్తామని చెప్పారు. తయారీ, ఎలక్ట్రానిక్స్, మొబిలిటీ, డిజిటల్ టెక్నాలజీ, పరిశోధనఅభివృద్ధి రంగాల్లో హైదరాబాద్‌ను పెట్టుబడుల కేంద్రంగా ఎంచుకోవాలని కిటాక్యూషు కంపెనీలను మంత్రి కోరారు. ఆసక్తి ఉన్న కంపెనీలను తెలంగాణకు తీసుకురావడంతో పాటు, రాష్ట్రంలోని పరిశ్రమలతో వ్యాపార భాగస్వామ్యాలను ప్రోత్సహించాలని కోరారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు కిటాక్యూషు ప్రతినిధులను మంత్రి ఆహ్వానించారు. కిటాక్యూషు పారిశ్రామిక బలాన్ని, తెలంగాణ యువత నైపుణ్యశక్తితో అనుసంధానిస్తే జపాన్ పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులు అందించడంతో పాటు తెలంగాణ యువతకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

## చిన్న నీటిపారుదల చట్టం రూపొందించాలి


సిఎంకు రైతు కమిషన్ సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టం రూపొందించాలని, చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టిఎల్) సరిహద్దులను తక్షణం గుర్తించి ఆక్రమణలను తొలగించి పరిరక్షించాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను కలిపే కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి నేతృత్వంలో సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గంగాధర్, ఎం.భవానీరెడ్డి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో శనివారం కలిసి రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థపై నివేదిక అందించారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతిక యూనిట్లతో చిన్న నీటిపారుదల వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయాలని కమిషన్ తన నివేదికలో సూచించింది. కమిషన్ సిఫారసులపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు. పంటల మార్పిడి, ఉద్యానవన పంటల సాగు పెంపు, ఎఫ్‌పిఓల ఏర్పాటు తదితర అంశాలపై కమిషన్ దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచడానికి నివేదికలో కమిషన్ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని కమిషన్ తెలిపింది. గడిచిన రెండేళ్ల కాలంలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ ప్రతినిధి బృందం వివరించింది. కమిషన్ పనితీరుపై ముఖ్యమంత్రి సంతృప్తిని వ్యక్తం చేశారు.

## నోటీసుల అందజేత, విచారణల నిర్వహణలో పారదర్శకత

కలెక్టర్లు, ఇఆర్‌ఒలతో సిఇఒ సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్2026) ప్రక్రియలో నోటీసుల జారీ, క్లెయిమ్స్, అభ్యంతరాల విచారణ, కేసుల పరిష్కారంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలను కచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులు (డిఈఓలు), ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్‌ఓలు)ను ఆదేశించారు. హైదరాబాద్ బిఆర్‌కె భవన్ నుంచి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర రెడ్డి, ఉప ప్రధాన ఎన్నికల అధికారి జి.ఎస్. చారి, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, అన్ని జిల్లాల డిఈఓలు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు. ప్రతి నోటీసును సంబంధిత ఓటరుకు బూత్ స్థాయి అధికారి (బిఎల్‌ఓ) స్వయంగా అందజేసి, అందుకున్నట్లు రసీదు తీసుకోవాలని సిఈఓ స్పష్టం చేశారు. విచారణకు కనీసం ఏడు రోజుల ముందుగానే నోటీసులు అందేలా చూడాలని, విచారణ తేదీ, సమయం, వేదికపై రెండు రోజుల ముందే ఓటరుకు బిఎల్‌ఓలు గుర్తు చేయాలని సూచించారు. ఓటర్లు సమర్పించాల్సిన నిర్దేశిత పత్రాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, విచారణల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఏఈఆర్‌ఓలు, అదనపు ఏఈఆర్‌ఓలతో సంప్రదించి సమగ్ర షెడ్యూల్ రూపొందించాలని ఆదేశించారు. నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణపై ఉన్నతస్థాయి పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. 'నో మ్యాపింగ్', 'అనామలీస్' కేసుల జాబితాలను రాజకీయ పార్టీలకు అందజేయడంతో పాటు, క్లెయిమ్స్, అభ్యంతరాల జాబితాలను ప్రతి వారం రాజకీయ పార్టీల సమావేశాల్లో పంచుకోవాలని సూ చించారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం అమలు చేసి, అన్ని చర్యలను పూర్తి స్థా యిలో నమోదు చేయాలని, అప్పుడే ఓటరు జాబితా సవరణ లక్ష్యం నెరవేరుతుందన్నారు. అనంతరం అన్ని జిల్లాల డిఈఓలతో నోటీసుల పంపిణి పురోగతి, విచారణల షెడ్యూళ్ల తయారీ, ఏఈఆర్‌ఓలు, అదనపు ఏఈఆర్‌ఓల మధ్య కేసుల కేటాయింపు తదితర అంశాలపై సిఈఓ సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నోడల్ అధికారులు, సిఎం (ఐటి) పాల్గొన్నారు.

## టికెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా

మూడు రోజుల తనిఖీల్లో పట్టుబడిన 13,964 మంది
రూ.1.28 కోట్ల ఆదాయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పండుగలు, వరుస సెలవుల నేపథ్యంలో టికెట్ లేకుండా, సరైన అనుమతులు లేకుండా ప్రయాణించే వారిపై దక్షిణ మ ధ్య రైల్వే వాణిజ్య విభాగం భారీ టికెట్ తనిఖీ డ్రైవ్ నిర్వహించింది. ఈ నెల 24 నుంచి 26 వ రకు మూడు రోజులపాటు జోన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో చేపట్టిన ఈ తనిఖీల్లో 13,964 మంది టికెట్ లేకుండా లేదా సరైన అధికారం లేకుండా ప్రయాణిస్తున్న వారిని గుర్తించారు. వారి నుం చి టికెట్ తనిఖీల ద్వారా రూ.1.28 కోట్ల ఆ దా యం రైల్వేకు సమకూరింది. టికెట్ లేని ప్రయాణికులతో పాటు క్రమరహితంగా ప్రయాణించే వా రు, బుక్ చేయని లగేజీని తరలించే ప్రయాణికులపై కూడా అధికారులు చర్యలు తీసుకున్నారు. బుక్ చేయని లగేజీతో ప్రయాణిస్తున్న 1,189 మందిని గుర్తించి జరిమానాలు వి ధించారు. రైల్వే స్టేషన్లు, ప్రాంగణాల్లో పరిశుభ్రతకు విఘాతం కలిగించే వారిపైనా అధికారులు దృష్టి సారించారు. రైల్వే ప్రాంగణంలో చెత్త వేస్తున్న 37 మందికి రూ.6,400 జరిమానా విధించారు. అనధికారికంగా వ్యాపారం చేస్తున్న ఐదుగురు వీధి వ్యాపారులను గు ర్తించి రూ.10,000 జరిమానా వసూ లు చేశారు. రైల్వే ప్రాంగణంలో ధూమపానం చేస్తున్న ఏడుగురికి రూ. 14,000 జరిమానా వి ధించారు. తనిఖీల సందర్భంగా రైల్వే సిబ్బంది ప్రయాణికులకు పలు అంశాలపై అవగాహన క ల్పించారు. సరైన, చెల్లుబాటు అయ్యే టికెట్‌తోనే ప్రయాణించాలని సూచించారు. టికెట్ లేకుండా ప్ర యాణించడం, రైల్వే నిబంధనలను ఉల్లంఘించడం వల్ల విధించే జరిమానాల గురించి వివరించారు. రైళ్లలో, రై ల్వే ప్రాంగణాల్లో ధూమపానం చేయడం వల్ల అగ్ని ప్రమాదాలుసంభవించే అవకాశముందనిహెచ్చరించా రు.

## గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో
130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు
సోమశిలలో మరో ప్రపంచస్థాయి కోర్సు..
పిపిపి విధానంలో అభివృద్ధి
పర్యాటకం, క్రీడల ప్రచారానికి కపిల్‌దేవ్ సేవలు
వినియోగించుకుంటాం: మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను ప్రపంచస్థాయి గోల్ఫ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందులో భాగంగా షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు. కృష్ణానది తీరంలో, నల్లమల అడవులు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పర్యాటక క్లస్టర్ సోమశిలలో మరో ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సోమశిలను ప్రత్యేక గోల్ఫ్ టూరిజం గమ్యస్థానంగా అభివృద్ధి చేయడంతో తెలంగాణను గోల్ఫ్ టూరిజం హబ్‌గా మరింత బలోపేతం చేయవచ్చన్నారు. గోల్ఫ్ టూరిజం మౌలిక వసతుల అభివృద్ధిలో పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ (పిపిపి) విధానాన్ని అనుసరించనున్నట్లు తెలిపారు. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్ సందర్భంగా శనివారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. డిపి వరల్డ్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా , హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి ఈవెంట్ పార్ట్‌నర్‌గా తెలంగాణ టూరిజం వ్యవహరిస్తోంది. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ కేవలం క్రీడా పోటీ మాత్రమే కాదని.. అంతర్జాతీయ గోల్ఫ్‌ను తెలంగాణ పర్యాటక, వారసత్వ సంపదతో అనుసంధానించే వేదిక అని జూపల్లి అన్నారు. గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్సులో ఈ టోర్నీ నిర్వహించడం రాష్ట్ర చరిత్ర, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం దక్కిందన్నారు. హైదరాబాద్ నగరానికే తెలంగాణ పర్యాటకం పరిమితం కాదని.. తెలంగాణలో పర్యాటకం, క్రీడల ప్రచారం కోసం కపిల్‌దేవ్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని జూపల్లి తెలిపారు. ఆయన అనుభవం, అంతర్జాతీయ గుర్తింపును రాష్ట్ర పర్యాటక, క్రీడా రంగాల ప్రచారానికి ఉపయోగించుకుంటామని చెప్పారు. టోర్నీ నిర్వహణకు సహకరిస్తున్న డీపీ వరల్ పీజీటీఐ, హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్, ఇతర భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణను ప్రపంచస్థాయి గోల్ఫ్ టూరిజం గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు ప్రపంచస్థాయి సౌకర్యాల కల్పన కొనసాగిస్తామని చెప్పారు.డిపి వరల్డ్ పిజిటిఐ అధ్యక్షుడు కపిల్‌దేవ్ తెలంగాణ టూరిజం అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. ఈ టోర్నీ ద్వారా తెలంగాణ, హైదరాబాద్‌ను ప్రముఖ గోల్ఫ్ టూరిజం గమ్యస్థానాలుగా ప్రచారం చేయవచ్చన్నారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అందిస్తున్న వేదికకు కృతజ్ఞతలు తెలిపారు.హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ కెప్టెన్ జస్వీందర్ సింగ్ బిర్గి మాట్లాడుతూ.. 12వ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌కు ఆతిథ్యమివ్వడం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ గోల్ఫర్ల ఆటను హెచ్‌జీఏ సభ్యులు వీక్షించే అవకాశం లభిస్తుందని తెలిపారు. లైవ్ టెలికాస్ట్ ద్వారా హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం అవుతుందన్నారు.

## జిఒ 560 ప్రకారం భూమిని కేటాయించాలని

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల సంక్షేమం, వృత్తి రక్షణకు రూ.5000 కోట్లు కేటాయించాలని, అన్ని సహకార సంఘాలకు వన పెంపకానికి సంబంధించిన జీఓ 560 ప్రకారం 5 నుండి 10 ఎకరాల భూమిని కేటాయించాలని, పిఎఫ్‌టిలకు గ్రామ పునాదిగా భూమి కేటాయించాలని తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ గీత పనివారల సంఘం సమావేశం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. సమావేశంలో బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ చెట్లపై నుండి పడి గాయపడిన వారి విషయంలో మెడికల్ బోర్డు సర్టిఫికెట్ ద్వారా కాకుండా గతంలో మాదిరిగా ప్రభుత్వ సివిల్ సర్జన్ ధ్రువీకరణ ద్వారా నిర్ధారించాలని, సేఫ్టీ కిట్స్, మోపెడ్లు అర్హులందరికీ అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిల్ గౌడ్ మాట్లాడుతూ సంఘం సభ్యత్వం అన్ని సహకార సంఘాలలో గ్రామాలలో వృత్తిదారులను చేర్పించాలన్నారు. సంఘం రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం కార్యకలాపాల నివేదికను సమర్పించారు. గీత పనివారల సంఘం రాష్ట్ర నాయకులు కెవిఎల్, పండ్ల రాములు, పి.యాదగిరి, బుడిగ సైదులు, దొంతు రామ్మూర్తి, నక్క నాగార్జున గౌడ్, చాపల అంజయ్య, బబ్బూరి దేవేందర్ గౌడ్, పొలగాని రవి కిషోర్, ఉడతల మల్లేష్ గీత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు.

## ఇన్‌సర్వీస్ టీచర్ల 'టిజిటెట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇన్‌సర్వీస్ టీచర్ల 'టిజిటెట్ 'పరీక్షలను సెప్టెంబర్ 8,9 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. సెషన్ 1 ఉదయం 9గంటల నుంచి 11:30 గంటల వరకు, సెషన్ 2 మధ్యాహ్నం 2గంటల నుంచి 4:30 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ శనివారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. మరిన్ని వివరాల కోసం https://schooledu.telangana.gov.in ను సంప్రదించాలని విద్యాశాఖ సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 24,983 మంది సర్వీస్ టీచర్లు టెట్ పరీక్షలు రాయనున్నారు.

## రైతుల ప్రయోజనాల కోసం సమగ్ర విత్తన చట్టం

కేంద్రం చట్టం తెచ్చినా.. తేకపోయినా
రాష్ట్రంలో కొత్త చట్టం అమలు
మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సమగ్ర విత్తన చట్టాన్ని వచ్చే పంటకాలం నుంచైనా అమల్లోకి తీసుకురావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో డ్రాఫ్ట్ విత్తన చట్టం2025పై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన.. నకిలీ, నాసిరకం విత్తనాల వల్ల నష్టపోయే రైతులకు పరిహారం అందేలా చట్టబద్ధమైన వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు.రాష్ట్ర విత్తన బిల్లు డ్రాఫ్ట్ కమిటీ ఇప్పటికే రైతులు, విత్తన కంపెనీలు, సీడ్ ఆర్గనైజర్లు, డీలర్లు, అధికారులు తదితరులతో చర్చించి సమగ్ర చట్టానికి సంబంధించిన సూచనలు రూపొందించిందని మంత్రి తెలిపారు. కేంద్రం నిర్ణయంతో సంబంధం లేకుండా రాష్ట్రం ముందుకు వెళ్తుందని తుమ్మల స్పష్టం చేశారు. కేంద్రం కొత్త విత్తన చట్టాన్ని తీసుకొస్తే దానికి అనుగుణంగా రాష్ట్రంలో అమలు చేస్తామని, జాప్యం జరిగితే రాష్ట్ర డ్రాఫ్ట్ కమిటీ సూచనల ఆధారంగా స్వయంగా బిల్లును రూపొందించి శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదంతో అమల్లోకి తీసుకొస్తామని తెలిపారు. విత్తన ఉత్పత్తి రైతులకు చట్టపరమైన రక్షణ, కంపెనీలతో పారదర్శక ఒప్పందాలు, న్యాయమైన ధరలు కల్పించడంతో పాటు నకిలీ విత్తనాలపై క ఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీడ్ ట్రేసబిలిటి, క్రాప్ బుకింగ్ వ్యవస్థలను అనుసంధానం చేయాలని, మండల స్థాయిలో సీడ్ బ్యాంకులు, కమ్యూనిటీ సీడ్ బ్యాంకులను ప్రోత్సహించాలని సూచించారు. రైతుల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించి, నాణ్యతలేని విత్తనాల వల్ల పంట నష్టం జరిగితే సత్వర పరిహారం అందేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

**సబ్సిడీని నేరుగా రైతుల ఖాతాలోనే జమ**

వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో సబ్సిడీని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని వ్యవసాయశాఖ మం త్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష స మా వేశం నిర్వహించిన మంత్రి ఎరువుల సరఫరా, ఆయిల్‌పామ్ సాగు, యాంత్రీకరణ, రైతు వేదికలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించాల్సిన వ్యవసాయ పనిముట్లను ఖరారు చేసినట్లు తెలిపారు.రాష్ట్రంలోయూరియా సరఫరాలో ఎలాంటి ఇ బ్బందులు లేవ ని మంత్రి స్పష్టం చేశారు. నర్సరీల్లో లక్ష్యానికి కనీసం రెండింతల మొక్కలు సిద్ధంగా ఉంచాలని, డ్రిప్ ఇరిగేషన్, ఆయిల్‌పామ్ మిల్లుల ఏర్పాటును కూడా వేగవంతం చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, కోఆపరేషన్ స్పెషల్ కమిషనర్ రాహుల్ రాజ్, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ భాషా, హాకా ఎండి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## బిసి కమిషన్ ఆరా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మ జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించే బిసి, ఇబిసి విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌ల కేటాయింపులపై తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ఆరా తీసింది. ఈ మేరకు బిసి సంక్షేమ కమిషనర్ బి. బాల మాయాదేవి ఈ నెల 27న విడుదల చేసిన ప్రకటనపై సమగ్ర వివరాలు కోరుతూ బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ లేఖ రాశారు. ప్రకటనలో మొత్తం 350 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు, ఇందులో 250 మంది బిసి విద్యార్థులు, 100 మంది ఇబిసి విద్యార్థులు ఉంటారని పేర్కొన్న విషయాన్ని చైర్మన్ ప్రస్తావించారు. అలాగే గతేడాది ఇదే పథకం కింద బిసి, ఇబిసి విద్యార్థులకు చేసిన కేటాయింపుల పూర్తి వివరాలను కూడా అందించాలని బిసి కమిషన్ చైర్మన్ తన లేఖలో కోరారు. విదేశీ విద్యానిధి పథకం కేటాయింపుల్లో అనుసరిస్తున్న విధానం, ప్రమాణాలపై స్పష్టత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

## వారం పాటు తేలికపాటి వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఈ కాలంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఆదివారం నుంచి శనివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగనున్నాయన్నారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మాదాపూర్ సర్కిల్-50**

Lr.No. 21/EE/CIR-50/KPZ/CMC/2026-27 Date: 29.08.2026

**NIT No.** 21/EE/CIR-50/KPZ/CMC/2026-27, తేది: 31.08.2026, **పని పేరు:** సిఎంసి, మాదాపూర్ సర్కిల్-50లో గణేష్ నిమజ్జన పనులు, **అంచనా విలువ :** రూ.59.80 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 31.08.2026 ఉ.10.30గం.ల నుండి 03.09.2026 ఉ.10.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీమతి సి.శ్రీకాంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, మాదాపూర్ సర్కిల్-50, సెల్ నెం. 7337364213. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మాదాపూర్ సర్కిల్-50, సిఎంసి.

DIPR R.O. No. : 8915-PP/CL/ADVT/2026-27, Date: 29-08-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఆల్విన్ కాలనీ సర్కిల్-51**

Lr.No. 10/CMC/ALC-51/EE/2026-27 Date: 29.08.2026

**NIT No.** 10/CMC/ALC-51/EE/2026-27, తేది: 29.08.2026, **పని పేరు:** ఇతర పనులు, **అంచనా విలువ :** రూ.34.90 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 31.08.2026 మ.12.00గం.ల నుండి 08.09.2026 మ.12.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీమతి సి.శ్రీకాంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, ఆల్విన్ కాలనీ సర్కిల్-51, సెల్ నెం. 7337364213. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆల్విన్ కాలనీ సర్కిల్-51, సిఎంసి.

DIPR R.O. No. : 8871-PP/CL/ADVT/2026-27, Date: 29-08-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, గాజులరామారం సర్కిల్-57**

**NIT No.** 19/DB/EE/Gajularamaram Circle-57/CMC/2026-27, **పని పేరు:** 2 పనులు, **అంచనా విలువ :** రూ.55.00 లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 28.08.2026 మ.02.00గం.లకు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 05.09.2026 మ.02.30గం.ల వరకు, **టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9154299633, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 9063836115. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-57, సిఎంసి.

DIPR R.O. No. : 8835-PP/CL/ADVT/2026-27, Date: 28-08-2026

## 'రేపు' ఆహార లైసెన్స్ రిజిష్ట్రేషన్ మేళా

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: ఆహార వ్యాపార నిర్వాహకుల కోసం సోమవారం ఐడిఓసిలో ఆహార లైసెన్స్ రిజిష్ట్రేషన్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఆహార భద్రతాధికారి శరత్ తెలిపారు. ఐడిఓసిలోని రూమ్ నెం.3లో జరిగే ఈ మేళాను హోటళ్ల రెస్టారెంట్‌లు బేకరీలు కిరాణా వీధి ఆహార విక్రయదారులతో పాటు తదితరులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ మేళాలో అధికారులు మార్గదర్శకాలు సూచనలు అందిస్తారని చెప్పారు. లైసెన్సులు లేకుండా ఆహార వ్యాపారాలు నిర్వహిస్తే చట్ట రిత్యా నేరమని సూచించారు.

## భద్రాచలంలో పుష్కరఘాట్ పనులకు ఎమ్మెల్యే డా.తెల్లం శంకుస్థాపన



ప్రజాపక్షం/భద్రాచలం: వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భద్రాచలంలో పుష్కరఘాట్ పనులకు శ్రీకారం చుట్టారు. శనివారం ఇందుకు సంబంధించి స్థానిక ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి భూమిపూజ చేశారు. తొలివిడత రూ.46.65 కోట్లతో పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. రెండో, మూడో విడతలతో కలిపి మొత్తం రూ.49 కోట్లతో పుష్కర ఘాట్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపడతామని, వచ్చే ఏడాది మార్చిలోపు పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. భద్రాచలంతో పాటు పర్ణశాల, మోతెపట్టీనగర్ ములుగు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఘాట్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం కృష్ణ, మాజీ ఎంఎలసి బాలసాని లక్ష్మీ నారాయణ ఇరిగేషన్ అధికారులు రామాలయం ఇఓ ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## వరద కోతకు గురి అవుతున్న ప్రధాన రహదారి

ప్రమాదకరంగా మారిన రవాణా

పర్యవేక్షణ లేని అధికారులు



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో ఉన్న ప్రధాన రహదారి ప్రతి వర్షాకాలంలో వరద నీటి ఉధృతికి కోతకు గురవుతూ ప్రమాదకరంగా మారుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో వరద ఉధృతి పెరగడంతో రహదారి అంచులు దెబ్బతిని వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి మండల కేంద్రాన్ని పరిసర గ్రామాలతో అనుసంధానించే ప్రధాన మార్గం కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి కోతకు గురికావడంతో ఎప్పుడైన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పక్కన రక్షణ గోడ నిర్మించడం, వరద నీరు సాఫీగా వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం వంటి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధి అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారిని వెంటనే మరమ్మతులు చేయడంతో పాటు భవిష్యత్తులో వరద కోతకు గురి కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

## కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించాలి : డాక్టర్ ఎల్ ప్రవీణ




ప్రజాపక్షం/ఖమ్మంవైద్యవిభాగం: కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి ఎండిటి చికిత్స అందిస్తే పూర్తిగా నయం చేయవచ్చని అదనపు డిఎంహెచ్ఓ డాక్టర్ ఎల్ ప్రవీణ, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుమాధవరావు తెలిపారు. కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమంపై నెలవారీ సమీక్ష సమావేశాన్ని ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా లెప్రసీ నోడల్ పర్సన్స్‌తో కార్యక్రమ అమలుపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎల్ ప్రవీణ, వేణుమాధవరావులు మాట్లడుతూ జీరో అనుమానిత కేసులు నమోదువతున్న ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి, క్షేత్రస్థాయిలో అనుమానితులను గుర్తించాలని సూచించారు.సమావేశంలో జిల్లా పారామెడికల్ అధికారి మల్లయ్య, ఫిజియోథెరపిస్ట్ బద్రు, డీపీఎంవోలు శాస్త్రి, కృష్ణమూర్తి, కృష్ణ, వినోద్‌కుమార్‌తో పాటు నోడల్ పర్సన్స్ పాల్గొన్నారు.

## మానసిక ఒత్తిడిని అధిగమించినప్పడే లక్ష్యాలు చేరుకోగలం

జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ డి రామారావు




ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: విద్యార్థులు మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా అధిగమించినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ డి రామారావు అన్నారు. శనివారం ఖమ్మంలోని నాయబజార్ జూనియర్ కళాశాలలో మానసిక ఒత్తిడిని అధిగమించడం ఎలా? అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచే విద్యార్థులు కుటుంబ, సామాజిక సమస్యలు, చదువుల ఒత్తిడి, పోటీ ప్రపంచం కారణంగా మానసిక ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. యోగా, ధ్యానం, సానుకూల దృక్పథం, నిరంతర సాధన ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని డాక్టర్ రామారావు తెలిపారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కళాశాల సిబ్బందిని అభినందించారు.

# సామాన్యులపై ధరాఘాతం

- నింగిని తాకుతున్న నిత్యావసర వస్తువుల ధరలు
- తగ్గిన ఆదాయం, ఆర్థిక ఇబ్బందుల్లో పేద, మధ్యతగతి కుటుంబాలు
- ధరల నియంత్రణలో విఫలమైన పాలకులు



ప్రజాపక్షం/ఖమ్మం: నిత్యావసర వస్తువుల ధరలు నింగిని తాకుతున్నాయి. ఇది అది అనే బేధం లేకుండా అన్నింటి ధరలు గణనీయంగా పెరిగాయి. నిత్యావసరంగా ఉన్న ప్రతి వస్తువు ధర గడిచిన మూడు మాసాల్లో గణనీయంగా పెరగగా కొన్నింటి ధరలు రెట్టింపయ్యాయి. దీనితో సామాన్యులు కొని తినలేని పరిస్థితి ఏర్పడింది. గడిచిన ఏడాది కాలంగా ఆర్థిక వనరులు కుచించుకుపోతున్నాయి. రియల్ ఎస్టేట్ సంక్షోభంతో పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కరువైంది. భవన నిర్మాణాలు నిలిచిపోవడం, రియల్ ఎస్టేట్ మందగించి కొనుగోళ్లు, విక్రయాలు నిలిచిపోవడం దీనితో పాటు ఇతరత్రా ఉపాధి కల్పన రంగాలు ఇబ్బందుల్లో ఉండడంతో ప్రజలకు ముఖ్యంగా పేద, సామాన్యప్రజల ఆదాయ వనరులు దెబ్బతిని రోజు గడవడమే ఇబ్బందికరంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగ సంక్షోభం కారణంగా ఆశించిన స్థాయిలో ఉపాధి లేదు. దీనితో ఆదాయం తగ్గి సర్దుకుపోయి బతకాల్సిన తరుణంలో నిత్యావసర వస్తువుల ధరలు నెల రోజుల్లో 20 శాతం నుండి 40 శాతం మేర పెరిగాయి. ఇందులో చక్కెర ధర ఈ దశాబ్దపు గరిష్ట స్థాయికి చేరింది. చక్కెర నిల్వలు లేవని ఒక పక్క మరో పక్క బ్లాక్ మార్కెట్ కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రచారం జరుగుతుంది. ఉల్లి, ఎల్లిపాయ, పప్పు, ఉప్పు, చింతపండు, నూనెల ధరలు గణనీయంగా పెరిగాయి. కూరగాయల ధరలు కూడా క్రమేపి పెరుగుతున్నాయి. నెల రోజుల క్రిందట రూ. 20 నుంచి రూ.25లు అమ్మిన టమాట ఇప్పుడు రూ. 40లకు చేరింది. వంట నూనెలు, పప్పుల ధరలు పెరగడం వెనుక గల్ఫ్ యుద్ధ ప్రభావం ఉందని ప్రచారం చేస్తున్నారు.కిలో బియ్యం ధర రూ. 45 నుంచి ఆయా రకాలను బట్టి రూ. 75ల వరకు చేరాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎల్‌నినో ప్రభావం ద్వారా ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి సాగు గణనీయంగా తగ్గింది. దీనితో బియ్యం ధరలు పెరగడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు తెలుపుతున్నాయి. గతంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉండేది. నిల్వలపై నిఘా, ధరలపై నిరంతర పర్యవేక్షణ ఉండేది. మోడీ పుణ్యమా అని నూతన సాగు చట్టాలలో ఈ నిత్యావసర వస్తువుల నియంత్రణ, నిల్వలకు సంబంధించి నూతన విధానాలను తీసుకు రావడంతో ఇప్పుడు ధరల నియంత్రణపై ప్రభుత్వం పట్టు కోల్పోయింది. అప్పుచేస్తే తప్ప సామాన్య, పేద ప్రజలు రోజు గడవని పరిస్థితి దాపురించింది. ఇప్పటికే సంక్షేమ పథకాలు సరైన రీతిలో అమలు కాక పేద, మధ్య తరగతి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గోరుచుట్టుపై రోకలిపోటులా ధరల పెరుగుదల సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ధరను నియంత్రించకపోతే సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడుతుంది. పాలకులు ఇప్పటికైనా ప్రజల గురించి ముఖ్యంగా పేద, సామాన్యుల గురించి ఆలోచించి ధరలను నియంత్రించాలని అవసరమైతే సబ్సిడీని ప్రవేశపెట్టి ప్రభుత్వమే భరించాలని పేదలు కోరుతున్నారు.

## ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి : సరెడ్డి పుల్లారెడ్డి




ప్రజాపక్షం/మణుగూరు: సెప్టెంబర్ 6 7 8 తేదీలలో కరీంనగర్ జిల్లాలో జరుగు ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ మణుగూరు పార్టీ కార్యాలయంలో జరిగిన ఏఐటియుసి కార్యకర్తల సమావేశంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ 44 కార్మిక చట్టాలను మార్చి, నాలుగు బార్కోడ్లుగా తయారు చేయాలని కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని దీనిని కార్మిక వర్గం పూర్తిగా వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఆసన్నమైందని వారు అన్నారు. కార్మిక హక్కుల సంక్షేమం కోసం ఎఐటియుసి సంఘాన్ని బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, కార్మిక హక్కుల సంక్షేమం కోసం వారికి అండగా నిత్యం పోరాటాలు కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. దేశంలో పోరాటాల చరిత్ర కలిగిన సంఘం ఎఐటియుసి మాత్రమేనన్నారు. ఈ సమావేశంలో,జిల్లా కార్యవర్గ సభ్యురాలు మున్నా లక్ష్మి కుమారి, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ ఎఐటియుసి సంఘంలో పనిచేసే వారు ముందుగా సభ్యత్వం నమోదు చేయించుకుని, ప్రజా సంఘాల నిర్మాణ బలోపేతంకు ఎఐటియుసి నాయకులు కృషి చేయాలని, సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, భవన నిర్మాణ సంఘం నాయకులు కొత్తపల్లి సీతారాములు అధ్యక్షత వహించగా, ఎఐటియుసి నాయకులు తోట రమేష్, సంపత్‌సతీష్, ఎస్ డి యాకూబ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ జలాలను అన్ని మండలాలకు అందించాలి

- గోదావరి జలాలు అందక పోవటంతో అసంతృప్తిలో రైతులు
- సమస్యను మంత్రులు, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తా : కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/జూలూరుపాడు: భద్రాద్రి జిల్లాలో ని అన్ని మండలాలకు సీతారామ కెనాల్ ద్వారా గోదావరి జలాలను అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం ఆయన సిపిఐ రైతు సంఘం నాయకులతో కలిసి జూలూరుపాడు మండలంలోని వినోబానగర్ గ్రామ సమీపంలోని రాజీవ్ లింకు కెనాల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి వారి నుంచి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు తరలించడం పట్ల తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, సీతారామ కెనాల్ నిర్మాణంతో భద్రాద్రి జిల్లాలోని పలు మండలాల రైతులు భూములను కోల్పోయారని, అయినప్పటికీ ఈ ప్రాంత రైతులకు గోదావరి జలాలు అందకపోవటంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రైతుల ఆందోళనను గమనించి సిపిఐ ఆధ్వర్యంలో నాయకుల బృందం రాజు లింకు కెనాల్ ను సందర్శించడం జరిగిందన్నారు. జూలూరుపాడు మండలంలోని కప్పల కుంట, శనగచెరువు, దండాల చెరువులో గోదావరి జలాలను నింపి వాటి ద్వారా సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువుకు తరలించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఇదే విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రైతుల సాగునీటి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి గోదావరి జలాలను అందించే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడు గణేష్ సీతారామ ఈ ఈ మహేశ్వరరావు, డి ఈ చంద్రశేఖర్, ఎఇ శ్రావణి, సుజాతనగర్ ఎంపిడిఒ భారతి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్, సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శియాస రోశయ్య, యలంకి మధు ఎస్కే నాగులుమీరా, తాతా నరసింహారావు, చెరుకుమల్ల రాజేశ్వరరావు, ఊడల సుధా తదితర రైతాంగం పాల్గొన్నారు.

## చరిత్రాత్మక ఒప్పందంతో చరిత్ర తిరగరాసిన ఎఐటియుసి

- పికెఒసి 2 ఫిట్ మీటింగ్‌లో ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై రామ్ గోపాల్
- సమ్మె నోటీసుతో దిగివచ్చిన యాజమాన్యం



ప్రజాపక్షం/మణుగూరు:సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఏప్రిల్‌లో ఇచ్చిన సమ్మె నోటీసుకు దిగివచ్చి యాజమాన్యం లేబర్ కమిషనర్ సమక్షంలో కార్మికుల న్యాయమైన డిమాండ్లపై అంగీకారం తెలిపిందని ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై రామ్ గోపాల్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన పీకేఓసి 2 ఫిట్ మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందంలో ప్రధానంగా 13సంవత్సరాలగా కార్మికులు ఎదురుచూస్తున్న పెరాక్స్ పై ఇన్కమ్ టాక్స్ ను చెల్లించేందుకు మేనేజ్మెంట్ అంగీకరించిందని, కార్మికుడు సహజ మరణం చెందితే ఆ కుటుంబానికి 20 లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేయడానికి ప్రతినెల మెడికల్ బోర్డు జరిగే విధంగా 2025 26 ఆర్థిక సంవత్సరానికి గాను దసరా లోపు లాభాల ఆట చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందని కంపెనీలో మూడు సంవత్సరాలకు ట్రాన్స్ఫర్ నిబంధన తొలగించి ఒక సంవత్సరానికి ట్రాన్స్ఫర్ అంగీకరించిందని సీనియర్ మైనింగ్ స్టాఫ్ సిబ్బందికి ఓవర్ మెన్ ప్రమోషన్ ఇయ్యడానికి మారుపేర్ల సమస్యల పరిష్కరించడానికి యూనియన్ ప్రతినిధులతో కలిపి ఒక కమిటీ వేయడానికి హైదరాబాద్ లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి, మెడికల్ అటెండెన్స్ రూల్స్ లో మార్పులు చేయడానికి, రిటైర్డ్ అయిన కార్మికులకు వారం రోజులు సింగరేణి హాస్పిటల్ లో వైద్యం చేయడానికి, సింగరేణి విద్యా సంస్థల్లో సిబిఎస్ఇ సిలబస్ అమలు చేయడానికి, కార్మికులకు రక్షణ పరికరాలు అందుబాటులో ఉంచడానికి, డిస్మిస్ కార్మికుల సమస్య పరిష్కారానికి హైపవర్ కమిటీ ఏర్పాటు చేయడానికి, మైనింగ్ స్టాఫ్ కి సూటబుల్ సర్ఫేస్ ఉద్యోగాలు ఇవ్వడానికి, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించడం, డిపెండెంట్ ఉద్యోగుల పెండింగ్ కేసులు పరిష్కరించడం, ఉద్యోగులకు ఈవినింగ్ కాలేజీ కొరకు ఎన్ఓసి ఇవ్వడానికి, కంపెనీలో ఖాళీగా ఉన్న క్లారికల్, ఎలక్ట్రీషియన్ ఫిట్టర్, పారామెడికల్, సెక్యూరిటీ, ఎలక్ట్రికల్ మెకానికల్ సూపర్వైజర్ల భర్తీకి అంగీకరించిందని, క్యాడర్ స్కీం సమస్యల పరిష్కారానికి అంగీకరించిందని, 149 మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్ లకు నెలలోపు ఉద్యోగాలు ఇస్తారని, సింగరేణి కార్మికులకు కూడా ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో అమలవుతున్న విధంగానే ఇప్పించుటకు ప్రభుత్వంతో చర్చించి అమలు చేస్తామని మేనేజ్మెంట్ అంగీకరించిందని చట్టబద్ధంగా సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికులకు నో వర్క్ నోపే అమలు, ఫైన్లు వర్తించవని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, ఆఫీస్ బేరర్ బి.సురేందర్రావు, ఫిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, బి రవి, జి శ్రీనివాసరావు, సతీష్, ఈసం శ్రీనివాస్, సాయి ప్రకాష్ చారి, ఆంథోని రవి తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పాలకులు చర్యలు చేపట్టాలి




ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చర్యలు చేపట్టి యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు అనుముల సాయి,ఎస్కే ఫహీమ్ దాదా అన్నారు. శనివారం సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో వేలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, దీంతో సకాలంలో ప్రజాసేవలు ముందుకు సాగడం లేదన్నారు. వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలుపుకోడం లేదని, ఏటా 2 లక్షల ఉద్యోగాల భర్తీ, నెలకు రూ.4వేల నిరుద్యోగ బృతి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ నిరుద్యోగ వ్యవస్థను పెంచిపోషిస్తున్నారని, ఆ విధానాలు మానుకోవాలన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో స్థానిక యువత నిరుద్యోగ సమస్యను రూపుమాపాలాన్నారు. పేద నిరుద్యోగుల కోసం ప్రభుత్వం ఉచిత కోచింగ్ సెంటర్లు, స్టడీ హాల్స్, లైబ్రరీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మత్తు పదార్థాలు, గంజాయి వంటి వాటితో పాటు ఆన్‌లైన్ బెట్టింగులకు యువత బానిసలవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, దీనిపై సంబంధిత శాఖలు కఠినంగా వ్యవహరించాలని, మహిళలకు భద్రత కల్పించాలని కోరారు. నిరుద్యోగం విద్య ఉపాధి సమస్యలపై నిరంతర పోటాలు సాగిస్తామని చెప్పారు. అనంతరం పలు తీర్మాణాలను జిల్లా కమిటి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని ఆమోదించారు. ఈ విలేకరుల సమావేశంలో సాధనపల్లి సతీష్ ఎస్కే ఖయ్యూమ్ భూపేష్ ఎండి నాదీమ్ రవికిరణ్ కొచ్చర్ల రాకేష్ సలిగంటి నవీన్ అజయ్ రసూల్ అమీర్ మాణిక్యాల వినయ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కొత్త రూపం

- చాక్లెట్లు, సిగరేట్లు, ఇతర వస్తువులుగా విక్రయాలు
- హైదరాబాద్‌లో గంజాయి చాక్లెట్లు పట్టుబడటంతో జిల్లాలో అప్రమత్తం



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం: మత్తు కొత్త రూపం దాల్చుతోంది. ఇది పాత వ్యవహారమే అయినా ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. తాజాగా హైదరాబాద్‌లో గంజాయి చాక్లెట్లు లభ్యం కావడంతో ఒక్క సారిగా ఉలిక్కపడ్డ వ్యవస్థ అప్రమత్తమైంది. భద్రాద్రి జిల్లా సరిహద్దును పంచుకునే ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున గంజాయి అక్రమంగా సరఫరా అవుతోంది. ప్రతి నిత్యం ఈ ప్రాంతం గుండా పలు రకాలుగా సరఫరా అయ్యే గంజాయిని పోలీసులు పట్టుకుని అరెస్టులు చేస్తున్నారు. అంతే కాకుండా దేశంలో పలు రాష్ట్రాల నుండి చాలా మంది ఒడిస్సా రాష్ట్రానికి గంజాయి కోసం వస్తుంటారు. ఒడిస్సా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లాలో ప్రధానంగా గంజాయి సాగు సాగుతోంది. అది గిరిజన ప్రాంతం కావడం, దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో గంజాయి సాగు చేసే ప్రాంతానికి ఎవ్వరూ వెళ్లడం లేదు. సాగును క్షేత్రస్థాయిలో అడ్డుకుంటే గంజాయికి అడ్డుకట్ట వేయవచ్చని పలువురు అంటున్నారు.

**జిల్లాలో అప్రమత్తం:** హైదరాబాద్‌లో తాజాగా గంజాయి చాక్లెట్లు పట్టుపడటంతో జిల్లాలో అధికారులు అప్రమత్తం అయ్యారు. గంజాయి స్మగ్లర్లు ఎండు గంజాయిని కిలో వేలాది రూపాయల చొప్పున విక్రయిస్తుంటారు. దీంతో చాక్లెట్లుగా మార్చి అమ్మకాలు సాగిస్తున్నారు. వీటికి చిన్న పిల్లలు బలై పోతున్నారు. మరో ప్రక్క సిగరేట్ల రూపంలో కూడా గంజాయి అమ్మకాలు సాగుతున్నాయి. దీనికి యువత పెద్ద ఎత్తున అలవాటు పడుతున్నట్లు పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి. విక్రయానికి పలు మార్గాలను ఎంచుకుంటున్న స్మగ్లర్లు బొమ్మలు ఆట వస్తువులు, ఐస్ క్రీమ్ బాల్స్‌లో పెట్టి అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. గత కొంత కాలం క్రితం భద్రాచలం బస్టాండ్‌లో బొమ్మల్లో గంజాయిని పెట్టి తరలిస్తుండగా పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు. ఆర్టీసి బస్సులను అడ్డాగా చేసుకుని గుర్తు తెలియకుండా కొత్తకొత్త బ్యాంగుల్లో గంజాయిని పెట్టి గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నట్లు పలు పుకార్లు వినవస్తున్నాయి. ఆర్టిసి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలంటూ స్వయంగా జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలవారు సూచించడం గమనార్హం.

**మాదకద్రవ్య రహిత జిల్లాగా:** జిల్లాను మత్తు రహిత, మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులు కంకణం కట్టుకున్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఎస్‌పి రోహిత్ రాజ్ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పోలీసులు గట్టి నిఘా పెట్టి గంజాయి, మత్తుపదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం పై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఈనెల 27న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడిఓసిలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకునేందుకు గానూ జిల్లా స్థాయి మాదకద్రవ్యాల విచారణ కమిటి సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లాను మాదక ద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు తగు ప్రణాళికలు తీసుకునేలా నిర్ణయం చేశారు. ఇందు కోసం కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా, సంబంధిత శాఖలన్ని ప్రణాళికా బద్దంగా పనిచేస్తూ నిరంతర తనిఖీలు నిర్వహించేలా చర్చించారు. సంపూర్ణ మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారు. గంజాయి మత్తుకు బానిసలైన వారిని గుర్తించి ఎడిక్షన్ సెంటర్‌కు తరలిస్తున్నారు. ఒక ప్రణాళికా బద్ధంగా సంబంధిత అధికారులు ముందుకు సాగుతూ మాదకద్రవ్య జిల్లాగా తీర్చి దిద్దేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

## ఘనంగా తెలుగుభాష, జాతీయ క్రీడా దినోత్సవం



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని, హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల్లో ఘనంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమానికి సింగరేణి కాలరీస్ పాఠశాలల అధినేత జనరల్ మేనేజర్ (పర్సనల్)ఎస్‌సిసిఎస్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ముఖ్యాతిథిగా హాజరై క్రీడలు యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాలలో గ్రంధాలయం డిజిటల్ తరగతులు కంప్యూటర్ పరీక్షల విభాగం మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ప్రజాపక్షం/రాయపర్తి: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని కొండూరు గ్రామంలో చోటు చేసుకుంది. మృతుని బంధువులు, పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన రామారపు సంజీవ(33) అనే వ్యక్తి తన వ్యవసాయంతో పాటు తన తమ్ముని పొలంను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయ పనుల కోసం సొంతంగా ట్రాక్టరన్ ఫైనాన్స్ తీసుకొని నడుపుతున్నాడు. ట్రాక్టర్ ఫైనాన్స్‌తో పాటు వ్యవసాయంలో పెట్టుబడులు ఎక్కువై దిగుబడి తక్కువై అప్పులపాలయ్యాడు. తెచ్చిన అప్పులు తీరక అప్పులు ఇచ్చిన వారితో మాటలు పడలేక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈ అప్పులు ఇక నేను తీర్చలేనని అనుకున్నాడు. చేసేది ఏమి లేక తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్ళి పురుగుల మందు సేవించి ఇంటికి వచ్చి మంచంలో పడుకొని వాంతులు చేసుకున్నాడు. ఇది గమనించిన అతని భార్య సుమలత ఏమైందని భర్తను అడుగగా తాను అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి వచ్చానని తీవ్ర మనోవేదనతో తెలిపారు. దీనితో కంగారుపడిన సుమలత వెంటనే తమ బంధువులకు సమాచారం అందించి సంజీవను చికిత్స నిమిత్తం వర్ధన్నపేట ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ సంజీవ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు.


## వరంగల్ స్టేషన్‌లో రైల్వే జిఎం తనిఖీ



ప్రజాపక్షం/వరంగల్ టౌన్: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈర శనివారం వరంగల్ రైల్వే స్టేషన్ను సవివరంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీకి ముందు, జనరల్ మేనేజర్ సికింద్రాబాద్,కాజీపేట సెక్షన్ మధ్య నైట్ ఫుట్ ప్లేట్ తనిఖీ (రైలు ఇంజిన్లో ప్రయాణిస్తూ) కూడా జరిగింది. ఈ తనిఖీ అంతటా సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్, ప్రధాన కార్యాలయం, డివిజన్కు చెందిన ఇతర సీనియర్ అధికారులు ఆయనతో పాటు ఉన్నారు.సంజయ్ కుమార్ శ్రీవాస్తవ 28 ఆగస్టు 2026న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి రైలు నెం.12745 సికింద్రాబాద్ మణుగూరు ఎక్స్‌ప్రెస్ ఇంజిన్‌లో తన తనిఖీని చేయడం ద్వారా, కాజీపేట వరకు ఆ రైలు ఇంజిన్ లోనే ప్రయాణించారు. ఈ తనిఖీ సమయంలో జనరల్ మేనేజర్ సిగ్నల్స్ అంశాలు, వాటి స్పష్టత, ఓవర్ హెడ్ ట్రాక్షన్, ట్రాక్ పరిస్థితి, సెక్షనల్ వేగ పరిమితి హెచ్చరికలు, వేగాలు మొదలైనవాటిని సమీక్షించారు. రైలును నడుపుతున్న విధుల్లోని సిబ్బంది (లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్) అప్రమత్తతను, అలాగే లోకో పైలట్, ట్రైన్ మేనేజర్లతో సిగ్నల్స్ మార్పిడి చేయడంలో మాస్టర్స్, పాయింట్స్ మెన్, గేట్మెన్ వంటి మార్గమధ్య సిబ్బంది అప్రమత్తతను కూడా ఆయన గమనించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ. 25.41 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి చేయబడిన వరంగల్ రైల్వే స్టేషన్ను జనరల్ మేనేజర్ తనిఖీ చేశారు. ఈ స్టేషన్‌ను 12మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, భవనం ముఖభాగాన్ని మెరుగుపరచడం, ప్రవేశ ద్వార మండపం, మెరుగైన వేచి ఉండే గదులు, ప్లాట్ఫారమ్ పై కప్పు, లిఫ్టులు, ఎస్కలేటర్లు మొదలైన మెరుగైన ప్రయాణీకుల సౌకర్యాలు మరియు సదుపాయాలతో అభివృద్ధి చేశారు. జనరల్ మేనేజర్ స్థానిక ప్రజా ప్రతినిధులు,వివిధ ప్రతినిధుల నుండి వినతులను స్వీకరించారు.

## కాంగ్రెస్‌లో భారీ చేరికలు

### పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గండ్ర



ప్రజాపక్షం/భూపాలపల్లి : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని చిట్యాల మండలం బి.ఆర్.ఎస్ పార్టీకి చెందిన రామచంద్రాపూర్ సర్పంచ్ గాజా హేమలత అశోక్, కైలాపూర్ గ్రామ సర్పంచ్ కోదారి ఓదెలు తెలిపారు. శనివారం భూపాలపల్లి క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సమక్షంలో చిట్యాల మండలంలోని బి.ఆర్.ఎస్ పార్టీకి చెందిన రామచంద్రాపూర్ సర్పంచ్ గాజా హేమలత అశోక్, కైలాపూర్ గ్రామ సర్పంచ్ కోదారి ఓదెలు తో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు,ప్రజల సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలకు ఆకర్షితులై వారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల ముఖ్య నాయకులు, సర్పంచులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళల సాధికారత, పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని అన్నారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు తమ గ్రామాల అభివృద్ధికి మరింత సేవ చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ తరపున స్వాగతం పలుకుతూ ప్రజాసేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను డిఎస్పి తనిఖీ




ప్రజాపక్షం/గూడూరు: గూడూరు సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌ను డీస్పీ తిరుపతిరావు శనివారం సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ రికార్డులు కే సుల దర్యాప్తు పురోగతి పెండింగ్ కేసులు సిబ్బంది పనితీరును పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. గూడూరు సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణకు అప్రమత్తంగా విధులు నిర్వహించాలనితిరు డీఎస్పీ తిరుపతి రావు సూచించారు. ఈకార్యక్రమంలో సీఐ వినయ్ కుమార్ ఎస్ఐలు రమేష్ బాబు యదవ రెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం



### 'పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో పర్యటన లో మంత్రి పొన్నం ప్రభాకర్

### ప్రజల సమక్షంలో సంక్షేమం, అభివృద్ధిపై అధికారులతో సమీక్ష-సమస్యల పరిష్కారానికి తక్షణ ఆదేశాలు

ప్రజాపక్షం/ఎల్కతుర్తి : ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలో "పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజల సమక్షంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, యువత తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వినతి పత్రాలను స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దండేపల్లి గ్రామ సర్పంచ్ గులిపల్లి సంపత్ గ్రామంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, ఓపెన్ జిమ్, అంగన్వాడీ భవనం వంటి అభివృద్ధి పనులు మంజూరయ్యాయని, ఇప్పటివరకు రూ.58 లక్షల విలువైన అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు.గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి స్థలం సిద్ధంగా ఉందని సర్పంచ్ కోరగా, అదే స్థలంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని వెంటనే మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆరు నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వివో భవన నిర్మాణానికి రెండు గుంటల స్థలాన్ని దానం చేసిన శంకర్ నారాయణను మంత్రి అభినందించారు. ఇప్పటికే ఒక వీఓ భవనం మంజూరు కాగా, దానం చేసిన స్థలంలో మరో రెండు వీజీఓ భవనాలను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.దండేపల్లి గ్రామానికి సంబంధించిన రహదారి సమస్యలపై మంత్రి కీలక ప్రకటనలు చేశారు. దండేపల్లి గ్రామంలో మూడు మహిళా సంఘాల ఆధ్వర్యంలో 900 స్టీల్ బ్యాంక్ కిట్లను, 13 రకాల వస్తువులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో హోటల్‌కు 100 స్టీల్ గ్లాసులు అందించినట్లు చెప్పారు. ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమి యా, హెచ్ఐవీ బాధితులు తదితర అర్హులైన వారు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హుస్నాబాద్ మినీ స్టేడియంలో ఇప్పటికే కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దండేపల్లి గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.14–15 సంవత్సరాల వయసు గల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు టీకాలు వేయించాలని మంత్రి సూచించారు.

**సౌర విద్యుత్‌ను వినియోగించుకోవాలి**

పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుంటే 3 కిలోవాట్ల వరకు రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని మంత్రి తెలిపారు. ఇంటి అవసరాలకు విద్యుత్‌ను వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకునే అవకాశం ఉందని వివరించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గురవయ్య, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్ గులిపల్లి సంపత్, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు



ప్రజాపక్షం/ములుగు: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అవసరమైన రోడ్డు భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అధ్యక్షతన నూతన కలెక్టరేట్ తన ఛాంబర్‌లో రోడ్డు భద్రతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై మల్లంపల్లి, పందికుంట, యువజన శిక్షణ కేంద్రం, జాకారం, నూతన సమీకృతం జిల్లా కార్యాలయాల సముదాయం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంతాల్లో అవసరమైన చోట్ల వేగ నియంత్రణ పట్టీలు, సూచిక బోర్డులు, రేడియం స్టికర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా అనుసంధాన ప్రాంతాల వద్ద వాహనదారులకు స్పష్టం కనిపించేలా సూచిక, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఓ ఈశ్వర్ సింగ్ ఠాగూర్, పిఆర్ ఇంజనీరింగ్ అధికారులు, సుధీర్ కుమార్, సంపత్, ఆర్‌టిసి, పోలీస్, అధికారులు, పాల్గొన్నారు.

## విద్యుత్ సంస్కరణల పేరిట దోపిడీకి కేంద్రం కుట్ర

### విద్యుత్ అమరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




ప్రజాపక్షం/హనుమకొండ: విద్యుత్ సంస్కరణల పేరిట కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాన్ని హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ పోరాట అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2023లో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరిట కొత్త చట్టం తీసుకువచ్చిందని, రైతుల మోటార్లకు మీటర్లు బిగించి రైతులను దోపిడీ చేయాలని సూస్తున్నదని అన్నారు. విద్యుత్ ను ప్రైవేటు పరం చేసి రైతాంగంతో పాటు అన్ని వర్గాల ప్రజలపై పెనుభారం మోపేలా చూస్తున్నారని అన్నారు. విద్యుత్ ను కూడా ఆదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకే రాష్ట్ర జాబితాలో ఉన్న విద్యుత్ పై కేంద్రం పెత్తనం చెలాయిస్తున్నదని అన్నారు. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాట అమరుల స్ఫూర్తితో కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నాటి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, పోలీసు నిర్బంధాన్ని ధిక్కరించి ప్రజల హక్కుల కోసం అమరులైన యోధుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాటమే అమరులకు అర్పించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతితో పాటు జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్. అశోక్ స్టాలిన్, ఏదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి, మునిగాల బిక్షపతి, వేల్పుల సారంగపాణి, కండె నర్సయ్య, ఆలకుంట యాకయ్య,చిలుకల బాబు, వెంకటేష్, ఉస్మాన్ పాషా పాల్గొన్నారు.

## హనుమకొండను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండ : విద్య, వైద్యంతో పాటు క్రీడారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, హనుమకొండలో క్రీడా మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని ప్రధాన క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలో అభివృద్ధి చేసిన స్విమ్మింగ్ పూల్‌ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ తదితరులతో, జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో పునర్నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న బ్యాడ్మింటన్ స్టేడియంను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని అన్నారు. గత రెండున్నరేళ్లలో వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అన్ని రంగాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. జేఎన్ఎస్‌లో కల్పించిన క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని అం తర్జాతీయ స్థాయికి ఎదగాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడాకారులకు అవసరమైన మె రుగైన మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్పోర్ట్స్ స్కూల్‌కు సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధికి ప్రభు త్వం పెద్దపీట వేస్తోందన్నారు. జేఎన్ఎస్‌లో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ లలో క్రీడా వసతులను మెరుగైన ప్రమాణాలతో అభివృద్ధి చేశామని తెలిపారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కొత్త ప్రశాంత్ మాట్లాడుతూ దాదాపు కోటిన్నర రూపాయలతో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పునర్నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణముతో నిర్మించిన వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కైలాస్ యాదవ్, ఆఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్, ఏసీపీ జితేందర్, హనుమకొండ ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, పాల్గొన్నారు.

## అక్రమ గంజాయి రవాణా చేస్తున్న నిందితుడు అరెస్ట్



ప్రజాపక్షం/భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా అడవి ముత్తారం పోలీస్ స్టేషన్ పరిధిలో భూపాలపల్లి సిసిఎస్ పోలీసులు, అడవి ముత్తారం పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేశారు. ఒడిశా నుంచి మేడారం మీదుగా కాటారం వైపు గంజాయిని అక్రమంగా తరలిస్తున్న దానం శశికృష్ణ (కాటారం గ్రామం) ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 1 కిలో 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.70,000/గా అంచనా వేశారు. నిందితుడిపై ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. గంజాయి సేవించడం, విక్రయించడం లేదా అక్రమంగా రవాణా చేయడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

## యువత క్రీడా స్ఫూర్తితో దేశానికి కీర్తి తీసుకురావాలి: కలెక్టర్

ప్రజాపక్షం/జనగామ: యువత క్రీడా స్ఫూర్తితో దేశానికి కీర్తి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత హాకీ దిగ్గజం, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ 121వ జయంతి వేడుకలను జిలా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో గనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరై మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్మంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి నరసింహారావు, అధికారులు, యువజనులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు

## న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్ ముందు గ్రామస్తుల ధర్నా

ప్రజాపక్షం/లింగాలఘణపురం: మాకు న్యాయం చేయాలంటూ, శనివారం మండల కేంద్రం లోని, పోలీస్ స్టేషన్ లో లింగాల ఘ ణపురం గ్రామ ప్రజలు ధర్నాకు దిగారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, లింగాల లక్ష్మారెడ్డి దేశ్ ముక్(దొర) వారి అవసరాల నిమిత్తం కోసం వారి యొక్క భూములను గ్రామ ప్రజలకు కొనుగోలు చేశారు. గత కొన్ని సంవత్సరాలు గడిచిన తర్వాత, ఇప్పుడు లింగారెడ్డి మూడవ కుమారుడు, లింగాల దీపక్ రెడ్డి సింధుజ దంపతులు, గ్రామానికి వచ్చి గ్రామ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురై విధంగా ప్రవర్తిస్తూ, మా భూములు మాకు కావాలంటు, గ్రామంలో ప్రజలను అల్లకల్లోలంగా నిర్వహిస్తూ ప్రవర్తిస్తున్నారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. దేశ్ముకుల పాలన నిర్మూలమైన, ఇప్పుడు కూడా గ్రామంలో పూర్వం లాగే నెలకొందని వారు ఆరోపిస్తున్నారు. మాకు న్యాయం చేయాలంటూ, ఎస్ఐ శ్రావణ్ కుమార్ కు వారి గోడును వివరించారు.



## రెండు పంటలకు సాగునీరు అందించడమే లక్ష్యం

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/జనగామ: నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు రెండు పంటలకు సాగునీరు అందించడమే లక్ష్యమని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం స్టేషన్‌ఘనపూర్ రిజర్వాయర్ నుండి రిజర్వాయర్ కింద ఉన్న ఆయకట్టుకు పంట కాలువ ద్వారా ఎమ్మెల్యే కడియం సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా తూము వద్ద గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు, కుంకుమ, పూలు సమర్పించారు. అనంతరం స్టేషన్‌ఘనపూర్ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కడియం మాట్లాడుతూ 2023 నవంబర్‌లో ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో దేవాదుల కింద ఉన్న రిజర్వాయర్ల ద్వారా ప్రతి గ్రామానికి సాగునీరు అందించాలనే ఏకైక ఎజెండాతో పని చేస్తున్నట్లు తెలిపారు. స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి గోదావరి జలాలు తీసుకువచ్చి ప్రతి ఎకరానికి రెండు పంటలకు సాగునీరు అందించడమే ఏకైక లక్ష్యమన్నారు. వచ్చే 6 నెలల్లో 100 శాతం దేవాదుల పనులను పూర్తి చేసి నియోజకవర్గంలోని పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందిస్తానని స్పష్టం చేవారు ఘనపూర్ రిజర్వాయర్ కింద పూర్తి ఆయకట్టుకు రెండు పంటలకు సాగునీరు అందించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు.

**జీవో 97ను రద్దు చేయాలి:** గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తిగా జీవో 97ను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎంను ప్రత్యేకంగా కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థులను ఇంజనీరింగ్ నుండి లేబర్ డిపార్ట్‌మెంట్‌కు అనుసంధానం చేయడం విద్యార్థులకు ఇష్టం లేదన్నారు. ప్రభుత్వ ఆలోచన మంచిదే అయినప్పటికీ విద్యార్థులు అందుకు ఒప్పుకోవడం లేదని కావున విద్యార్థుల ఆందోళనలు, అపోహలు దృష్టిలో పెట్టుకుని జీవో 97ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వినయ్ కుమార్, లావణ్య శిరీష్ రెడ్డి, వెంకన్న, శిరీష్ రెడ్డి, కిషన్ రాజ్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధమైన బోధనతో ఉత్తమ ఫలితాలు

### కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ప్రజాపక్షం/ములుగు: ప్రణాళికబద్దమైన బోధనతో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలోని నిఘా కెమెరాల పనితీరు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్న అనంతరం తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించారు. జూనియర్ కళాశాల విద్యార్థినులకు నిర్వహిస్తున్న యూనిట్ పరీక్షల తీరును పరిశీలించి, పరీక్షల నిర్వహణపై సంబంధిత ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థినులకు నిర్ణీత ఆహార పట్టిక ప్రకారం నాణ్యమైన, పౌష్టికమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శనివారం ఆహార పట్టిక ప్రకారం అందించాల్సిన భోజన పదార్థాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భోజనం తయారీలో నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, విద్యాభ్యాసం, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ స్వాతి, రికార్డు అసిస్టెంట్ రాజు, సంబంధిత అధికారులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



ప్రజాపక్షం/కోరుట్ల : రక్షాబంధన్ భారతీయ సంస్కృతిలో ప్రేమ, ఆప్యాయత, అనుబంధం, సోదరభావానికి ప్రతీకగా నిలిచే పండుగ. ప్రతి సంవత్సరం శ్రావణ పౌర్ణమి రోజున ఈ పండుగను జరుపుకుంటారని సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం అన్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను సి.ప్రభాకర్ భవన్ లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు, కార్యకర్తలు పరస్పరం రాఖీలు కట్టుకుని సోదరభావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా మహిళలు, సోదరీమణులకు సిపిఐ నాయకులు రక్షాసూత్రాలు కట్టి వారి శ్రేయస్సును ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేస్తూ, సమాజంలో సౌభ్రాతృత్వాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలోసిపిఐనాయకులు,కార్యకర్తలు,మహిళానాయకులుపాల్గొన్నా రు.

## తాళం పగులగొట్టి బంగారం, వెండి, నగదు చోరీ



ప్రజాపక్షం / గంగాధర: గంగాధర మండల కేంద్రానికి చెందిన కనపర్తి మల్లిఖార్జున కుటుంబ సభ్యులతో కలిసి రాఖీ పండుగ జరుపుకొనుటకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కోరుట్ల పట్టణానికి వెళ్లారు. తిరిగి అతను శనివారం ఉదయం 11 గంటలకు వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. శుక్రవారం రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి ఇంటిలోపల 2 తులాల బంగారు చైన్( ఒక్కొక్కటి తులం బరువు), 15 తులాల వెండి పట్టీలు, బ్యాగ్‌లో పెట్టిన కొంత నగదును చోరీ చేశారు. బాధితుడు కనపర్తి మల్లిఖార్జున ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి క్లూస్ టీం సహాయంతో వేలి ముద్రలు తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గంగాధర ఎస్ఐవంశీకృష్ణ తెలిపారు.

## పాలు, పెరుగు ధరలను వెంటనే తగ్గించాలి: పైడిపల్లి

ప్రజాపక్షం/కరీంనగర్: ఇష్టారాజ్యంగా కరీంనగర్ డెయిరీ ఆరు నెలలకు ఒకసారి పాల ధరలను పెంచుతున్నారని, పెంచిన పాలు, పెరుగు ధరలను తగ్గించాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలోనే కాకుండా తెలంగాణ ఇతర రాష్ట్రాల్లో కూడా కరీంనగర్ డైరీ పాలు విస్తరించబడ్డాయని, దీనిని అదును చేసుకొని కరీంనగర్ పాల డైరీ యజమాన్యం ఇష్టం వచ్చినప్పుడు ఇష్టం వచ్చిన ధరలు పెంచుతూ ప్రజలను ఆర్థిక భారం మోపుతుందని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పైడిపల్లి రాజు కోరారు. డెయిరీలో పనిచేసే కార్మికులకు మాత్రం కనీస వేతనాలు చెల్లించడం లేదని, పాడి రైతుల పాల ధరని కూడా పెంచడం లేదని పాలు,పెరుగు ధరలు మాత్రం పెంచుతున్నారని.. ఇంత దోపిడీ జరుగుతున్న పట్టించుకునే నాధుడు కరువయ్యాడని ఆయన ఆరోపించారు. నాలుగు, ఐదు నెలలకు ఒకసారి రెండు, మూడు రూపాయలు పెంచుతూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. వెంటనే పెంచిన ధరలు తగ్గించాలని పైడిపల్లి రాజు కోరారు.

## రాయదండిలో.. ప్రమాదకర రోడ్డు!




ప్రజాపక్షం/అంతర్గాం : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం రాయదండి నుంచి రామగుండం నగరపాలక 28వ డివిజన్ విలేజి రామగుండం వెళ్లే ప్రధాన సిసిరోడ్డుకు ఇరువైపుల పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ దారి గుండా రాత్రిపూట వాహనాలపై రాకపోకలు చేపట్టే గ్రామాల ప్రజలకు, రాయదండి శివాలయానికి వెళ్లే భక్తులకు ప్రమాదం పొంచి ఉంది. వెంటనే మరమ్మతులు చేపట్టాలని రామగుండం నగరపాలక అధికారులను ప్రజలు, వాహనదారులు కోరుతున్నట్లు రాయదండి గ్రామ పంచాయతీ 5వ వార్డు సభ్యుడు ఎండి.గౌస్‌బాబా 'ప్రజాపక్షం'కుతెలిపారు.

## మంత్రి శ్రీధర్ బాబుకు రాఖీ కట్టి, వివాహానికి ఆహ్వానించిన మాజీ ఎంపిటిసి




ప్రజాపక్షం/ముత్తారం : తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును అడవి శ్రీరాంపూర్ తాజా మాజీ ఎంపిటిసి గీతా రాణిబాలాజీ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆమె మంత్రి శ్రీధర్ బాబుకు రాఖీ కట్టి,రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి గీతారాణి బాలాజీ తన ప్రథమ కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేసి,పెళ్లికి తప్పక విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని వివాహ మహోత్సవానికి ఆహ్వానించారు.

## పోలీస్‌స్టేషన్‌ను ఏసిపి తనిఖీ



ప్రజాపక్షం/కొండపాక : గజ్వేల్ ఏసిపి శనివారం కుకునూర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, ప్రాపర్టీ కేసుల వివరాలను పరిశీలించి, కేసుల దర్యాప్తు, పరిష్కారంలో పోలీసింగ్ విధానంపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి, వాటి నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు.

## ధర్మపురి క్షేత్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

✻ ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.10 కోట్లు✻ పుష్కర పనులకు అదనంగా రూ.40 కోట్లు: మంత్రి అడ్లూరి వెల్లడి




ప్రజాపక్షం/ధర్మపురి : ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థాన అనుబంధ దేవాలయం శ్రీ ఉగ్ర నరసింహస్వామి ఆలయాన్ని ఆగమ శాస్త్ర ప్రకారం పునర్నిర్మించడంతో పాటు పెరుగుతున్న భక్తులు,జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరమని, వారి అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగుతామని అన్నారు.ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంపై శనివారం దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావుతో కలిసి మంత్రి ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రజాభిప్రాయ సేకరణ, సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. బాసర, కాళేశ్వరం, భద్రాచలంతో పాటు ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి కూడా ముఖ్యమంత్రి నిధులు కేటాయించినట్లు చెప్పారు.ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించిందని మంత్రి వెల్లడించారు.ఆగమ శాస్త్ర నిబంధనలకు అనుగుణంగా పనులు చేపడతామన్నారు. ధర్మపురిలోని యోగ నరసింహస్వామి ఆలయం కేంద్ర పరిధిలో ఉన్నందున ప్రస్తుతం ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. అగ్రహార బ్రాహ్మణులు, వేద పండితులు, పట్టణ ప్రజల అభిప్రాయాలను తీసుకుని ప్రణాళికను ఖరారు చేస్తామని తెలిపారు.గోదావరి పుష్కరాల ఏర్పాట్ల కోసం ధర్మపురి నియోజకవర్గానికి ఇప్పటికే రూ.117 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. బైపాస్ రోడ్లు, పుష్కర ఘాట్ల నిర్మాణానికి మరో రూ.40 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి విడుదల కానున్నట్లు వెల్లడించారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.యోగ నరసింహస్వామి ఆలయానికి ఇబ్బంది లేకుండా..దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణాన్ని రూ.10 కోట్లతో చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న యోగ నరసింహస్వామి ఆలయ ప్రతిష్ఠకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పునర్నిర్మాణ పనులు చేపడతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్థపతి ప్రసాద్ ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన వివరాలను సమావేశంలో వివరించారు. సమావేశంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్,జగిత్యాల అదనపు కలెక్టర్ రాజా గౌడ్, ఆర్డీవో మధుసూదన్,ధర్మపురి ఆలయ ఇఒశ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, అగ్రహార బ్రాహ్మణులు,వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ పౌర్ణమి సందర్భంగా బస్సులో ప్రయాణించిన మంత్రి

మహిళలకు రూ.12వేల కోట్ల విలువైన ప్రయాణ సేవలు

మహిళలకు, కార్మికులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం



ప్రజాపక్షం / హుస్నాబాద్: రాఖీ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బిసీ రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడు హైద్రాబాద్ నుండి హుస్నాబాద్ వస్తున్న క్రమంలో నియోజకవర్గ పరిదలో పందిల్ల స్టేజీ నుండి ఆర్‌టిసి బస్సులో ప్రయాణించి మహిళలతో మంచి చెడు కబుర్లు చెబుతు ప్రయానించారు. ఈ సందర్భంగా మంత్రి ఆర్‌టిసి కార్మికులకు, మహిళలు మంత్రి రాఖీ కట్టి వారి అభిమానాన్ని చాటుకున్నారు. వారికి ప్రతీక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, పార్టీ నాయకులతో కలిసి రాఖీ పండుగ వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు 12 వేల కోట్లా విలువైన సేవలు అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం సాధికారత కోసం నిరంతం పని చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మహిళలతో పాటు నాయకులకు స్వీట్లు తినిపించి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం

కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/ సిద్దిపేట : విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురికాకుండా వంటగది, గురుకుల ప్రాంగణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురుకుల ప్రిన్సిపల్‌ను ఆదేశించారు.శనివారం మిరుదొడ్డి మండలంలోని ఆల్వాల్ గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్నా భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఈ రోజు మధ్యాహ్నం వంట కోసం వండిన అన్నం, పప్పు, బెండకాయ కూర, రసం, పెరుగు లను పరిశీలించారు. కూర నాణ్యత మెరుగుపరచాలని సూచించారు. కామన్ డైట్ మెనూలో భాగంగా గుడ్డు ఎందుకు పెట్టలేదని అడగ్గా సాయంత్రం ఎగ్ బజ్జి పెడతామని, దానికోసం గుడ్లు ఉడకబెడుతున్నట్లు వంట సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. కూరగాయలు మంచి నాణ్యమైనవీ మాత్రమే వాడాలని, ఆదేశించారు. వంట గది అపరిశుభ్రంగా ఉండడం చూసి అసహనం వ్యక్తం చేస్తూ విద్యార్థులు సీజనల్ వ్యాధులకు గురైతే సహించేది లేదని ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి సమయవేళల్లో ప్రతి రోజూ వంట పూర్తి కాగానే శుభ్రం చేసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల వద్దకు వెళ్లి పలకరిస్తూ భోజనం ఎలా ఉంది, రోజు మెనూ ప్రకారం పెడుతున్నారా ఆరా తీశారు.

## చదువుతో పాటు క్రీడలూ అవసరం

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ప్రజాపక్షం/జగిత్యాల: చదువులతో పాటు క్రీడలు ఎంతో అవసరమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.బీహాకీ దిగ్గజం, భారతరత్న మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం–2026 సందర్భంగా జగిత్యాల స్వామి వివేకానంద మినీ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ , మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇటీవల పదవీ విరమణ పొందిన వ్యాయామ ఉపాధ్యాయులు విశ్వ ప్రసాద్ ను ఘనంగా సత్కరించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, హాకీ దిగ్గజం, భారతరత్న మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడా రంగానికి అందించిన సేవలు మనందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.చదువులతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, క్రీడలు కేవలం పతకాలు సాధించడానికి మాత్రమే కాకుండా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. జగిత్యాల మినీ స్టేడియంలో బాస్కెట్‌బాల్ కోర్టు పూర్తి చేసేందుకు రూ.10 లక్షలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, ఇది జగిత్యాల జిల్లా క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఇండోర్ స్టేడియంను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఏదో ఒక క్రీడలో తప్పనిసరిగా పాల్గొనాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్,డీవైఎస్ఓ రవి బాబు,కౌన్సిలర్ అరవ లక్ష్మీ రాజు,టిఎన్‌జిఓ అధ్యక్షుడు నాగేందర్,జిల్లా రెవెన్యూ అధ్యక్షుడు వకీల్,యూత్ నాయకులు జంగిలి శశి, ఉపాధ్యాయులు, విద్యార్థులు,అధికారులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై అధ్యాపకుడి దాష్టీకం

ప్రజాపక్షం /మల్లాపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఓ అధ్యాపకుడి లంచ్ బాక్స్ ముట్టారనే అనుమానంతో తన దాష్టికాన్ని విద్యార్థులపై ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.గురువారం రోజున లంచ్ టైం లో విద్యార్థులు అధ్యాపకుడి లంచ్ బ్యాగును తెరిచి అందులో ఏదో కలిపారని అధ్యాపకుడు విద్యార్థులపై అనుమానాన్ని వ్యక్తం చేస్తూ వారిపై దురుసుగా ప్రవర్తించగా,తాము బ్యాగు ముట్టుకోలేదని విద్యార్థులు వారించినప్పటికీ లంచ్ బాక్స్ లో ఉన్న అన్నాన్ని తినాలని,మీరేదో అందులో కలిపారంటూ మెయిన్ గేటుకు తాళం వేసి ఇబ్బంది పెట్టడని, ఏమీ చేయలేని విద్యార్థులు అందులోని అన్నాన్ని తిన్నట్లు తెలిపారు.తమకు సంబంధం లేకుండా తమపై ఆరోపణ లేవనెత్తి సదరు అధ్యాపకుడు తమను కాలేజీలో అవమానించాడంటూ ఆరోపణ ఎదుర్కొన్న విద్యార్థులు ప్రిన్సిపాల్ ముందర తమ బాధను వెళ్లగక్కారు. సమస్య ఎక్కడ బయటకు వస్తుందోనని ముందు జాగ్రత్తతో కళాశాల అధ్యాపకులు విద్యార్థులపై ఒత్తిడి తెచ్చి బలవంతంగా క్షమాపణ లేఖ రాయించినట్లు సమాచారం. విద్యార్థుల తప్పులను సరిదిద్దాల్సిన అధ్యాపకులే ఇలాంటి చర్యలకు పాల్పడితే విద్యార్థులు మరింత కఠినంగా మారే అవకాశం లేకపోలేదని వాదనలు బయట వినిపిస్తున్నాయి. దీనిపై సంబంధిత ప్రిన్సిపల్ సత్యనారాయణ ను వివరణ కోరగా విద్యార్థులే కావాలని చేశారని, తిరిగి మరల సంజాయిశి లేక రాసిచ్చారని చెప్పడం విశేషం.ఆరోపణలు ఎదుర్కొని అన్నం తిన్న విద్యార్థులు ఇద్దరే అయితే శనివారం రోజున 8 మంది పైగా విద్యార్థులతో సంజాయిషి లెటర్ రాయించుకున్న ఘనత కళాశాల అధ్యాపక బృందానికి చెల్లింది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

బిజెపి జిల్లా అధ్యక్షుడు గోపి



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఫీజుల బకాయి – బిజెపి లడాయి కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అధ్యక్షతన దీక్ష శిబిరం ఏర్పాటు చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిల కారణంగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 15,000 కోట్ల ఫీజు బకాయిలను చెల్లించకుండా 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును రేవంత్ రెడ్డి ప్రభు త్వం ప్రశ్నార్థకం చేస్తుందని విమర్శించారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర నాయకులు ,జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, శీలం రాజు, ఉడుగుల యాదగిరి, దుమాల శ్రీకాంత్, రేపాక రామ చంద్రం రెడ్డి,మీరాల్కర్ బాలాజీ, సొల్ల క్రాంతి కుమార్, రేగుల సంతోష్, యాదగిరి, మలోత్ సాయికిరణ్ నాయక్, కర్నె హరీషా, కౌన్సిలర్ సభ్యులు, బిజెపి జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీట్, పిజి 2026 పరీక్షకు పటిష్ఠ ఏర్పాట్లు

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజాపక్షం/రామగిరి: జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలో ఆగస్టు 30 న నిర్వహించనున్న నీట్ పిజి2026 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగ పూర్తి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ .శ్రీహర్ష డిసిపిరామ్ రెడ్డితో కలిసి పరీక్ష కేంద్రా న్ని పరిశీలించారు.పరీక్ష ఉదయం 9:00 సమయం నుంచి మధ్యాహ్నం 12: 30 సమయం వర కు పరీక్ష జరుగుతు ందని అభ్యర్థులు ఉదయం 7:30 సమ యం నుంచి 8:45 సమయం వరకు ప రీక్ష కేంద్రానికి అనుమతి ఉంటుంద ని తెలిపారు.ఓర్జినల్ గుర్తింపు ఎంబిబిఎ స్ అర్హత పత్రాలు నిర్దేశిత అడ్మిట్ కార్డుల ను వెంట తెచ్చుకోవాలని సూచించా రు . విద్యుత్ వైద్య పోలీస్ బందోబస్తు సిసి టివి నిఘా మొబైల్ జామర్లు బయోమెట్రిక్ ధ్రువీకరణ హెచ్ హెచ్ ఎం డి పటి ష్ఠ భద్రత ఏర్పాటు చేయాలని ఎలక్ట్రానిక్ వస్తువులు,గడియారాలు,ఆభరణా లు, షూస్ అనుమతించబోమన్నారు.ప రీక్ష పర్యవేక్షణకు రెండు ఫ్లయింగ్ స్కా డులు ఏర్పాటు చేసి అధికారులు సమన్వయంతో పరీక్షను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

ప్రజాపక్షం/పెద్దపల్లి : ప్రత్యేక సవరణ ఓటర్ల జాబితా (సర్) ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశించారు. శనివారం జూలపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటి సర్వే, ఓటర్ల వివరాల పరిశీలన, మ్యాపింగ్ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు, చిరునామా మార్పులు, ఇతర అభ్యంతరాలు ఉన్న సందర్భాల్లో నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు సక్రమంగా జారీ చేయాలని ఆదేశించారు. జారీ చేసిన నోటీసులకు సంబంధించి వివరణలను స్వీకరించి, ప్రతి అంశంపై నిబంధనల ప్రకారం విచారణ నిర్వహించాలని తెలిపారు. ఎటువంటి అర్హుడి పేరు అనవసరంగా తొలగించకుండా, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎలిగేడ్ మండలం లోకపేట్ గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు పరిశీలించారు. సర్వే పనుల పురోగతిని, భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సమక్షంలోనే భూముల కొలతలు నిర్వహించి వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు.రీసర్వే పనులను వేగవంతం చేసి లైసెన్స్‌డ్ సర్వేయర్ రోజుకు కనీసం 40 ఎకరాల చొప్పున సర్వే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. భూ సరిహద్దులు, యాజమాన్య వివరాల నమోదు సమయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి, రైతులకు ముందస్తుగా అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు.ఎస్ఐఆర్, రీ సర్వే రెండు ప్రక్రియల్లోనూ అధికారులు నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు,బూత్ లెవల్ అధికారులు, లైసెన్స్‌డ్ సర్వేయర్,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## 180 ఎజెండా అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

ప్రశాంతంగా ముగిసిన నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ నగరపాలక సంస్థ సర్వస భ్య సమావేశం మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన, డి ప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమీషనర్ ప్రఫుల్ దే శాయ్, సమక్షంలో ప్రశాంతంగా ముగిసింది. నగరపాలక స ంస్థ ప్రగతి, ప్రజారోగ్యం, అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పొందుపరిచిన మొత్తం 180 ఎజెండా అంశాలపై పాలకవర్గం సుదీర్ఘంగా చర్చించి... ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సాధార ణ సర్వసభ్య సమావేశ విజ్ఞప్తుల సమయంలో డివిజన్ల వారిగా పాలకవర్గ సభ్యులు ప్రజల సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా నగర పారిశుద్ధ్యం, వీదిదీపాల నిర్వహణ, త్రాగు నీటి సమస్య, ప్లాస్టిక్ నివారణ, పర్యావరణ పరిరక్షణ, ఇందిరమ్మ గృహాలు, నగరపాలక సంస్థ పరిధిలోని 22 ఏ భూ ముల పరిష్కారం, తదితర అంశాలు, సమస్యల పై సభ్యులు స భ దృష్టికి తెచ్చారు. పాలకవర్గ సభ్యులు లేవనెత్తిన ప్రతి సమస్యపై మేయర్ కొలగాని శ్రీనివాస్, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ సానుకూలంగా స్పందిస్తూ సమగ్ర వివరణ ఇచ్చారు. డివిజన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తామని, ప్రజారోగ్యానికి, అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ కరీంనగర్‌ను మోడల్ నగరంగా తీర్చిదిద్దడానికి పాలకవ ర్గం, అధికారులు సమన్వయంతో ముందుకుసాగాలని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ పలు విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధినిర్వహణ చేయాలని... ప్రజలకు, పాలకవర్గానికి జవాబుదారితనంగా వ్యవహరించాలని సభలో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భం గా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ నగరపాలక సంస్థ ను ప్లాస్టిక్ రహిత... మోడల్ నగరంగా తీర్చిదిద్దేందుకు పా లకవర్గం పని చేస్తుందని తెలిపారు. వచ్చే గణేష్ ఉత్సవాల ఏర్పాట్లు, మండపాలకు ఉచిత కరెంట్ అందించేందు కు సభలో పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందన్నారు. నగరంతో పాటు నూతనంగా విలీనమైన గ్రా మాల డివిజన్లు సరైన మౌలిక వసతులు కల్పించేలా అ న్ని అంశాలను పొందుపరిచి ఆమోదించామని తెలిపా రు. ప్రధాన సమస్య అయిన డంపింగ్ యార్డును స్వచ్ఛ్ భారత్ మిషన్ కింద రూ.17 కోట్ల నిధులు కేటాయించి టెండర్ ప్రక్రియ చేపడుతున్నామని... స్మార్ట్ సిటీ నుండి రూ.8 కోట్లు నిధులు కేటాయించి... ప్రక్షాళన చేసి ప్ర జల సమస్యను తొలగిస్తామన్నా రు.నగరంలోని 66 డివిజన్లకు సంబంధించి పాలకవర్గ స భ్యులు దృష్టికి తెచ్చిన ప్రతి ప్రజా సమస్యను దశలవారిగా పరిష్కరించి... అభివృద్ధి సంక్షేమంతో ముందుకు సాగుతామని తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహాకారం తో క రీంనగర్ నగరపాలక సంస్థ ను అర్బన్ చాలేంజ్ ఫండ్ ప థకంలో చేర్చి... 840 కోట్ల అభివృద్ధి ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. త్వరలోనే యూసిఎఫ్ పనులు కూడ ప్రారంభం చేస్తామని తెలిపారు. ప్రస్తుత ఏబిసి సెంటర్ లో ఇంకా కెపాసిటీ పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కెనల్స్ సంఖ్యను పెంచడంతో పాటు కంపోండ్ వాల్, వసతుల సౌకర్యం కోసం 2 కోట్ల నిధులు కేటాయించి టెండర్ ప్రక్రియ చేపట్టామని తెలిపారు. ఎబిసి సెంటర్ లో 150 కెనల్స్ ఏర్పాటు చేసి ఆపరేషన్ చేసేలా చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. విలీన గ్రామాల డివిజన్ల కు సంబంధించిన ఇంటి నెంబర్లను ఆన్ లైన్ ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. పాలకవర్గ సభ్యులు సభ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు, అధికారుల పాల్గొన్నారు.

# 'శుద్ధీకరణ' నేరం

- మల్లికార్జున ఖర్గేకు న్యాయం జరగాలి
- కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రసంగ స్థలిని శుద్ధీకరణకు పాల్పడిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- ప్రధాని మోదీకి ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్





**న్యూఢిల్లీ :** బిజెపి– ఆర్‌ఎస్‌ఎస్‌పై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ నెల ప్రారంభంలో హల్ద్వానీలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన సభ జరిగిన ప్రదేశంలో నిర్వహించిన శుద్ధీకరణపై మండిపడ్డారు. ఈ చర్య నేరపూరితమైందని, ఈ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రధాని మోదీ ఆదేశించాలని డిమాండ్ చేశారు. శనివారం ఢిల్లీలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దళితులు అభివృద్ధి చెందడం, గౌరవంగా జీవించడం, విజయం సాధించడం బిజెపి– ఆర్‌ఎస్‌ఎస్‌కు ఇష్టం లేదనే వారి మనస్తత్వాన్ని ఈ ఘటన తెలియజేస్తోందన్నారు. 'ఇక్కడ రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం జరుగుతోంది. ఒకవైపు బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి వారు అందించిన రాజ్యాంగం, మరోవైపు బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం' అని ఆయన అన్నారు. 'మేము కాంగ్రెస్ అధ్యక్షుడికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్నాము. ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడికి న్యాయం చేయండి. ఖర్గేకు న్యాయం జరిగేలా చూడటం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత' అని పేర్కొన్నారు. ఈ శుద్ధీకరణ చర్యను సమర్థించినందుకు ఉత్తరాఖండ్ బిజెపి చీఫ్ మహేంద్ర భట్‌పై రాహుల్‌గాంధీ మండిపడ్డారు. ఈ నేరం జరిగి 20 రోజులు గడిచినా, ఇప్పటివరకు ఎటువంటి చర్య తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దీనికి పాల్పడిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. తాను అన్ని కులాలకు చెందినవాడినని, దేశ ప్రధానినని మోదీ చెబుతుంటారు, కానీ ఆయన పార్టీకి చెందిన ఉత్తరాఖండ్ చీఫ్ మాత్రం ఈ శుద్ధీకరణ చర్యను సమర్థిస్తున్నారు అని రాహుల్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులే దీనికి పాల్పడ్డారని, వారిపై ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రధాని ఆదేశించాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. తమ పార్టీ అధ్యక్షుడికి న్యాయం జరిగేలా కాంగ్రెస్ చూస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'వేల సంవత్సరాలుగా దళితులపై హింస జరుగుతూనే ఉంది. రాజ్యాంగం ప్రకారం ఇది చట్టవిరుద్ధం, కానీ నేటికీ పాఠశాలల్లో దళిత పిల్లలతో మరుగుదొడ్లు శుభ్రం చేయిస్తున్నారు. ఇదే దేశ వాస్తవ పరిస్థితి అని అన్నారు. 'దళితులను బావుల నుండి నీరు తాగనివ్వరు. టీ దుకాణాల్లో రెండు రకాల కప్పులు ఉంటాయి. దళితులకు పేపర్ కప్పులు, ఇతరులకు గాజు గ్లాసులు. భారతదేశంలో పెళ్లి ఊరేగింపులో, గుర్రం ఎక్కినందుకు దాడికి గురయ్యే ప్రమాదం ఉన్నందున దళిత వరుడు హెల్మెట్ ధరించాల్సి వస్తోంది. దేశంలో వాస్తవ పరిస్థితి ఇది,' అని ఆయన వివరించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజస్థాన్ పార్టీ నేత టికారామ్ జుల్లీ, ఎన్‌డిఎ మంత్రి జీతన్ రామ్ మాంఝీ వంటి వారు వివిధ సందర్భాల్లో 'శుద్ధి' ప్రక్రియలకు గురైన ఉదాహరణలను ప్రస్తావిస్తూ, ఒక దళిత వ్యక్తి ఎంత ఎక్కువ విజయం సాధిస్తే, వారిపై జరిగే దాడి అంత తీవ్రంగా ఉంటుందని అన్నారు. ఇది అంటరానితనానికి మరో రూపంగా రాహుల్ అభివర్ణించారు. 'బిజెపి వారు అంటరానితనాన్ని పాటిస్తారు. వారు 'శుద్ధి' (శుద్ధీకరణ) చేసినప్పుడు, దళితులు అపవిత్రులని, వారిని తాకకూడదని అంటారు' అని అన్నారు. హల్ద్వానిలో ఖర్గే ర్యాలీ జరిగిన రెండు రోజుల తర్వాత, ఆగస్టు 10న శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారని, ఇది ఒక నేరమని, 13న ఖర్గే పార్లమెంటులో ఈ విషయాన్ని లేవనెత్తారని గుర్తుచేశారు.

## నేపాల్‌లో చిక్కుకున్న వరద బాధితుల

# తరలింపు ముమ్మరం చేయండి

- సహాయక చర్యల్లో సహాయపడేందుకు నేపాల్‌కు ఎన్‌డిఆర్‌ఎఫ్‌ను మోహరింపుచేయండి
- ప్రధాని మోదీ, అమిత్ షాకు మల్లికార్జున ఖర్గే లేఖ

**న్యూఢిల్లీ :** వరద ప్రభావిత నేపాల్‌లో చిక్కుకుపోయిన భారతీయులందరినీ సురక్షితంగా స్వదేశానికి చేరుకునేలా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. రెస్క్యూ, తరలింపు చర్యలు తీవ్రతరం చేయాలని కోరారు. ఈ మేరకు శనివారం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఆయన లేఖ రాశారు. సహాయక, తరలింపు, పునరావాస చర్యలకు సహాయపడేందుకు నేపాల్‌లో అవసరమైన చోటల్లా జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్)ను మోహరించాలని కోరుతూ ఖర్గే కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు కూడా లేఖ రాశారు. ప్రభుత్వం ఈ మానవతా సంక్షోభాన్ని దానికి తగినంత అత్యవసరంగా, సున్నితంగా పరిగణిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రికి రాసిన లేఖలో, నేపాల్ ప్రభుత్వ సమన్వయంతో అక్కడి బాధితులకు తగిన సహాయం అందేలా చూడాలని కూడా ఖర్గే కోరారు. ఇటీవలి మీడియా నివేదికలను ఉటంకిస్తూ, 600 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, దాదాపు 1,000 మంది ఇప్పటికీ గల్లంతయ్యారని ఆయన తెలిపారు. ఈ విపత్తు కారణంగా వేలాది మందికి ఆహారం, మందులు, ఆశ్రయం, ఇతర అత్యవసర సహాయం తక్షణమే అవసరమని ఆయన పేర్కొన్నారు. 'నేపాల్ ప్రభుత్వ సమన్వయంతో, అక్కడి ప్రభావిత ప్రజలకు తగినంత మానవతా, సహాయక చర్యలు అందేలా చూడాలని కోరుతున్నాను. వరదల కారణంగా నేపాల్‌లోని వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన భారతీయులు, భారత సంతతికి చెందిన వ్యక్తుల గురించి కూడా ఆందోళన చెందుతున్నాను. సహాయక, తరలింపు ప్రయత్నాలను ముమ్మరం చేయాలని, వారిని సురక్షితంగా, త్వరగా భారతదేశానికి తిరిగి తీసుకురావడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నాను' అని కాంగ్రెస్ అధినేత అన్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ నుండి అందిన తాజా సమాచారం ప్రకారం 320 మంది భారత జాతీయులు అందుబాటులో లేరని ఆయన పేర్కొన్నారు. ఇక హోం మంత్రికి విడిగా రాసిన లేఖలో, అవసరమైన చోటల్లా ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను మోహరించి, విపత్తు సహాయక చర్యలు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ అపారమైన కష్టకాలంలో, సహాయక, తరలింపు, పునరావాస కార్యకలాపాలకు మద్దతుగా, నేపాల్ ప్రభుత్వ సమన్వయంతో, అవసరమైన చోటల్లా ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను మోహరించడంతో సహా, భారతదేశం నేపాల్ ప్రజలకు గట్టిగా అండగా నిలబడాలి. ప్రకృతి వైపరీత్యాలకు స్పందించడంలో ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు ఉన్న నైపుణ్యం, అనుభవం ప్రాణాలను కాపాడే ప్రయత్నాలకు, ఈ అపారమైన విషాదాన్ని ఎదుర్కొంటున్న వారికి తక్షణ సహాయం అందించడానికి విలువైన మద్దతును ఇవ్వగలవని ఆయన అన్నారు.



షాకు రాసిన తన లేఖను ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'ప్రభుత్వం ఈ మానవతా సంక్షోభాన్ని దానికి తగినంత అత్యవసరంగా, సున్నితంగా పరిగణిస్తుందని ఆశిస్తున్నాను. నేపాల్‌లో సంభవించిన తీవ్రమైన ప్రకృతి వైపరీత్యం పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ప్రాణనష్టం, ఇళ్లు, మౌలిక సదుపాయాల భారీ విధ్వంసం, అలాగే అసంఖ్యాక ప్రజలు నిరాశ్రయులవ్వడం వంటి పరిణామాలు బాధితులను తీవ్ర వేదనకు గురిచేశాయని కాంగ్రెస్ అధినేత పేర్కొన్నారు. భారత ప్రజలకు నేపాల్ ప్రజలతో లోతైన, చిరకాల అనుబంధం ఉందని, ఈ తీవ్ర దుఃఖ సమయంలో, భారత్ తన పొరుగు దేశానికి అండగా నిలవాలని, ఈ వినాశకరమైన విపత్తు బారిన పడిన వారికి సాధ్యమైనంత సహాయం అందించాలని సూచించారు. బుధవారం నాడు నేపాల్‌లోని రసువా, ఇతర మధ్య ప్రాంతాలలో సంభవించిన ఆకస్మిక వరదల నేపథ్యంలో, స్థానిక అధికారులకు సహాయం చేయడానికి 11 మంది సభ్యులతో కూడిన భారత బృందం శనివారం అక్కడికి చేరుకుంది. ఈ ఘటనలో 600 మందికి పైగా మరణించగా, దాదాపు 2,000 మంది గల్లంతయ్యారు.

## కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘన..

# మమతా బెనర్జీపై ఎఫ్ఐఆర్

**కోల్‌కతా :** టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీపై ఎఫ్ఐఆర్ నమోదైంది. కోల్‌కతాలో టిఎంసిపి వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడానికి కలకత్తా హైకోర్టు విధించిన షరతులను ఉల్లంఘించినట్లు ఆరోపిస్తూ, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీపై కోల్‌కతా పోలీసులు సుమోటోగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఒక సీనియర్ అధికారి శనివారం తెలిపారు. శుక్రవారం హేస్టింగ్స్ పోలీస్ స్టేషన్‌లో బెనర్జీతో పాటు తృణమూల్ ఛత్ర పరిషత్ (టిఎంసిపి) సమావేశ నిర్వాహకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఆ అధికారి పేర్కొన్నారు. దర్యాప్తు సమయంలో ఈ ఉల్లంఘనలో పాల్గొన్న వారందరి పాత్రను పరిశీలిస్తామని, ఈనెల 28న భారతీయ న్యాయ సంహిత లోని వివిధ సెక్షన్ల కింద ఈ కేసు నమోదు అయినట్లు ఆయన చెప్పారు. శుక్రవారం మధ్య కోల్‌కతాలోని కథీడ్రల్ రోడ్‌లో టిఎంసిపి సమావేశాన్ని నిర్వహించడానికి కోర్టు విధించిన షరతులను పరిశీలించిన తర్వాత ఈ కేసు నమోదు చేసినట్లు ఆ అధికారి తెలిపారు. 'హేస్టింగ్స్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సబ్‌ఇన్‌స్పెక్టర్ అపు బైద్య దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేయబడింది. బెనర్జీ, నిర్వాహకులు నేరపూరిత కుట్రకు పాల్పడ్డారని, అందులో భాగంగానే హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని ఆరోపణలు ఉన్నాయి' అని ఆయన చెప్పారు. కార్యక్రమం జరుగుతుండగా, టిఎంసిపి మద్దతుదారులు బారికేడ్లను దాటి, శాంతిభద్రతల పరిరక్షణ కోసం మోహరించిన పోలీసు సిబ్బందితో తోపులాటకు దిగారని, దీనివల్ల గందరగోళ పరిస్థితి ఏర్పడిందని ఆ అధికారి పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన వారు కథీడ్రల్ రోడ్‌లోని ఒక వైపున వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారని ఆయన చెప్పారు.

# కేరళ సిఎం కాన్వాయ్ అడ్డగింత

## వాదనకు దిగిన కాంగ్రెస్ నేత

**తిరువనంతపురం:** కేరళలో ముఖ్యమంత్రి సతీశన్‌కు చేదు అనుభవం ఎదురైంది. సొంత పార్టీకి చెందిన కార్యకర్త ఆయన కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. తాము ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రావాలని వాదనకు దిగారు. ఈ నేపథ్యంలో ఆ కాంగ్రెస్ నేతను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సాంఘిక సంస్కర్త నారాయణ గురు జయంతి సందర్భంగా శుక్రవారం చెంపాజంతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు సిఎం సతీశన్ కాన్వాయ్‌లో బయలుదేరారు. అయితే చెంతి ప్రాంతంలో కూడా నారాయణ గురు జయంతి కార్యక్రమాన్ని అక్కడి కాంగ్రెస్ నేతలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఆ కార్యక్రమంలో పాల్గొనాలంటూ సిఎం సతీశన్ కాన్వాయ్‌ను వారు అడ్డుకున్నారు. కాగా, వాహనం నుంచి దిగిన సిఎం సతీశన్, తిరువనంతపురం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) నాయకుడు అనిల్ కుమార్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కొద్ది నిమిషాల తర్వాత సిఎం సతీశన్ తిరిగి తన వాహనంలోకి ఎక్కి అక్కడి నుంచి వెళ్లిపోయారు. చెంతిలో జరిగిన కార్యక్రమం తన అధికారిక షెడ్యూల్‌లో భాగం కాదని సిఎం సతీశన్ కార్యాలయం ఆ తర్వాత స్పష్టం చేసింది. మరోవైపు తిరువనంతపురం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) నాయకుడు అనిల్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిఎం కాన్వాయ్‌ను అక్రమంగా అడ్డుకోవడం, నేరపూరిత బెదిరింపులు, ప్రభుత్వ అధికార విధులకు ఆటంకం కలిగించడం వంటి అభియోగాలకు సంబంధించిన పలు సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదు చేశారు. నిందితుడు ముఖ్యమంత్రిని దూకుడుగా నిలదీశాడని, ముందుగా నిర్ణయించిన కార్యక్రమం అయినప్పటికీ ఆయన ఎందుకు హాజరుకాలేదని గట్టిగా ప్రశ్నించాడని పోలీసులు ఆరోపించారు. దూకుడుగా ప్రవర్తించవద్దని సిఎం సూచించినప్పుడు, 'నాకు కోపం వస్తే ఏం చేస్తారు?' అని నిందితుడు బెదిరించాడని, తద్వారా ముఖ్యమంత్రిని బహిరంగంగా అవమానించడమే కాకుండా కాన్వాయ్‌తో పాటు ఉన్న పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఢిల్లీలో 47.7 లక్షల ఓట్ల తొలగింపు?

## రేపు ముసాయిదా ఓటరు జాబితా విడుదల


**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) ప్రక్రియలో భాగంగా ఢిల్లీలో సోమవారం ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుంది. మొత్తం 1.45 కోట్ల మంది ఓటర్లలో దాదాపు 47.7 లక్షల మంది పేర్లు తొలగించబడే అవకాశం ఉంది. తుది జాబితా నవంబర్ 4న విడుదల కానుంది. ముసాయిదా జాబితాలో పేరు లేని వారు, ఈనెల 31 నుండి సెప్టెంబర్ 30 వరకు తమ పేర్లను చేర్చాలని కోరుతూ అభ్యర్థనలు లేదా అభ్యంతరాలను దాఖలు చేయవచ్చని అధికారులు తెలిపారు. ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఈనెల 17న ముగిసిన ఇంటింటి సర్వేలో వివరాలు సేకరించి డిజిటలైజ్ చేసిన సుమారు 97.5 లక్షల మంది ఓటర్ల పేర్లు ఈ ముసాయిదా జాబితాలో ఉంటాయి. ఇది ఢిల్లీలోని మొత్తం 1,45,10,299 మంది ఓటర్లలో 67.18 శాతానికి సమానం. మిగిలిన 47.7 లక్షల మంది ఓటర్ల వివరాలను సేకరించలేకపోవడంతో, వారిని 'గైర్హాజరు, నివాసం మారిన వారు, మరణించినవారు, నకిలీలు, ఇతరులు' (ఎఎస్‌డిడిఒ) అనే వర్గాలలో చేర్చారు. వీరు ముసాయిదా జాబితాలో కనిపించరు, కానీ ఈనెల 31 నుండి సెప్టెంబర్ 30 వరకు అభ్యర్థనలు లేదా అభ్యంతరాలను దాఖలు చేయడం ద్వారా తమ పేర్లను జాబితాలో చేర్చుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ, వారి వివరాలను 2002 నాటి సమగ్ర సవరణ జాబితాతో సరిపోల్చలేకపోయినా లేదా వారి వివరాల సేకరణ పత్రాలలో ఏవైనా లోపాలు ఉన్నట్లు తేలినా, సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అటువంటి లోపాలలో... ప్రస్తుత జాబితాలోని ఓటరు పేరుకు, 2002 నాటి జాబితాలోని పేరుకు మధ్య వ్యత్యాసం ఉండటం; ఓటరుకు, వారి తల్లిదండ్రులకు మధ్య వయస్సు వ్యత్యాసం 15 ఏళ్ల కంటే తక్కువగా లేదా 50 ఏళ్ల కంటే ఎక్కువగా ఉండటం; లేదా తోబుట్టువుల పుట్టిన తేదీల మధ్య తొమ్మిది నెలల కంటే తక్కువ వ్యవధి ఉండటం వంటివి ఉండవచ్చని ఢిల్లీ సిఇఒ కార్యాలయ అధికారి ఒకరు తెలిపారు. ఓటరు వయస్సు లేదా పౌరసత్వంపై సందేహాలు ఉన్నప్పుడు, ఎన్నికల నమోదు అధికారి (ఇఆర్‌ఒ) అదనపు పత్రాలను కోరవచ్చని ఆ అధికారి చెప్పారు. అర్హతను నిరూపించుకోవడానికి కేవలం ఆధార్ మాత్రమే సరిపోదు. అవసరమైన పత్రాలు ఓటరు పుట్టిన తేదీని బట్టి కూడా మారుతూ ఉంటాయి. జులై 1, 1987కి ముందు భారతదేశంలో జన్మించిన వారికి, వారి పుట్టిన తేదీ/లేదా పుట్టిన స్థలాన్ని ధృవీకరించే పత్రం అవసరం అవుతుంది. జులై 1, 1987, డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారికి తమకు, తల్లిదండ్రులకు సంబంధించిన పత్రాలు అవసరమవుతాయి. అలాగే డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారికి తమకు, తల్లిదండ్రులు ఇద్దరికీ సంబంధించిన పత్రాలు అవసరమవుతాయని అధికారులు తెలిపారు. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తొలగించబడిన లేదా సేకరించలేని వివరాల విషయంలో వ్యత్యాసాలు కనిపించాయి.



ప్రధాన ఎన్నికల అధికారి గణాంకాల ప్రకారం, రోహిణి నియోజకవర్గం అత్యధికంగా 83.43 శాతం గణన పత్రాల డిజిటలైజేషన్‌ను నమోదు చేయగా, తుగ్లకాబాద్ అత్యల్పంగా 52.15 శాతాన్ని నమోదు చేసింది. మైనారిటీ జనాభా ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలలో, ఓఖ్లాలో మొత్తం 3,62,813 పత్రాలకు గాను 1,64,435 పత్రాలు (అంటే 45.32 శాతం) సేకరించలేనివిగా గుర్తించబడ్డాయి. చాందినీ చౌక్ 38.98 శాతం నమోదు చేయగా, తర్వాతి స్థానాల్లో బల్లిమారన్ (32.65 శాతం), ముస్తఫాబాద్ (28.09 శాతం), బాబర్‌పూర్ (27 శాతం), మటియా మహల్ (24.50 శాతం) మరియు సీలంపూర్ (23.37 శాతం) నిలిచాయి. షహీన్ బాగ్, జసోలా విహార్ వంటి ప్రాంతాల్లోని నివాసితుల వివరాలను 2002 నాటి ఓటర్ల జాబితాతో అనుసంధానించడంలో, ముఖ్యంగా బిహార్, ఉత్తరప్రదేశ్, అసోం, పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన వలస కుటుంబాల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు బూత్ స్థాయి అధికారులు గతంలోనే నివేదించారు.

# గడువు తీరిన ఆహార పొట్లాలు

- సొంత జిల్లా హింగోలిలో ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన అభిజీత్ దీప్కే



**హింగోలి :** 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారంలో భాగంగా సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, శనివారం తన సొంత జిల్లా హింగోలిలోని ఔంధాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థుల ఆహారం కోసం ఉద్దేశించిన, గడువు ముగిసిన ప్యాకెట్లు బయటబడినట్లు ఆయన పేర్కొన్నారు. పాడైన వాటర్ ఫిల్టర్, పాఠశాల బాత్రూంలో నీటి సరఫరా లేకపోవడం వంటి సమస్యలున్నాయన్నారు. పాఠశాలలోని మసాలా ప్యాకెట్లను మీడియాకు చూపిస్తూ, వాటి గడువు ఫిబ్రవరిలోనే ముగిసిపోయిందని మండిపడ్డారు. 'ఫిబ్రవరిలోనే గడువు ముగిసిన ప్యాకెట్ల నుండి విద్యార్థులకు ఆహారం పెడుతున్నారు. ఇప్పుడు సెప్టెంబర్ ప్రారంభం కాబోతోంది. మంత్రుల పిల్లలకు కూడా అవే ఆహార ప్యాకెట్ల నుండి సిబ్బంది ఆహారం పెడతారా? పేద కుటుంబాల నుండి వచ్చిన పిల్లలకు గడువు ముగిసిన ఆహారాన్ని పెడతారా? అని ఆయన ప్రశ్నించారు. దీప్కే పాఠశాల ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌ను, నీటిని తనిఖీ చేశారు. ఆయన ఆ ప్రాంతానికి సంబంధించిన అధికారితో కూడా మాట్లాడారు. 'ఆ ఆహార ప్యాకెట్లను ఆరు నెలలుగా వాడుతున్నారు. ఫిల్టర్ ఉంది, కానీ అది పనిచేయక పోవడంతో విద్యార్థులు బోర్‌వెల్ నీళ్లు తాగుతున్నారు. బాత్రూంలో కూడా నీళ్లు లేవు' అని ఆయన సంబంధిత అధికారికి ఫోన్‌లో తెలిపారు. విద్యార్థులను జంతువుల కంటే హీనంగా చూస్తున్నారని దీప్కే ఆరోపించారు. నాలుగు తరగతులకు మాత్రమే అనుమతి ఉండగా, 87 మంది విద్యార్థులకు పాఠశాలలో కేవలం రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయని ఆయన అన్నారు. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రాథమిక మౌలిక సదుపాయాల లోపాలను ఎత్తిచూపుతూ, ప్రభుత్వం జవాబుదారీతనం కోరేందుకు దీప్కే ఆగస్టు 15న 'స్కూల్ ఠీక్ కరో' (పాఠశాలను బాగు చేసుకోండి) ప్రచారాన్ని ప్రారంభించారు.

# మనోజ్ జారంగే నిరాహారదీక్ష

- కున్బీ రికార్డుల ఆధారంగా మరాఠాలకు కులధృవీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్
- సిఎం ఫడ్నవీస్ మరాఠాలపై వివక్ష
- సమస్య పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైంది. సిఎం నివాసం ముట్టడిస్తామని హెచ్చరిక



**ఛత్రపతి శంభాజీనగర్ :** మహారాష్ట్రలో రిజర్వేషన్ల కార్యకర్త మనోజ్ జారంగే మరోసారి ఉద్యమబాట పట్టారు. గతంలో గుర్తించిన 58 లక్షల కున్బీ రికార్డుల ఆధారంగా మహారాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆయన నిరవధిక నిరాహారదీక్షను ప్రారంభించారు. ఇకపై ప్రభుత్వానికి తమ సామాజిక వర్గం ఎలాంటి సమయం ఇవ్వబోదని హెచ్చరించారు. జల్నా జిల్లాలోని అంతర్వాలి సారతి గ్రామంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇది తన చివరి ఆందోళన అవుతుందని జారంగే హెచ్చరించారు. మరాఠాలపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు కక్ష ఉందని, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆయనకు మౌనంగా మద్దతు ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. కుల ధృవీకరణ కమిటీని రద్దు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని కోటా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంలో విఫలమైతే, ముంబయిలోని ముఖ్యమంత్రి నివాసం వరకు పాదయాత్ర చేస్తామని హెచ్చరించారు. 'దేవేంద్ర ఫడ్నవిస్ ఉద్దేశపూర్వకంగా మరాఠాలపై కక్ష పెంచుకుంటున్నారని, ఏక్‌నాథ్ షిండే సామాజిక న్యాయ శాఖ మంత్రి సంజయ్ శిర్సత్ ద్వారా ఆయనకు రహస్యంగా మద్దతు ఇస్తున్నారని, వారు మా సమస్యలను పరిష్కరించకపోతే 'వర్ష' బంగ్లా (ముంబయిలోని ముఖ్యమంత్రి అధికారిక నివాసం) వరకు పాదయాత్ర చేస్తామన్నారు. ప్రభుత్వ ప్రతినిధి బృందం చర్చలకు వస్తే తాము వారితో మాట్లాడతాము, కానీ వారు కచ్చితమైన పరిష్కారాలతో రావాలని సూచించారు. అర్హులైన మరాఠాలను కున్బీలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ జారంగే అనేక ఆందోళనలకు నాయకత్వం వహించారు. కున్బీలు ఒక వ్యవసాయ వర్గం, వీరు ఇతర వెనుకబడిన తరగతి (ఒబిసి) కేటగిరీ కింద విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ ప్రయోజనాలను పొందుతున్నారు. ప్రభుత్వం 58 లక్షల కున్బీ రికార్డుల ఆధారంగా మరాఠా సామాజిక వర్గానికి కుల ధృవీకరణ పత్రాలను వెంటనే జారీ చేయాలి. దీని కోసం ప్రభుత్వానికి తమ సామాజికవర్గ సమయం ఇవ్వదని జారంగే అన్నారు. సతారా గెజిట్ ఆధారంగా రిజర్వేషన్లు జారీ చేయాలని, మహారాష్ట్ర వ్యాప్తంగా కోటా నిరసనకారులపై నమోదైన అన్ని పోలీసు కేసులను ఉపసంహరించుకోవాలని, గత ఆందోళనలలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు, ఆర్థిక పరిహారం అందించాలని ఆ కార్యకర్త రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మరాఠా, కున్బీ వర్గాల కోసం ప్రత్యేక రాష్ట్ర శాఖను ఏర్పాటు చేసి, తక్షణమే సిబ్బందిని నియమించాలని, అన్నాసాహెబ్ పాటిల్ ఆర్థిక వికాస్ మహామండల్ ద్వారా అందించిన రుణాలపై వడ్డీని చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న సారథి విద్యార్థి స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, ఎస్ఇబిసి, ఇబిసి కోటాల కింద ఎంపికైన అభ్యర్థులకు తక్షణమే నియామక పత్రాలు జారీ చేయాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. వ్యవస్థాగత పక్షపాతం ఉందని ఆరోపిస్తూ, 'ఈ ప్రభుత్వం మరాఠా సమాజం అభివృద్ధి చెందాలని కోరుకోవడం లేదు. సరైన చారిత్రక ఆధారాలు లభించినప్పటికీ, సమాజ పురోగతిని చూసి అసూయపడే అధికారుల చేతిలోనే సర్టిఫికెట్లు జారీ చేసే అధికారం ఉందని ప్రజలకు చెప్పాను. అధికారులు సరైన వాదనలను ఏకపక్షంగా తిరస్కరిస్తున్నారు' అని జారంగే ఆరోపించారు. కుల ధృవీకరణ కమిటీని రద్దు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.

## ఢిల్లీలో సిఎన్‌జి ధర పెంపు

# కిలోకు రూ. 3.89 పెంచిన ఐజిఎల్

**న్యూఢిల్లీ :** వాహనదారులపై మరోసారి భారం పడింది. పశ్చిమాసియాలో మళ్లీ తలెత్తిన సంక్షోభం, హోర్ముజ్ జలసంధి గుండా గ్యాస్ రవాణాకు అంతరాయం కలగడం వల్ల అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జి ధరలు భారీగా పెరిగాయి. దీనిని కారణంగా చూపుతూ, ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ (ఐజిఎల్) శనివారం ఢిల్లీలో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సిఎన్‌జి) ధరను కిలోకు రూ. 3.89 మేర పెంచింది. ఉదయం నుంచి ధరలు అమల్లోకి రాగా, తాజాగా పెంపుతో ఢిల్లీలో సిఎన్‌జి ధర కిలోకు రూ. 83.09 నుండి రూ. 86.98కి చేరింది. ఈ పెంపుతో కలిపి, ఈ ఏడాది ఢిల్లీలో సిఎన్‌జి ధరల్లో మొత్తం పెరుగుదల కిలోకు దాదాపు రూ. 10కి చేరింది. ఏడాది ప్రారంభంలో ఢిల్లీలో సిఎన్‌జి ధర కిలోకు రూ. 77.09గా ఉండేది. మే నెల ద్వితీయార్థంలో నాలుగు విడతలుగా కిలోకు రూ. 6 మేర ధర పెంచడంతో, శనివారం నాటి పెంపునకు ముందు ధర రూ. 83.09కి చేరింది. నోయిడా, ఘజియాబాద్ వంటి పొరుగు నగరాల్లో కూడా ధరలు పెరిగాయి. ప్రస్తుతం నోయిడాలో సిఎన్‌జి ధర కిలోకు రూ. 95.59, ఘజియాబాద్‌లో రూ. 95.59, గురుగ్రామ్‌లో రూ. 92.01గా ఉంది. స్థానిక పన్నుల (వ్యాట్) ఆధారంగా రాష్ట్రాల వారీగా ధరలు మారుతూ ఉంటాయి. గృహ అవసరాలకు (వంట కోసం) పైపుల ద్వారా సరఫరా చేసే సహజ వాయువు (పిఎన్‌జి) ధరలో ఎలాంటి మార్పు లేదు. ఇది ఢిల్లీలో స్టాండర్డ్ క్యూబిక్ మీటర్‌కు రూ. 49.59 వద్ద స్థిరంగా ఉంది. హోర్ముజ్ సంక్షోభం ప్రారంభ దశలో అంతర్జాతీయ గ్యాస్ ధరలు భారీగా పెరిగినప్పటికీ, ఢిల్లీలో సిఎన్‌జి ధరలు సాపేక్షంగా స్థిరంగా ఉన్నాయని, ఆ తర్వాతే ఈ పెంపు జరిగిందని ఐజిఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. జులై నుండి, పశ్చిమ ఆసియా సంక్షోభం తిరిగి తీవ్రమవ్వడం వల్ల హోర్ముజ్ జలసంధి గుండా ఎల్ఎన్‌జి కార్గో రవాణా ప్రభావితమైందని, ఇది ప్రపంచ ఎల్ఎన్‌జి ధరలను సంక్షోభానికి ముందు స్థాయిల కంటే దాదాపు రెట్టింపు చేసిందని ఐజిఎల్ తెలిపింది.

**CHANGE OF NAME**

I, **G. MALLESHAM, S/o. G.PENTAIAH,** (old Name) H.No. 5-420, Indira Nagar Colony, Dommara Pochampalle, Dundigal Mandal, Medchal Malkajgiri Dist., Telangana state, has changed as **GUNNAMALA MALLESH GOUD, S/o. GUNNAMALA PENTAIAH** (New Name) for all purposes

**ST.JOHN'S INSTITUTE OF SCIENCE & TECHNOLOGY**
(Affiliated to O.U & Approved AICTE, New Delhi)
Manneguda, Turkayamjal, Near RTA Office, Sagar Highway, R.R.Dist (10 KMS From L.B.Nagar 'X' Road
Contact: 9866749525, 8686005085 / Email: stjohnsmbamca@gmail.com
Admission Notification For 'B' Category Seats - 2026 - 2027
**Course : MBA & MCA**
- No of Vaccancies MBA Cource - 36
- No of Vaccancies MCA Cource - 18

ICET CODE: SJOT

**ST.JOHN'S INSTITUTE OF SCIENCE & TECHNOLOGY**
(Affiliated to O.U & Approved AICTE, New Delhi)
Manneguda, Turkayamjal, Near RTA Office, Sagar Highway, R.R.Dist (10 KMS From L.B.Nagar 'X' Road
Contact: 9866749525, 8686005085 / Email: stjohnsmbamca@gmail.com
Admission Notification For SPOT - 2026 - 2027
**Course : MBA & MCA**
- No of Vaccancies MBA Cource - 41
- No of Vaccancies MCA Cource - 21

ICET CODE: SJOT

**ST.JOHN'S P.G. COLLEGE**
Chengicherla (V), Medipally(M), Medchal - Malkajgiri (Dist)
(Approved by AICTE, Affiliated to O.U) Ph : 9640407030, 9849139745
**SPOT ADMISSIONS**
- No of Vacancies / Unreported Candidates :
**MBA : 67 & MCA : 32**
- Eligible Candidates attend with originals on or before : 3-9-2026
- Candidates to Pay Tution Fee, Special Fee, Processing Fee
- Admissions are Subject to Ratification by TGICET / TGCHE
- Fee Reimbursements is not applicable

www.stjohnspgcollege.in Contact : 9849139745, 9603216358

# వెనిజులా చమురు అమెరికా స్వాధీనం

●ప్రపంచ చరిత్రలో ఇదే అతిపెద్ద ఒప్పందం
●అమెరికన్లకు ఇక తక్కువ ధరకే గ్యాస్ సరఫరా: ట్రంప్

**వాషింగ్టన్:** వెనిజులాతో అమెరికా చరిత్రాత్మకమైన చమురు ఒప్పందం చేసుకున్నట్లు ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. 65 బిలియన్ బ్యారెళ్ళకు పైగా ఉన్న వెనిజులాలోని నిర్ధారిత చమురు నిల్వలను స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి ఈ ఒప్పందం కుదిరింది. దీంతో అమెరికా చమురు నిల్వలు చాలా గణనీయంగా పెరుగుతాయని, అమెరికన్లకు చాలా తక్కువ ధరలకు గ్యాస్ సరఫరాలు చేయడానికి ఈ నిల్వలవల్ల వీలు కలుగుతుందని ట్రంప్ చెప్పారు. ప్రైవేటు భాగస్వామ్యంలో వెనిజులాతో ఈ ఒప్పందం కుదిరింది. వెనిజులాలో చమురు పరిశ్రమను పునరుద్ధరించడానికి 100 బిలియన్ డాలర్లు పెట్టుబడులుగా సమకూర్చాలని ట్రంప్ తన దేశంలో ఉన్న చమురు కంపెనీలకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచంలో ఎక్కడాలేనివిధంగా చాలా అధికంగా వెనిజులాలో చమురు నిల్వలు ఉన్నాయి. దాదాపు 300కు పైగా బిలియన్ బారెళ్ళ చమురు నిల్వలు ఉన్నట్లు అధికారికంగా నిర్ధారించారు. దీనిని ఒక అసాధారణ ఒప్పందంగా ఆయన అభివర్ణించారు.ఇరాన్‌తో యుద్ధం గడచిన శుక్రవారంనాటికి ఆరునెలల మైలురాయికి చేరుకున్నప్పటికీ ఎక్కడా ముగింపు కనిపించకపోవడంతో దేశంలో గ్యాస్ అధిక ధరల సమస్య పరిష్కరించాలని ట్రంప్‌పై విపరీతంగా ఒత్తిడి పెరుగుతున్న తరుణంలో ఆయన ఈ ప్రకటన చేశారు. మరో రెండు నెలల తర్వాత ట్రంప్ దేశంలో ప్రతిష్టాత్మకమైన ద్వైవార్షిక ఎన్నికలను ఎదుర్కోనున్నారు. "వెనిజులాతో అమెరికా ఇప్పుడే ఒక చమురు ఒప్పందం చేసుకుంది, ప్రపంచ చరిత్రలో ఇదే అతిపెద్ద ఒప్పందం" అని సోషల్ మీడియా వేదికగా శనివారం ట్రంప్ ప్రకటించారు. ఐతే ఈ ఒప్పందం గురించి వెనిజులా అధికారిక ప్రకటన చేయలేదు.అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో,రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ వెనిజులా అధ్యక్షురాలు రోడ్రిగ్జ్‌తో జరిపిన చర్చల్లో ఈ ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. వెనిజులాపై ట్రంప్ దాడిచేసిన తొమ్మిది నెలల తర్వాత ఆయన నుండి ఈ ప్రకటన వెలువడింది.యుద్ధ సమయంలో ట్రంప్ దేశంలో ఉన్న అత్యవసర వ్యూహాత్మక చమురు,గ్యాస్ నిల్వలను ఉపయోగించుకున్నారు. ఈ నిల్వలు ఇప్పుడు 300 మిలియన్ బ్యారెల్స్ కంటే తక్కువస్థాయికి పడిపోయాయి. ప్రస్తుతం అమెరికాలో సగటు గ్యాస్ గ్యాలన్ ధర 4.09 డాలర్లు పైగా ఉంది. గత ఏడాది ఈ సగటు ధర 3.21 డాలర్లుగా ఉండేది.



ఈ ఏడాది జనవరి మూడో తేదీ తెల్లవారకముందే అర్ధరాత్రి దాటాక రెండు గంటలకు వెనిజులా అధ్యక్ష భవనంపై "ఆపరేషన్ అబ్జల్యూట్ రిజాల్వ్"ను అమెరికా దళాలు నిర్వహించి వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో ఆయన సతీమణి సిలియా ఫ్లోరెస్‌లను కిడ్నాప్‌చేసి న్యూయార్క్ సిటీ జైలుకు తరలించి నిర్బంధించారు. ఈ ఆపరేషన్‌లో ఆనాడు 80 మంది క్యూబా,వెనిజులా సైనికులు మరణించారు. ఆ తర్వాత తన గుప్పెట్లో ఉండేవిధంగా ఆ దేశ ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను తాత్కాలిక అధ్యక్షురాలిని నియమించారు.వెనిజులాలో వివేకవంతమైన పరివర్తన వచ్చే వరకూ ఆ దేశాన్ని తామే పరిపాలిస్తామని, అధికారాన్ని నియంత్రిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయనకు అనుకూలంగా ఉండే ప్రభుత్వంతోనే ఈ భారీ చమురు ఒప్పందం చేసుకున్నారు. 2003లో సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని పతనం చేసిన తర్వాత అమెరికా నాయకత్వంలోని సంకీర్ణ తాత్కాలిక అధికార యంత్రాంగం ద్వారా సాధించిన ఆధిపత్యంకంటే ఈ ఒప్పందం ఇంకా చాలా విస్తారమైనదిగా కనిపిస్తోందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఐతే ఒప్పందానికి సంబంధించిన అధికారికపత్రం ఇంకా బహిర్గం కాలేదు. అధికారికంగా వైట్‌హౌస్ ఈ ఒప్పంద పత్రాన్ని విడుదల చేయలేదు.

# ఈక్వెడార్ మాజీ అధ్యక్షుడికి ఐదేళ్ల జైలు

అవినీతికి పాల్పడలేదు: మోరెనో ఖండన



**క్విటో:** దక్షిణ అమెరికా ఈశాన్యప్రాంత దేశం రిపబ్లిక్ ఆఫ్ ఈక్వెడార్ మాజీ అధ్యక్షుడు లెనిన్ మోరెనో(73)కు ఆ దేశ అత్యున్నత న్యాయస్థానం ఐదు సంవత్సరాలు జైలుశిక్ష విధించింది. 2017 మే 24 నుండి 2021 మే 24 వరకు ఆయన ఆ దేశానికి 46వ అధ్యక్షుడుగా పనిచేశారు. అంతకు ముందు ఉపాధ్యక్ష పదవి నిర్వహించారు. ఈ పదవీకాల సమయంలో తీవ్ర అవినీతి ఆరోపణలు ఆయన ఎదుర్కొన్నారు. ఈక్వెడార్‌లో అతిపెద్ద కోకాకోడో సింక్లెర్ జలవిద్యుత్ ప్రాజెక్టును నిర్మించిన చైనాకు చెందిన సినో హైడ్రో కంపెనీ నుండి లంచాలు తీసుకున్నారని కోర్టులో రుజువు కావడంతో శుక్రవారం న్యాయస్థానం ఆయనకు ఐదేళ్ళు జైలుశిక్ష విధించింది. ఈ కేసులో మొత్తం 20 మందికి భారీగా లంచాలను సదరు చైనా కంపెనీ ముట్టజెప్పింది. లంచాలు తీసుకున్నవారిలో లెనిన్ మోరెనో కూడా ఉన్నారని ఎక్స్ వేదికగా ప్రాసిక్యూషన్ ప్రకటించింది. 2007–2013 మధ్యకాలంలో అధ్యక్షుడుగా ఉన్న రఫెల్ కొరియా హయాంలో మోరెనో ఉపాధ్యక్షుడుగా పనిచేశారు. ఈ సమయంలోనే మోరెనో అవినీతికి పాల్పడ్డారు. కొరియా మద్దతుతోనే ఆ తర్వాత మోరెనో దేశాధ్యక్ష పదవి చేపట్టారు.కానీ అనతి కాలంలోనే సోషలిస్టు భావాలకు ఆయన దూరమై అమెరికాతో సంబంధాలు పెట్టుకుని ఆ దేశ నాయకులతో మమేకమయ్యారు. ఐతే న్యాయస్థానంలో తనకు వ్యతిరేకంగా వచ్చిన తీర్పుపై మోరెనో స్పందిస్తూ, తనపై కేవలం ఆరోపణలు వచ్చాయని, అవన్నీ నిజం కాదని, ఎంతమాత్రం వాస్తవం లేదని ఖండించారు. సినో హైడ్రో కంపెనీ నుండి తాను ఒక్కసెంటు కూడా తీసుకోలేదని స్పష్టం చేశారు. కానీ సినోహైడ్రో కంపెనీ 76 మిలియన్ డాలర్లు అంచం ఆయనకు చెల్లించిందని, మొత్తం ప్రాజెక్టు వ్యయంలో ఈ లంచం నాలుగో వంతు ఉంటుందని ప్రాసిక్యూషన్ స్పష్టం చేసింది.

# కీవ్ నగరంపై రష్యా దాడి

37 మంది మృతి



**కీవ్:** ఉక్రేన్ రాజధాని నగరం కీవ్‌పై రాత్రికి రాత్రి రష్యా చేసిన దాడిలో 37 మంది మరణించారు. మరో 381 మంది ప్రజలను అక్కడి నుండి ప్రాణాలతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కీవ్ గవర్నర్ శనివారం ఈ విషయం ప్రకటించారు. బుచా జిల్లాపై జరిగిన డ్రోన్లు,క్షిపణి దాడుల్లో ఈ మరణాలు సంభవించాయని 42 మంది గాయపడ్డారని గవర్నర్ తైమూర్ త్కాచెంకో చెప్పారు. బోరిస్పిల్ జిల్లాలో జరిగిన మరో దాడిలో 14 ఏళ్ళ వయసుగల టీనేజర్ మరణించాడని చెప్పారు. మృతుల కుటుంబాలకు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తీవ్ర సంతాపం ప్రకటించారు. ఒడెసా, సుమీ, ద్రీప్నోపెట్రోవస్క్, జెపోరిఝియా తదితర ప్రాంతాలలో మరిన్ని దాడులు జరిగాయని జెలెన్స్కీ ప్రకటించారు. ఇలాంటి సందర్భాలలో ఉక్రేన్ ఒంటరిగా ఉండబోదని, రష్యాను ఎదుర్కొనేందుకు సహాయం పొందుతామని చెప్పారు. రష్యాపై ఆంక్షలు ప్రటించిన యూరప్, అమెరికాలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా శనివారం తెల్లవారముందుగానే రష్యాకు చెందిన 233 మానవ రహిత గగనతల వాహనాలను కూల్చివేసినట్లు కూడా జెలెన్స్కీ ప్రకటించారు. ఇటీవలి నెలల్లో రష్యా–ఉక్రేన్ మధ్య ఉద్ధృతస్థాయిలో పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. రష్యాకు చెందిన చమురు కేంద్రాలు,ఇతర మౌలిక, ఆర్థిక వ్యవస్థలపై ఉక్రేన్ బలమైన డ్రోన్లతో దాడులు చేస్తూ విధ్వంసం సృష్టించి రష్యాకు తీవ్ర నష్టం కలగజేస్తోంది. అదేవిధంగా వందల కి.మీ ప్రయాణం చేయగల బ్రిటన్ డ్రోన్లను ప్రయోగించడం ద్వారా నల్ల సముద్రంలో రష్యా నౌకలపై కూడా ఉక్రేన్ తీవ్రస్థాయిలో దాడులు చేస్తోంది.

# ఇయులో ఐస్‌లాండ్ చేరుతుందా? పోలింగ్ ప్రక్రియ పూర్తి





**రేక్‌జావిక్:** ఆర్కిటిక్–ఉత్తర అట్లాంటిక్ సముద్రాలమధ్య అనేక దీవుల సమాహార దేశం ఐస్‌లాండ్‌లో ప్రజలు శనివారం ఎన్నికల్లో పాల్గొన్నారు. యూనియన్‌లో ఐస్‌లాండ్ దేశం చేరాలా? వద్దా? అనే విషయంపై చర్చలకు వెళ్లాలా? వద్దా? డోనాల్డ్ ట్రంప్ ఐస్‌లాండ్‌పై తన హక్కులను ఉద్ఘాటిస్తున్న సమయంలో ఓటర్ల విజ్ఞత ఎలా ఉండాలి? అనే విషయాలు ఈ ఓటింగ్ ద్వారా బహిర్గతమవుతాయి. ఐతే దేశంలో 48.4 శాతం ప్రజలు అనుకూలంగా, 51.6 శాతం మంది వ్యతిరేకంగా ఉన్నట్లు వలి సర్వేలో వెల్లడైంది. యూరోపియన్ యూనియన్‌లో చేరితే ఐస్‌లాండ్ తన రోజువారీ విధాన నిర్ణయాలపై నియంత్రణ కోల్పోతుందని,ఈ చిన్న దేశం ఇయుపై ప్రభావం చూపించలేదని ఆ దేశంలో చాలామంది భయపడుతున్నారు. సమీపంలో ఉన్న గ్రీన్‌లాండ్ నియంత్రణలోనే ఐస్‌లాండ్ కొనసాగుతోంది.వ్యూహాత్మకంగా ఐస్‌లాండ్ అమెరికా అధీనంలో ఉండాలని, ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈ దీవిని తాము స్వాధీనం చేసుకుంటామని, అవసరం అయితే కొనుగోలు చేస్తామని ట్రంప్ రగడ సృష్టించారు. చైనా,రష్యాల నుండి అమెరికా దాడుల ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నదని, ఈ దాడుల నుండి అమెరికాను కాపాడుకోవాలంటే ఐస్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుని ఈ ప్రాంతంలో తాము ఖండాంతర క్షిపణులను, ఇతర శక్తిమంతమైన ఆయుధాలను మోహరిస్తామని ట్రంప్ చెప్పారు. ఐస్‌లాండ్‌లో ఉన్న 2.65 లక్షల మంది ఓటర్లు చాలా సింపుల్‌గా ఎస్ లేదా నో అనే సమాధానం ద్వారా ఈ ఓటింగ్‌లో పాల్గొన్నారు.యూరోపియన్ యూనియన్‌లో ఐస్‌లాండ్ చేరాలా?వద్దా? అనే విషయంలో ఏదో ఒక తీర్పు ప్రకటిస్తే మరో తరం వరకూ ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.ప్రస్తుత ప్రధాన మంత్రి క్రిస్టూన్ ఫ్రాస్టాడోటిన్ యూరోపియన్ యూనియన్‌కు అనుకూలంగా ఉన్నారు. ఐతే ప్రజలు ఎలాంటి తీర్పు ఇచ్చినాగానీ శిరసావహించడానికి సిద్ధంగా ఉన్నామని ఆమె చెబుతున్నారు. ఐస్‌లాండ్ ప్రజలు "అవును" అని ఓటింగ్‌లో టిక్ చేస్తే, బ్రస్సెల్స్‌లో చర్చలు జరపడానికి ఐస్‌లాండ్ ప్రధానమంత్రి సిద్ధంగా ఉన్నారు.
ఐస్‌లాండ్ యూరోపియన్ యూనియన్ వెలుపల ఉంటేనే బాగుంటుందని ఆలోచించి చర్చలు నిలిపివేసిన 13 సంవత్సరాల తర్వాత తిరిగి ఈ అతిపెద్ద దీవిలో ప్రజలు నిర్ణయాత్మకమైన ఓటింగ్‌లో పాల్గొన్నారు. ట్రంప్ బెదిరింపుల తర్వాత ఐస్‌లాండ్ అభద్రతలో పడింది. ఆ దేశ కరెన్సీ కూడా తీవ్ర హెచ్చుతగ్గులకు గురవుతూ అంతర్గతంగా ధరల సమస్య ఉత్పన్నమైంది.

# క్లిష్ట సమయంలో నార్వే రాజు హెరాల్డ్ మృతి



**ఓస్లో:** నార్వే రాజు హెరాల్డ్–5 అరుదైన రక్ష సంబంధమైన వ్యాధితో బాధపడుతూ ఓస్లో యూనివర్సిటీ ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయన వయసు 89 సంవత్సరాలు. 35 సంవత్సరాలు ఆయన నార్వేను పరిపాలించారు.అనేక రోగాలతో బాధపడుతున్న రాజుకు ఇటీవల పేస్‌మేకర్ అమర్చారు. ఆయన తన రాజరిక కార్యకలాపాలు కూడా తగ్గించుకున్నారు.ఆయన మరణవార్త తెలియగానే ప్రజలు వేలాదిమంది రాజప్రాసాదం వద్దకు వచ్చి పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులు అర్పించారు. అమెరికాకు చెందిన వివాదాస్పద వ్యాపారవేత్త,లైంగిక ఆరోపణలతో జైలులో మరణించిన జెఫ్రీఎప్‌స్టీన్‌తో క్రౌన్ ప్రిన్సెస్ మెట్టె మారిట్ ఉత్తర ప్రత్యుత్తరాలు చేశారని తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న సంక్లిష్ట సమయంలో రాజు హెరాల్డ్ మరణించారు. ప్రిన్సెస్ మారిట్ 29 ఏళ్ళ కుమారుడు, కొత్త రాజు హాకాన్ అనధికార భార్య కొడుకు మారియస్ బోర్గ్ హాయిబీ రెండు అత్యాచార కేసుల్లో నిందితుడుగా ఉన్నారు. గృహ హింస సహా మరో 32 ఆరోపణలపై ఆయనకు గడచిన జూన్ నెలలో నాలుగు సంవత్సరాలు జైలుశిక్ష పడింది.

## నిలబడదాం

(మొదటి పేజీ తరువాయి)

అయింది. ఈ సందర్భంగా ఇటీవల అమరవీరుల స్మారక చిహ్నం వద్ద 13 వేల మందికి పైగా ఉద్యమకారులు, వివిధ జెఎసిలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, మహిళా ఉద్యమకారులతో నిర్వహించిన సంప్రదింపుల వివరాలను కమిటీ సిఎంకు అందజేసింది. ఉద్యమకారుల వర్గీకరణ ముసాయిదా, ప్రధాన డిమాండ్లతో కూడిన నివేదికను సమర్పించింది. ఉద్యమకారుల గుర్తింపు, సంక్షేమానికి సంబంధించిన కసరత్తును ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని సిఎం సూచించారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం అధికారిక వెబ్‌సైట్ పోర్టల్ ఏర్పాటు, డిజిటల్ దరఖాస్తుల స్వీకరణ, జిల్లాల వారీగా సమన్వయం, అవసరమైన పరిపాలనా వనరుల కల్పనలో కమిటీకి పూర్తి సహకారం అందించాలని ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు.

**250 గజాల స్థలం, పెన్షన్, హెల్త్ కార్డులు..**

ఉద్యమకారుల ప్రధాన డిమాండ్లైన 250 గజాల నివాస స్థలం, ఆసరా పెన్షన్, హెల్త్ కార్డులు, ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం, ఉద్యోగులకు గౌరవ గుర్తింపు తదితర అంశాలపై సిఎం సానుకూలంగా స్పందించినట్లు కమిటీ తెలిపింది. సిఎంతో సమావేశంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండ రామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మోతె శోభన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్ పాల్గొన్నారు. సిఎంఓ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, కార్యదర్శులు, ఓఎస్‌డిలు, ఇతర ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.

# శాసనసభ ఎథిక్స్ కమిటీ భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత శాసనసభ సమావేశాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఉద్దేశించి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేయి చూపించి బెదిరించారనే అభియోగాల అంశంపైన శాసనసభ ఎథిక్స్ కమిటీ శనివారం సమావేశమైంది. మరో సమావేశానికి ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కడియం శ్రీహరిని ఆహ్వానించాలని ఎథిక్స్ కమిటీ నిర్ణయించింది. శాసనసభ హాల్‌లో కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన ఎథిక్స్ కమిటీ సమావేశం జరిగింది. పాడి కౌశిక్ రెడ్డి అభియోగాలపైన చర్చించింది. వీడియోలో సైగలు మాత్రమే ఉన్నాయని, పాడి కౌశిక్ రెడ్డి వాయిస్ లేదని బిఆర్‌ఎస్ సభ్యులు తెలిపారు. ఈ విషయంలో ఇతర సభ్యుల వ్యాఖ్యలను కూడా పరిగణలోకి తీసుకోవాలని, కౌశిక్ రెడ్డికి వివరణ చెప్పుకునే అవకాశం కల్పించాలని వారు కమిటీ చైర్మన్‌ను కోరారు. సభా హుందాతనాన్ని గౌరవించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దంటే కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సభ్యులు తెలిపారు.

# మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేస్తేనే కొత్తదనం

●జర్నలిస్టులతో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఇష్టాగోష్టి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయినందున మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేస్తే కొత్తదనం వస్తుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వంలో, మంత్రివర్గంలో మార్పులు రావాలన్నారు. తనను కలిసిన జర్నలిస్టులతో గుత్తా సుఖేందర్ రెడ్డి శనివారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి యువకుడని, ఉత్సాహవంతుడని, ఆయనను పని చేసుకోనివ్వాలని, ఆటంకాలు సృష్టించకూడదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని ఏ రాజకీయ పార్టీలోనూ క్రమశిక్షణ లేదని, కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు తగ్గించాలని, పార్టీ లైన్ దాటిన వారిపైన వేటు వేయకపోతే నష్టం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్‌లో లీకేజీలను నియంత్రించాలని, క్రమశిక్షణ ముఖ్యమని ఆయన సూచించారు. రిజిస్ట్రేషన్ చట్టం1908లోని సెక్షన్ 22ఎను రద్దు చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయవద్దని, వారికి న్యాయం చేయాలన్నారు. సామాన్య ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే, కొత్త పథకాలను సిఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు.

## విజయం

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనల్లో మార్పులు, దిగిపోయిన కార్మికులకు వారం రోజుల చికిత్స, సింగరేణి విద్యాసంస్థల్లో సిబిఎస్ఇ సిలబస్ అమలు, సేఫ్టీ మెటీరియల్ సకాలంలో అందుబాటులోకి ఉంచడం వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. మందమర్రి–క్యాతన్‌పల్లి పరిధిలో 9 శాతం హెచ్‌ఆర్‌ఏ, డిస్మిస్ కార్మికుల పెండింగ్ కేసుల పరిష్కారం, అర్హతలకు అనుగుణంగా మైనింగ్ స్టాఫ్‌కు సూటబుల్ సర్ఫేస్ ఉద్యోగాలు, కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఇఎస్ఐ వైద్యం, పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల పరిష్కారం, ఈవెనింగ్ కాలేజీలకు ఉద్యోగులకు ఎన్‌ఓసిలు జారీ చేయడంపై యాజమాన్యం అంగీకరించింది. క్లారికల్, ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, పారామెడికల్, ఎస్అండ్‌పిసి సెక్యూరిటీ గార్డులు, ఎలక్ట్రికల్, మెకానికల్ సూపర్వైజర్ల తదితర ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు, ఇపి ఫిట్టర్లు, ఎస్‌డిఎల్ ఆపరేటర్లు, సర్వేయర్ల క్యాడర్ స్కీమ్ సమస్యల పరిష్కారం, 149 మంది మెడికల్ ఫిట్ డిపెండెంట్లకు నెల రోజుల్లో ఆఫీస్ ఆర్డర్లు జారీ చేయడానికి అంగీకరించారు. కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేసే అంశంపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని యాజమాన్యం అంగీకరించింది. చట్టబద్ధంగా జరిగే సమ్మెలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొంటే నో వర్క్ నో పే అమలు చేస్తామని, అయితే వారికి ఫైన్లు విధంచబోమని అంగీకరించారు. సమ్మె నోటీసు, ఆర్ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చలు, యాజమాన్యంపై ఏఐటీయూసీ కొనసాగించిన నిరంతర ఒత్తిడి ఫలితంగానే ఈ 23 అంశాలపై అంగీకారాలు సాధ్యమయ్యాయని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు.

**ఒప్పందాలపై సంతకాలు**

చర్చల్లో ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు సారయ్య, వై.వి.రావు, కందికట్ల వీరభద్రయ్య, మడ్డి ఎల్లయ్య, ముస్కె సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. యాజమాన్యం తరపున డైరెక్టర్ పా గౌతం పోట్రూ, జీఎం పర్సనల్ కిరణ్‌కుమార్, అజయ్, జీఎం ఎం.ఎస్. రవి, డిజిఎం రాజగోపాల్, ప్రభాకర్ తదితరులు పల్గొన్నారు. అనంతరం కేంద్ర కార్మిక ప్రాంతీయ కమీషనర్ కార్యాలయంలో ఏఎల్‌సీ శాశ్వతిరెడ్డి సమక్షంలో సింగరేణి యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ ప్రతినిధులు కీలక ఒప్పందాలపై సంతకాలు చేశారు.

# దోమల నివారణ చర్యలు మరింత ముమ్మరం

●వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల అంశంలో హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత పెంచాలని, అధిక ప్రమాదప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని, ఫీవర్ సర్వేలను సమర్థవంతంగా కొనసాగించాలని మంత్రి సూచించారు. ఇన్ ఫ్లూ యెంజా, స్వైన్ ఫ్లూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో గతేడాది కంటే డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా, అక్యూట్ డయేరియల్ డిసీజ్, డిసెంట్రీ కేసులు తగ్గినట్లు అధికారులు మంత్రికి వివరించారు. టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగాయని వారు తెలిపారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టియనా జడ్ చొంగ్తు తదితరులు పాల్గొన్నారు.

**డిసెంబర్‌లోవరంగల్ సూపర్ స్పెషాలిటీ**

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని డిసెంబర్‌లో ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని, అక్టోబర్ నాటికి అన్ని పనులు పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఆర్ అండ్ బి అధికారులు మంత్రికి వివరించారు. ఎక్స్ రే, సీటీ స్కాన్ సహా అవసరమైన ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాల్ చేస్తున్నామని, ఈ ప్రక్రియ సెప్టెంబర్‌లో ముగుస్తుందని తెలిపారు. నవంబర్ నుంచి ట్రయల్ రన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వరంగల్ హాస్పిటల్‌ను సిద్ధం చేయాలన్నారు. ఇకపై నిపుణుల (డాక్టర్ల) కమిటీ ప్రతి15 రోజులకు ఒకసారి వరంగల్ హాస్పిటల్‌ను సందర్శించాలన్నారు. ఏడాది చివరి నాటికి అల్వాల్ టిమ్స్, 2027 మార్చి నాటికి ఎల్‌బి నగర్ టిమ్స్ పనులన్నీ పూర్తవుతాయని ఆర్‌అండ్‌బి అధికారులు మంత్రి దామోదర రాజనర్సింహాకు వివరించారు.

## ఆచూకీ గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

నమోదైంది. చివరివరకూ ఆయన ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నం చేశారు. తన గురించి ఆలోచించలేదు. వరద నీటిలో ఆయన కూడా కొట్టుకుపోయారు. ఇప్పుడు హాంగ్ పెంగ్ హీరో ఆఫీసర్‌గా నీరాజనాలు అందుకుంటున్నారు. ఆయనకు ప్రజలు నివాళులు అర్పిస్తున్నారు.
నేపాల్ సైనిక పౌర సంబంధాల డైరెక్టరేట్ సమాచారం ప్రకారం 2,465 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వీరిలో 113 మంది భారరతీయులు,26 మంది చైనీయులు, 15మంది దక్షిణ కొరియావాసులు,నలుగురు జర్మన్లు,ఇద్దరు ఇటలీవాసులు,ఇద్దరు అమెరికన్లు,ఒమన్‌కు చెందిన ఒక పౌరుడు ఉన్నారు.రసువా,త్రిశూల్‌లలోని వివిధ జలవిద్యుత్ ప్రాజెక్టుల నుండి 191 మంది కార్మికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 2,265 మందిని హెలికాప్టర్ల ద్వారా తరలించారు. అత్యవసర ఆరోగ్య కేంద్రాలు ధంచే,త్రిశూలీ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. వివిధ వరద ముంపు ప్రాంతాల నుండి 1,706 మందిని తరలించారు. ఇదిలా ఉండగా, రాజధాని కాఠ్మండుకు దేశంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానం చేసే మగ్లింగ్–కాఠ్మండు జాతీయ రహదారిని శనివారంనాడు కొంతమేరకు పునరుద్ధరించారు. ఈ ప్రాంతంలో మట్టి,రాళ్ళు అడ్డంగా పడి ఉన్నాయి. సెంట్రల్ నేపాల్‌లోని అనేక ప్రధాన రహదారులు,జాతీయ రహదారులపై కూడా ఎక్కడపడితే అక్కడ పెద్ద పెద్ద బండరాళ్ళు అడ్డంగా పడి ఉన్నాయి. ఇప్పటివరకూ 2,500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మంచుఖండం విరిగి భోటేకోశి నదిలో పడటంతో అది గతి తప్పింది. ఊళ్ళమీద పడింది. చైనా–నేపాల్ మధ్య సరిహద్దుగా ఉన్న గైరాంగ్ పోర్టు కేంద్రం బురదమట్టి,శిథిలాలలో కూరుకుపోయింది.మంచు, రాళ్ళు,బురదమట్టితో కూడిన భారీ ప్రవాహంవల్ల అనేక వంతెనలు,ఇళ్ళు,రహదారులు,జలవిద్యుత్ ప్రాజెక్టులు కొట్టుకుపోయాయి. అనేక గ్రామాల ఉనికి గల్లంతైంది. రోడ్లపై బురద మట్టి ఎత్తుగా పేరుకుపోయింది. రసువా జజిల్లాలో అనేక ప్రాంతాలకు ప్రధాన మార్గం నుండి సంబంధాలు తెగిపోయాయి. గ్రామాలను,పట్టణాలను అనుసంధానం చేసే అనేక కీలకమైన వంతెనలు కొట్టుకుపోయాయి. ఈ వంతెనల స్థానంలో తాత్కాలికంగా 42 బెయిలీ బ్రిడ్జీలను నిర్మించేందుకు భారతదేశం రంగంలోకి దిగింది. ఈ సందర్భంగా భారతదేశం అందిస్తున్న సహాయంపట్ల నేపాల్ దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు కృతజ్ఞతలు తెలియజేశారు. మరోవైపు చైనా కూడా బెయలీ బ్రిడ్జీల నిర్మాణానికి పూనుకుంది. ధ్వంసమైన నేపాల్ ప్రాంతాలను పునర్నిర్మించేందుకు నాలుగు బిలియన్ డాలర్లు అవసరమని తాత్కాలికంగా అంచనా వేశారు.

## ఓటు హక్కు కోల్పోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

జాబితాతో అనుసంధానం చేయబడలేదని తెలిపారు. దీంతో సుమారు 92.86 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు ఓటర్లను ప్రభావితం చేసే అంశమని ఎన్నికల సంఘానికి వివరించారు. ప్రస్తుత సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు. గణన సిబ్బంది పరిశీలనకు వచ్చిన సమయంలో తాత్కాలికంగా ఇళ్లలో లేని వారిని, శాశ్వతంగా నివాసం మారిన వారిని ఒకే విధంగా పరిగణిస్తున్నారని తెలిపారు. నిజంగా నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫారం6 ద్వారా ఎలాంటి సహాయం అందించకుండానే పాత నివాసంలోని ఓటు తొలగిస్తున్నారని సిఎం పేర్కొన్నారు. నివాసం మారిన వారి పేర్లను తొలగించే ముందు అధికారిక నోటీసు ప్రక్రియను పాటించడంలేదని తెలిపారు. దీనివల్ల ఓటర్లు పోలింగ్ రోజున కేంద్రానికి వెళ్లే వరకు తమ ఓటు హక్కు తొలగిపోయిన విషయం తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సిఎం తెలిపారు. హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజ్గిరి, రంగారెడ్డి జిల్లాల్లోనే రాష్ట్రంలోని మొత్తం గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ఒకటికిమించి నమోదైన ఓటర్లలో 58.6 శాతం, పరిశీలన నోటీసుల్లో 41.9 శాతం కేంద్రీకృతమై ఉన్నాయని ముఖ్యమంత్రి గారు తెలిపారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సవరణ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమీప భవిష్యత్తులో తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేవని, అందువల్ల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించేందుకు తగిన సమయం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఉన్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించి, నిర్ణయించిన తుది ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అక్టోబర్ 19 నుంచి సవరించాలని కోరారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ముందుగానే విస్తృత ప్రచారం నిర్వహించి, కనీసం రెండుసార్లు గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి ముసాయిదా ఓటర్ల జాబితాలను బహిరంగంగా చదివి వినిపించాలని విజ్ఞప్తి చేశారు. నోటీసులు అందుకున్న రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వయోవృద్ధులు తమ పత్రాలను సమర్పించేందుకు వారం రోజుల సమయం సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ఈసిని సిఎం కోరారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గ, పోలింగ్ కేంద్ర స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఓటర్లకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటిని పొందేందుకు సహకరించాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వు (జీఓ నంబర్ 172) ప్రకారం జారీ చేసే కుటుంబ నమోదు ధ్రువపత్రాన్ని అంగీకరించకపోవడం వల్ల పట్టణ ప్రాంత ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని సిఎం తెలిపారు. మండల స్థాయిలో సులభంగా లభించే ఇతర పత్రాలను కూడా అంగీకరించేలా ఆధారాల జాబితాను సవరించి విస్తరించాలని సూచించారు. హైదరాబాద్‌లోని ప్రతి నియోజకవర్గంలో సగటున 78 వేలకుపైగా కేసులు ఉన్నందున కేవలం కొంతమంది అధికారుల నియామకం సరిపోదని, ఓటర్ల నమోదు అధికారి స్థాయికి దిగువన అదనపు అధికారులను నియమించి, ముద్రిత నోటీసుల్లోనే నిర్దిష్ట తేదీలు, సమయాలను పేర్కొంటూ వికేంద్రీకృత విచారణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. సర్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హత ఉన్న ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయ కేంద్రాల ఏర్పాటు, గ్రామసభల నిర్వహణతో పాటు పరిపాలనా, ఇతర అవసరమైన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి తన లేఖలో స్పష్టం చేశారు.

## నీరజ్ చోప్రా మడిమకు గాయం

### ఆసియా గేమ్స్‌కు దూరం



**న్యూఢిల్లీ:** జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు గాయమైంది. కాలి మడిమ వద్ద గాయమైనట్లు అతను పేర్కొన్నాడు. దీంతో వచ్చే నెలలో జరగనున్న ఆసియా క్రీడలకు నీరజ్ దూరం కానున్నాడు. రెండు సార్లు ఒలింపిక్ మెడల్ గెలిచిన నీరజ్ .. ఈసారి ఆసియా క్రీడలకు లేకపోవడం భారత బృందానికి నిరాశే అవుతుంది. తన గాయం నుంచి నీరజ్ సోషల్ మీడియా లో పోస్టు చేశాడు. లౌసానే డైమండ లీగ్ తర్వాత ప్రాక్టీస్ సమయంలో మడిమకు లింగమెంట్ టియర్ అయినట్లు అతను తెలిపాడు. చాన్నాళ్ల తర్వాత మళ్లీ మూమెంటం వచ్చినట్లు భావించానని, లౌసానేలో సీజన్ బెస్ట్ త్రో వేయాలని భావించనన్నారు. అయితే ట్రైనింగ్ సమయంలో మడిమ గాయమైందని, డాక్టర్లు, తన టీమ్‌తో చర్చించిన తర్వాత ఇక ఈ సీజన్ నుంచి తప్పుకోవాలని డిసైడ్ అయినట్లు చెప్పాడు. ఇది నిరాశ కలిగించే అంశమే కానీ, క్రీడల్లో ఇదం తా భాగమే అన్నారు. రికవరీపైనే ఇప్పుడు తాను ఫోకస్ పెట్టినట్లు నీరజ్ చెప్పారు. మరింత దృ ఢంగా మళ్లీ రానున్నట్లు తెలిపాడు. ఈ సీజన్ మొత్తం దూరం కావడం అంటే, అతను డైమండ్ లీగ్ ఫైనల్ కూడా మిస్‌కానున్నాడు. వాస్తవానికి ఆ మీట్‌కు అతను క్వాలిఫై అయ్యాడు. ఇక ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి ప్రారంభంకానున్నాయి.

## మారథాన్ రన్నర్‌కు ‘నాడా’ నోటీసు

### ఆసియా క్రీడల్లో పాల్గొనడంపై ఉత్కంఠ..!




ఆసియా క్రీడలకు ముందే భారత్‌కు బిగ్ షాక్. ఇప్పటికే రెజ్లర్ ముకుల్ దహియా నిషేధానికి గురవ్వగా.. అథ్లెటిక్స్ బృందంలోని అభిషేక్ పల్ సైతం ఈ మెగా టోర్నీలో పాల్గొనడంపై సందేహాలు నెలకొన్నాయి. జాతీయ డ్రగ్స్ నిరోధక సంస్థఅతడికి నోటీసులు జారీ చేయడమే అందుకు కారణం. అభిషేక్ రక్త నమూనాల్లో నిషేధిత పదార్థం ఉండడంతో ఆగ్రహించిన నాడా ‘ఎందుకిలా జరిగింది’ చెప్పాలంటూ అథ్లెట్‌ను వివరణ కోరింది. ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడలకు ఎంపికైన 72 మంది బృందంలో ఒకడైన అభిషేక్ పల్ ఒకడు. మారథాన్ రన్నరైన అతడు 5,000 మీటర్లు, 10,000 మీటర్ల పరుగులో బరిలోకి దిగనున్నాడు. అయితే.. ఈ మెగా ఈవెంట్‌కు ముందే అతడికి నాడా నోటీసులు పంపింది. అభిషేక్‌కు డోప్ పరీక్ష నిర్వహించగా రక్త నమూనాల్లో నిషేధిత డ్రగ్ ఉండడంతో వివరణ ఇవ్వాలని కోరింది. నిషేధిత పదార్థం కొద్ది మోతాదులోనే ఉన్నప్పటికీ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న నాడా అభిషేక్‌కు నోటీసులు జారీ చేసింది. ‘అభిషేక్‌కు డోప్ పరీక్ష నిర్వహించాం. అతడి రక్త నమూనాల్లో నిషేధిత పదార్థం కొద్ది మొత్తం లో కనిపించింది. దాంతో, అభిషేక్‌కు నాడా నోటీసులు పంపింది. సంతానం కోసం మహిళలు ఉపయోగించే ఫర్టిలిటీ డ్రగ్ అది. అందుకని.. ఆ పదా ర్థం తన నమూనాల్లో ఉండడం అతడిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఆసియా క్రీడలు సమీపిస్తున్నందు.. అభిషేక్ ఈ విషయంపై నాడా దర్యాప్తు కోరే అవకాశముంది. అయితే.. ఇప్పటివరకైతే అభిషేక్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నిషేధం గురించి కూడా ఇంకా నాడా నిర్ణయం తీసుకోలేదు’ అని ఒక అధికారి వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మారథాన్ రన్నర్‌గా రాణిస్తున్న అభిషేక్.. 2023 ఆసియా ఛాంపియన్‌షిప్స్10వేల మీటర్ల పరుగులో కాంస్యంతో మెరిశాడు. జపాన్‌లోని ఐచీ – నగోయ వేదికగా సెప్టెంబర్ 19వ తేదీ నుంచి ఆసియా క్రీడలు మొదలవ్వనున్నాయి.

## దక్షిణాఫ్రికాపై నమీబియా అనూహ్య విజయం



విండ్‌హోక్‌లోని నమీబియా క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన టీ20 ట్రైనేషన్ సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో పసికూన నమీబియా సంచలనం సృష్టించింది. పటిష్ఠమైన దక్షిణాఫ్రికా జట్టుపై 18 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. 164 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీ జట్టును 145/9 స్కోరుకే కట్టడిచేసి ఈ సిరీస్‌లో బోణీ కొట్టింది. ఈ గెలుపుతో దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 మ్యాచ్‌లలో నమీబియా తమ 20 ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. నమీబియా విజయంలో బౌలర్లు రూబెన్ ట్రంపెల్‌మన్, జేజే స్మిత్ కీలకపాత్ర పోషించి చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ బ్యోర్న్ ఫోర్టుయిన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే నమీబియా ఓపెనర్లు లూరెన్ స్టీన్‌క్యాంప్, జాన్ ఫ్రైలింక్ అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చారు. తొలి వికెట్‌కు కేవలం 9.4 ఓవర్లలోనే 84 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. స్టీన్‌క్యాంప్ 41 పరుగుల వద్ద ఔటవ్వగా.. ఫ్రైలింక్ 60 పరుగులతో రాణించాడు. ఆ తర్వాత కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ (19), అలెగ్జాండర్ బుసింగ్‌వోల్‌షెంక్ (13), ట్రంపెల్‌మన్ (12) చేసిన చిన్నపాటి పరుగులు జట్టు స్కోరును 163/9 కి చేర్చడంలో తోడ్పడ్డాయి.లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా ఆరంభంలోనే తడబడింది. ఓపెనర్లు జోర్డాన్ హెర్మన్ (7), లువాన్‌డ్రే ప్రిటోరియస్ (9) తొలి నాలుగు ఓవర్లలోనే పెవిలియన్ చేరారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన డేవిడ్ బ్రెవిస్ 75 పరుగులతో ఒంటరి పోరాటం చేశాడు. అయితే మరో ఎండ్‌లో వికెట్లు పడుతూనే ఉండటంతో దక్షిణాఫ్రికా 86 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత బ్రెవిస్‌కు జత కలిసిన దువాన్ జాన్సెన్ 47 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టులో ఆశలు రేపాడు. చివరి 13 బంతుల్లో 31 పరుగులు అవసరమైన దశలో బ్రెవిస్‌ను ట్రంపెల్‌మన్ ఔట్ చేయడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. చివరి ఓవర్‌లో కెప్టెన్ ఎరాస్మస్ కేవలం మూడు పరుగులే ఇచ్చి ఫోర్టుయిన్‌ను ఔట్ చేశాడు. ఆఖరి ఓవర్ తొలి రెండు బంతులకు జాన్సెన్ (25 నాటౌట్) ఎనిమిది పరుగులు చేసి ఉత్కంఠ రేపినా.. స్మిత్ మిగిలిన బ్యాటర్లను ఔట్ చేసి నమీబియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. దక్షిణాఫ్రికా నేడు జింబాబ్వేతో తమ తదుపరి మ్యాచ్ ఆడనుంది.




### బులియన్ మార్కెట్

బంగారం ధర (10 గ్రాములకు రూపాయిల్లో)
24 క్యారెట్లు: రూ. 1,58,240
22 క్యారెట్లు: రూ. 1,45,050
18 క్యారెట్లు: రూ. 1,18,680



### ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎ-స్‌ఇ)లో సెన్సెక్స్: ప్రారంభం 77,540.83 పాయింట్లు. ముగింపు 77,264.51 పాయింట్లు. నష్టం 276.32 పాయింట్లు.

జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎ-న్‌ఎస్‌ఇ)లో నిఫ్టీ: ప్రారంభం 24,252.00 పాయింట్లు. ముగింపు 24,175.65 పాయింట్లు. నష్టం 76.35 పాయింట్లు.




(స్టాక్ మార్కెట్లలో వరుసగా మూడో వారం కూడా ‘బేర్’ జోరు కొనసాగింది. జాతీయంగానేకాక, అంతర్జాతీయం-గానూ నెలకొన్న అనిశ్చితి ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా భారత్‌లోనూ స్టాక్ మార్కెట్లు కూడా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి).

## భారతీయ కళా మార్కెట్‌లో కొత్త రికార్డులు


‘ది స్టోరీటెల్లర్’

భారతీయ కళా మార్కెట్ (ఆర్ట్ మార్కెట్)లో వేలం ధరలు ఏటా కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. 2023లో అమృతా షేర్‌గిల్ చిత్రించిన ‘ది స్టోరీటెల్లర్’ రూ.61.8 కోట్లకు అమ్ముడై భారతీయ కళాకారుడి చిత్రానికి అప్పటివరకు ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టింది. 2025లో ఎంఎఫ్ హుసేన్ ‘గ్రామ్ యాత్ర’ రూ.118 కోట్లు పలికింది. 2026లో రాజా రవి వర్మ గీసిన ‘యశోద అండ్ కృష్ణ’ వేలంలో రూ.167.2 కోట్ల ధర పలికి, మరో కొత్త రికార్డు నమోదైంది. ఇది కొద్దిమంది దిగ్గజ కళాకారులకే పరిమితమైన పరిణామం కాదు. అంతగా గుర్తింపు పొందని కళాకారుల చిత్రాలు కూడా అంచనాలను మించి ధరలు పలుకుతున్నాయి. అసిత్ కుమార్ హాల్దార్ చిత్రించిన ‘మదర్ ఇండియా (డివిజన్ ఆఫ్ బెంగాల్)’ రూ.2.07 కోట్లకు అమ్ముడైంది. దాని కనిష్ఠ అంచనా రూ.8 లక్షలు మాత్రమే. అంటే అంచనాకు 25 రెట్లకుపైగా ధర లభించింది. శాంతి దేవ్ 1971లో రూపొందించిన పేరులేని చిత్రం రూ.3.25 కోట్లకు విక్రయమైంది. దాని అంచనా రూ.32–45 లక్షలు మాత్రమే. లగ్జరీ ఇంటెలిజెన్స్ మ్యాగజైన్ ‘లక్స్రెట్రోప్’ అంచనా ప్రకారం భారతీయ కళా మార్కెట్ విలువ దాదాపు రూ.3,000 కోట్లు. శతాబ్దం ప్రారంభంలో కొన్ని కోట్ల రూపాయల స్థాయిలో ఉన్న ఈ మార్కెట్ ఇప్పుడు గణనీయంగా విస్తరించింది. ఈ వృద్ధికి ఆధునిక కళాకారులపై పెరుగుతున్న ఆసక్తితో పాటు కొత్త కలెక్టర్లు, దేశీయ కొనుగోలుదారుల భాగస్వామ్యం, అంతర్జాతీయ కళా ప్రదర్శనలు, మ్యూజియంలలో భారతీయ కళకు పెరుగుతున్న ప్రాధాన్యం కారణమవుతున్నాయి. హుసేన్, ఎస్‌హెచ్ రజా, వివిఎస్ గైతోండే, తైబ్ మెహతా, ఎఫ్ఎన్ సౌజా, షేర్‌గిల్ వంటి కళాకారులను 20వ శతాబ్దపు ఆధునిక చిత్రకళా చరిత్రలో కీలక వ్యక్తులుగా అంతర్జాతీయంగా గుర్తిస్తున్నారు. నళిని మలానీ, నస్రీన్ మొహమేది, భూపెన్ ఖక్కర్ వంటి కళాకారుల రచనలు కూడా ప్రముఖ అంతర్జాతీయ సంస్థల్లో ప్రదర్శితమవుతున్నాయి. సమకాలీన కళాకారులైన భారతి ఖేర్, శిల్పా గుప్తా, జితీష్ కల్లాట్, మిథు సేన్, వి. రమేశ్ తదితరులకు కూడా అంతర్జాతీయ గుర్తింపు పెరుగుతోంది. ఆధునిక కళకు, సమకాలీన కళకు మధ్య తేడా కాలపరమైనదే కాక భావపరమైనదీ. ఆధునిక కళాకారులు సంప్రదాయ అకడమిక్ పద్ధతుల నుంచి బయటపడి కొత్త రూపాలు, నైరూప్యత, వ్యక్తిగత వ్యక్తీకరణపై ప్రయోగాలు చేశారు. సమకాలీన కళాకారులు సామాజిక, రాజకీయ, సాంకేతిక, పర్యావరణ సమస్యలను తమ సృజనలో ప్రతిబింబిస్తున్నారు. ఆర్ట్ మార్కెట్‌లో ఇప్పుడు ‘పేరు’తో పాటు అరుదుదనం, నాణ్యత, కళా చారిత్రక ప్రాధాన్యానికి కూడా కలెక్టర్లు విలువ ఇస్తున్నారు. గత దశాబ్దంలో కళపై పరిశోధన, సంస్థాగత గుర్తింపు, మార్కెట్ పారదర్శకత పెరగడంతో కొనుగోలుదారులకు మరింత సమాచారం అందుతోంది. భారత్‌లోనే ఉన్న వ్యాపారవేత్తలు, వృత్తి నిపుణులు, ఆర్థిక రంగానికి చెందినవారు, కుటుంబ కార్యాలయాలు, కొత్త తరం కలెక్టర్లు మార్కెట్‌లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇండియా ఆర్ట్ ఫెయిర్, ఆర్ట్ ముంబై, కొచ్చిముజిరిస్ బినాలే వంటి వేదికలు భారతీయ కళను ప్రపంచ కళా పరిసరాలతో అనుసంధానిస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగిన 17వ ఇండియా ఆర్ట్ ఫెయిర్‌లో 133 ప్రదర్శనకారులు పాల్గొనగా, దాదాపు 25 మంది విదేశాల నుంచి వచ్చారు. అయితే వేలం రికార్డులపై అతిగా దృష్టి పెట్టడం వల్ల జీవించి ఉన్న సమకాలీన కళాకారులు, తక్కువ గుర్తింపు పొందిన కళాకారులు మరుగున పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చారిత్రక వారసత్వాన్ని కాపాడటంతో పాటు సమకాలీన సృజనకు కలెక్టర్లు, కళాసంస్థలు నిరంతర మద్దతు అందించినప్పుడే భారతీయ కళా మార్కెట్ ఆరోగ్యకరంగా, సమతుల్యంగా అభివృద్ధి చెందుతుంది.


అమృతా షేర్-గిల్

## జెపిని గద్దె దించడంతోనే దేశానికి రక్ష

### మార్పు కోసం సిపిఐ ఉద్యమం


### సెప్టెంబర్ ఒకటిన ఢిల్లీలో మహా ర్యాలీ : సిపిఐ నేత బాగం




**ప్రజాపక్షం/ఖమ్మం :** బిజెపిని గద్దె దించడం ద్వారా మాత్రమే ఈ దేశానికి భవిష్యత్తు ఉంటుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు దేశ ప్రజలను కులం, మతం పేర దేశ ప్రజలను విభజించి లభజ పొందాలని చూస్తుందని ఆయన ఆరోపించారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ బిజెపి పాలనలో ఆర్థిక వ్యవస్థ కుదేలైందని ఆర్థిక అంతరాలు పెరిగిపోయి పేదలు మరింత పేదలు అవుతున్నారన్నారు. నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అన్న బిజెపి ప్రచారంలో వాస్తవం లేదని దేశ సంపద అది కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవుతుందన్నారు. శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని, సామాన్యులు బతికే పరిస్థితి లేదని హేమంతరావు తెలిపారు.దేశ సంపద కొందరి వ్యక్తులకు దారాదత్తం చేస్తున్న నేపథ్యంలో సిపిఐ బద్లావ్ జరూరీ హై పేరుతో ఆందోళన చేపట్టిందని సెప్టెంబర్ ఒకటిన ఢిల్లీ లో మహా ర్యాలీ నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ర్యాలీ అనంతరం రాంలీల మైదానంలో సభ జరుగుతుందని ఆయన తెలిపారు. బిజెపి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే లౌకికవాదం, ప్రభుత్వ రంగ సంస్థలు కనుమరుగవుతాయన్నారు.సిపిఐ దేశ భవిష్యత్తు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్పు కోసం ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని ఇప్పటికైనా హామీలను నెరవేర్చేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోంది

### ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే సాబీర్ పాషా




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సెప్టెంబర్ 6,7,8 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ఈమేరకు శనివారం స్థానిక ఎఐటియుసి కార్యాలయం శేషగిరి భవన్‌లో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంక్షేమ చట్టాను రద్దు చేసి పెట్టుబడి దారీ అనుకూల వర్గాలకు ఊడిగం చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్లు ప్రవేశపెట్టారని మండిపడ్డారు. ఈ మహాసభల్లో కార్మిక సంక్షేమ చట్టాలను కొనసాగించుకునేందుకు కనీస వేతనాలను ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా నిర్వహించే పోరాటాలను చర్చించనున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 750 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, కార్యదర్శి నరాటి ప్రసాద్, కార్యదర్శులు జి నగేష్, భూక్య శ్రీనివాస్, జి.వీరస్వామి రేసు ఎల్లయ్య గుర్రం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ పోరాట స్ఫూర్తితో యువత సమస్యలపై ఉద్యమించాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ




**ప్రజాపక్షం/హనుమకొండ:** యువత సమస్యలపై ఢిల్లీ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 2వ హనుమకొండ జిల్లా మహాసభ ఘనంగా జరిగింది. ఈ మహాసభకు కేతపాక ప్రసాద్, పసునూరి సునీల్, తాటికంటి మమత అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి హాజరై ముందుగా ఎఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాసభను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో యువత చేపట్టిన పోరాట స్ఫూర్తితో దేశవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఎఐవైఎఫ్ ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా యువత 20 రోజుల పాటు ఢిల్లీలో స్వచ్ఛందంగా ఆందోళన నిర్వహించడంతో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దిగివచ్చి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజీనామా చేయించిందని, ఇది దేశ యువత సాధించిన విజయమని అన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎఐవైఎఫ్ కార్యకర్తలు, నాయకులు యువత సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. 2014 లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఆ హామీని విస్మరించిందని విమర్శించారు. దేశ సంపదను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ అవకాశాలు లేక యువత పెడదారి పడుతున్న పరిస్థితికి కేంద్ర ప్రభుత్వ విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలే కారణమని అన్నారు. రానున్న రోజుల్లో దేశంలోని యువతీ యువకులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలని ఆయన అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన యువత పోరాటం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.5,000 నిరుద్యోగ భృతి అందిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువతీ యువకుల సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఉద్యమాలు చేపడతామని డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి తెలిపారు.

### ఎఐవైఎఫ్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా నోముల కిశోర్‌ను, జిల్లా కార్యదర్శిగా గిన్నారపు రోహిత్‌ను, ఉపాధ్యక్షులుగా కేతపాక ప్రసాద్, పసునూరి సునీల్, మర్రి విజయ్‌లను, సహాయ కార్యదర్శులుగా గుగులోత్ సురేష్, పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు లను, కోశాధికారిగా తాటికంటి మమతలతో పాటు మొ త్తం జిల్లా కమిటీ సభ్యులను 29 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి అభినందనలు తెలియజేస్తూ, యువజన సమస్యల పరిష్కారం, ఉద్యోగాల భర్తీ, వి ద్యావైద్య రంగాల పరిరక్షణ కోసం ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో మరింత విస్తృతమైన ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిపిఐ హనుమకొం డ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లే ష్, ఎఐవైఎఫ్ మాజీ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మాస్కా సుదీర్, ఎఐవైఎఫ్ నాయకులు తపాక ప్రసాద్, పసునూరి సునీల్, పెనుకుల మధు, పూజారి నరేందర్, కొ త్తపల్లి శ్రీకాంత్, పల్లకొండ శ్రీకాంత్, మోతె సతీష్, తాటికంటి మమత, మనుకొండ శిరీష, బానోత్ శిరీష, నోముల వెన్నెల, కృష్ణవేణి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తాటివనాల పెంపకానికి 5 ఎకరాల భూమి కేటాయించాలి

### గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో గీతా పనివారల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శిపందుల యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ తాటి వనాల పెంపకానికి ప్రతి గీత కార్మికుల సొసైటీకి ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీత కార్మికుల జీవనోపాధికి తాటి ఈత వనాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. గీత వృత్తి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి తాటి వనాల పెంపకాన్ని ప్రోత్సహించాలని కోరారు.560 జిఓ ప్రకారం గీత కార్మికులకు న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోరారు. 51 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికునిడు పెన్షన్ దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.వెంకటేశ్వర్లు, గీత పనివారల సమన్వయ కార్యదర్శి నాగభూషణం, గీత పనివారల సంఘం నాయకులు వీరమల్ల యాదయ్య, మోగుదాల సత్తయ్య, బి.యాదయ్య, బిక్షం, కిష్టయ్య, గోపి, పెంటయ్య, నారగోని స్వామి, పల్లె రాములు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోదీ ప్రభుత్వం

### ఎఐటియుసి రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

**ప్రజాపక్షం/హనుమకొండ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి విమర్శించారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే 1920 అక్టోబర్ 31న ఎఐటియుసి ఆవిర్భవించిందని, నాటి నుంచి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ‘వ్యాపారం సులభతరం’ పేరుతో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు.సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు కరీంనగర్‌లో ఎఐటియుసి రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు, ఈ రాష్ట్ర మహాసభలను కార్మిక లోకం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు గుంటి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




## కీలక డిమాండ్లకు సింగరేణి అంగీకారం

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం /శ్రీరాంపూర్ :** ఎఐటియుసి ఇచ్చిన సమ్మె నోటీసు, ఆర్ఎల్‌సి సమక్షంలో జరిపిన నిరంతర చర్చల ఫలితంగానే కార్మికుల పలు కీలక డిమాండ్లపై సింగరేణి యాజమాన్యం అంగీకారం తెలిపిందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సాధించిన విజయాలను వివరించేందుకు శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పి3 గని వద్ద శనివారం ద్వార సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ పెర్క్స్‌పై విధించే ఆదాయపు పన్నును యాజమాన్యమే భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం, ప్రతినెలా మెడికల్ బోర్డు నిర్వహణ, 2025–26 వాస్తవ లాభాల ప్రకటన, అర్హులైన మైనింగ్ సిబ్బందికి ఓవర్‌మెన్ ప్రమోషన్లు వంటి అంశాలపై అగ్రిమెంట్లు కుదిరాయని వెల్లడించారు. హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, కాంట్రాక్ట్ కార్మికులకు ఇఎస్ఐ సదుపాయం, పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల పరిష్కారం, సొంత ఇంటి పథకం అమలుపై ప్రభుత్వంతో చర్చలకు యాజమాన్యం సానుకూలంగా స్పందించిందన్నారు. ఒప్పందాల అమలును నిశితంగా పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, నాయకులు వంగరి రాజేశ్వరరావు, బాలకృష్ణ, అఫ్రోజ్ ఖాన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



## చెరువులు, కుంటలు నింపడమే లక్ష్యం

మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గంలో భూగర్భ జలాలు పెంచి చెరువులు కుంటలు నింపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం సాగర్ ఎడమ కాలువపై ఉన్న లిఫ్ట్ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. పెద్దదేవులపల్లి వద్ద అవుట్‌ఫాల్ రెగ్యులేటర్‌ను ఆన్ చేసి 6,000 క్యూసెక్కుల నీటిని కాలువలకు మళ్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చూడడంతో పాటు రైతుల పంటలకు సాగునీరు అందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అందులో భాగంగానే వజిరాబాద్ మేజర్, కిష్టాపురం మేజర్, మల్కల్ కాలువ మేజర్‌తో పాటు తక్కెలపాడు లిఫ్ట్ గేట్లను ఎత్తి నీటి పారకానికి శ్రీకారం చుట్టామని వివరించారు. చెరువులు, కుంటలను నీటితో నింపడం వల్ల తాగు, సాగునీటి కొరత తీరుతుందన్నారు.చివరి ఆయకట్టు రైతు వరకు నీరు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, నియోజకవర్గంలో ప్రతి ఎకరానికి నీరందేలా శ్రమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## మెరుగైన విద్యతోపాటు.. పౌష్టికాహారం

ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్:** విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. పట్టణంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్‌లు,స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెస్ చార్జీలు పెంచి నాణ్యమైన పౌష్టికాహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గురుకుల విద్యార్థుల విద్య, సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంబయ్య ఎంఈఓ మేక నాగయ్య,పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి,నాయకులు లింగాల వెంకన్న, పన్నాల రాఘవరెడ్డి,చౌగోని శ్రీనివాస్ గాజుల సుకన్య,శ్రీనివాస్ రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధవనాన్ని సందర్శించండి

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్‌లో పర్యాటకాభివృద్ధి సంస్థ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బౌద్ధ వారసత్వ థీమ్ పార్క్ బుద్ధవనాన్ని సందర్శించవలసిందిగా ఫిలడెల్ఫియా నగరంలోని బౌద్ధాచార్యులకు విజ్ఞప్తి చేసినట్లు బౌద్ధ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సిఇఒ, పురావస్తు శాస్త్రవేత్త డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. స్థానిక బౌద్ధాభిమాని రవికుమార్ రెడ్డి లట్టుపల్లి చొరవ, సహకారంతో శనివారం ఆయన అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని ఫిల డెల్ఫియా నగరంలో ఉన్న మోంగ్ కుల్ తెప్ మునీ బౌద్ధ విహారం, ఫాషో బౌద్ధాలయం, వాట్ ఖ్మేర్ పలెలై, ఫ్ర బుద్ధ రన్సీ, కతంప ధ్యాన కేంద్రం, లియాన్ షెంగ్ ట్రూ బుద్ధ టెంపుల్, వౌన్ బౌద్ధాలయాలను సందర్శిం చా రు. ఆయా బౌద్ధాలయ ఆచార్యులకు నాగార్జునకొండ, బుద్ధవనం ప్రత్యేకత లను వివరించగా, వారు భారతదేశ పర్యటనలో భాగంగా బుద్ధవనాన్ని సందర్శిస్తామని హామీ ఇచ్చినట్లు శివనాగిరెడ్డి తెలిపారు.

## రాష్ట్రంలో రాక్షస పాలన

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని, ఇది కాలమో, ఎల్నినో వల్ల వచ్చిన కరువు కాదని ముమ్మాటికి కాంగ్రెస్ సృష్టించిన కరువేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను వివరిస్తూ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నియోజక వర్గ ముఖ్య నేతలతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటువంటి ద్రోహపూరిత పాలనను చరిత్రలో నేటి వరకు చూడలేదన్నారు. రైతాంగం ఎంత మొత్తుకుంటున్న ఈ ప్రభుత్వానికి దున్నపోతు పై వాన పడ్డ చందంగా చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాము తన పిల్లలను తానే చంపుకున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతాంగాన్ని చంపుతుందని విమర్శించారు. ఇవాళ కృష్ణా, గోదావరి నీళ్లు ఎట్లా పోతున్నాయో కెటిఆర్, మేమంతా కళ్ళకు కట్టినట్లు చూపించిన ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. సుందిళ్ల, అన్నారం బ్యారేజులు మంచిగున్నాయని సెంట్రల్ వాటర్ కమీషన్ స్పష్టంగా తేల్చిందని గుర్తు చేశారు. ఈ 75 రోజుల్లో గోదావరిలో 150 టిఎంసిల నీళ్లను వృధాగా సముద్రం పాలు చేసింద్రని అన్నారు. కృష్ణాలో 150 టిఎంసిల నీటిని ఆంధ్రా పాలు చేశారన్నారు. శ్రీశైలం, సాగర్ పొంగిపొర్లేలా కృష్ణమ్మ నీళ్లిచ్చింది కానీ ఆంధ్ర సిఎం అనధికార ఉత్తర్వులతో అక్రమంగా నీళ్ళను దోచుకుపోయిండని ఆరోపించారు.ఈ సమావేశంలో మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మొక్కలు చనిపోతున్నాయని ఫిర్యాదు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** వరిపంటలో మొక్కలు చనిపోతున్నాయంటూ రైతు చేసిన ఫిర్యాదుపై మండల వ్యవసాయ అధికారి జావిద్ స్పందించారు. మండల పరిధిలోని పెంచికల్‌దిన్నె గ్రామానికి చెందిన వలంశెట్ట కృష్ణయ్య తన వరి పొలంలో వెదజల్లిన 15నుంచి 20 రోజుల తర్వాత మొక్కలు చనిపోతున్నాయని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం మండల వ్యవసాయ అధికారి జావిద్ రైతు పొలాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాథమిక వివరాలతో కూడిన నివేదికను జిల్లా వ్యవసాయ అధికారికి సమర్పించారు. రైతు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణదారుడు, సంబంధిత డిస్ట్రిబ్యూటర్, విత్తన కంపెనీ ప్రతినిధులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించిసమగ్ర నివేదికను సమర్పించాలని, మొక్కలు చనిపోవడానికి గల కారణాలను తెలియజేయాలని అదేశించారు.

# రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడత చేపట్టిన రీసర్వేకు మొదటి ప్రాధాన్యం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

డిసెంబర్‌లో రెండో విడత సర్వే చేపట్టేందుకు సంసిద్ధం

ఉమ్మడి నల్లగొండ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే గృహ నిర్మాణ శాఖల సమీక్ష



**ప్రజాపక్షం/సూర్యాపేట** : రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడత చేపట్టిన రీసర్వేకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో రెండో విడత సర్వే చేపట్టేందుకు సంసిద్ధం కావాలని చెప్పారు. దశాబ్దాల తరబడి గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చి పారదర్శకంగా అమలు చేస్తున్నదని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ప్రజలకు మేలు చేయాలని కోరారు. శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే గృహ నిర్మాణ శాఖల సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మొదటి విడత సర్వే చేపట్టిన 70 గ్రామాలలో సర్వేను పారదర్శకంగా నిర్వహించి గ్రామ సరిహద్దులు నిర్ధారించడం పై దృష్టి సారించాలన్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు ప్రత్యక్షంగా వీటిని పర్యవేక్షించాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లలో భాగంగా మొదటి విడత మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లలో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 సమస్యలను పరిష్కరించడంలో భాగంగా భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేలా సమస్యలను సరిచేసేలా పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. 15 రోజుల్లో ఎల్ 3 సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. 2వ విడత ఇలాంటి సమస్యలు రాకుండా ఇండ్ల మంజూరు సమయంలోనే ఇబ్బందులు రాకుండా శాసన సభ్యులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భూములకు సంబంధించి 45 దరఖాస్తులు తన లాగిన్ లోనే ఎక్కువ రోజులు ఉంచుకోవడంపై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు తహశీల్దార్‌ను వివరణ కోరాలని ఆదేశించారు. ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 సమస్యలు పరిష్కరించాలని, నల్లగొండ పట్టణంలోని ఇందిరమ్మ టవర్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి ద్వారా పేదవారికి సంబంధించిన నిజమైన భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలన్నారు. నకిరేకల్‌కు మంజూరైన జిల్లా కోర్టు విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల సమస్యల పరిష్కారంలో జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకోవాలని కోరారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ రిజిస్ట్రేషన్ కార్యాలయం, అలాగే అడవిదేవులపల్లి మండలంలో తహశీల్దార్ కార్యాలయాల మంజూరు, మిర్యాలగూడ మున్సిపాలిటి అయినందున మిర్యాలగూడకు ఎక్కువ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేలు మాట్లాడుతూ శాలిగౌరారం మండలం మాదారం చెరువు శిఖం భూమి ఆక్రమణ, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సమస్యను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. శాసన మండలి సభ్యులు శంకర్ నాయక్ మాట్లాడుతూ సాదాబైనామాల సమస్యల పరిష్కారంలో లింక్ డాక్యుమెంట్లు అడుగుతున్నారని, అలాగే ఆర్ఓఎఫ్ ఆర్ సమస్యలను పరిష్కరించాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ముగ్గు పోసుకున్న వారికి ఇండ్లు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సాదా బైనామాల సమస్యలు పరిష్కారం కావడం లేదని, నక్ష మ్యాపులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఇందిరమ్మ ఇండ్ల ఎల్ 3 సమస్యలను సరళీకృతం చేయాలని కోరారు. నాగార్జునసాగర్ శాసన సభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ తన నియోజక వర్గంలో ఆర్ అండ్ ఆర్ సమస్యలను పరిష్కరించాలని, అలాగే అటవీ, అసైన్డ్ పట్టాల లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని, ఎల్3 సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశం ప్రారంభమైన వెంటనే రెవెన్యూ సిసిఎల్ఏ సెక్రటరీ లోకేష్ కుమార్, ల్యాండ్ సర్వే సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ఎండి గౌతమ్‌లు వారి వారి శాఖలకు సంబంధించిన అంశాలను వివరించారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, వారి జిల్లాలకు సంబంధించిన సమీక్షలో వారు తీసుకున్న చర్యలపై మంత్రులకు వివరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్లు, ఆర్‌డిఓలు, సబ్ రిజిస్టర్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడిలు, తహశీల్దార్లు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**భూ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే భూ భారతి చట్టం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

గ్రామీణ ప్రాంతాలలో భూ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజల సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనాలనే ఉద్దేశంతో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఒక మంచి చట్టాన్ని తీసుకువచ్చి భూముల విషయంలో వారికి ఎక్కడా ఇబ్బందులు కడగకుండా



చూడాలన్నదే తమ ధ్యేయమని చెప్పారు. శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్గొండ జిల్లా రెవిన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖల సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ 125 సంవత్సరాల క్రితం తెలంగాణ రాష్ట్రంలో భూమి సర్వే నిర్వహించడం జరిగిందని, తదుపరి ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడు సర్వే చేయలేదన్నారు. సర్వే చేయని కారణంగా గ్రామీణ ప్రాంతంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, సహచర మంత్రి వర్గ సభ్యులు, శాసన సభ్యులు, శాసనమండలి సభ్యుల ఆలోచనల మేరకు మొదటి విడత రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాలలో సర్వే చేసేందుకు ప్రణాళిక ఏర్పాటు చేసుకొని సర్వే నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని నూతనకల్, మద్దిరాల మండలాలలో 70 సంవత్సరాలుగా ఉన్న సీలింగ్ భూమికి సంబంధించిన భూముల సమస్యలను పరిష్కరిస్తూ శనివారం పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని స్థానికంగా జన్నారెడ్డి వంశపార్యం పద్యం 2300 ఎకరాల పైచిలుకు భూములకు పరిష్కారం చూపించడం జరిగిందని మంత్రి తెలిపారు.

## నల్లగొండలో 1,400 మంది క్షయ వ్యాధి బాధితులు

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

క్షయ వ్యాధి బాధితులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** క్షయ వ్యాధి బాధితులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్య పరిరక్షణకు సహకరించడం ఎంతో మంచి కార్యక్రమమని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రిచ్ ఎన్ఎస్ఐఎల్ కంపెనీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి బాధితులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సుమారు 750 మంది క్షయ వ్యాధి బాధితులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం సుమారు 1,400 మంది క్షయ వ్యాధి బాధితులు ఉన్నారని తెలిపారు. వారిలో 750 మందికి న్యూట్రిషన్ కిట్లు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. క్షయ వ్యాధి నుంచి బాధితులు త్వరగా కోలుకోవడంలో మందులతో పాటు పౌష్టికాహారం కూడా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల కింద జిల్లాలోని అడవిదేవులపల్లి, గుడిపల్లి, తిరుమలగిరి (సాగర్), పెద్దవూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సుమారు రూ.17 లక్షల వ్యయంతో ఫర్నిచర్ అందించడం కూడా శుభపరిణామమని కలెక్టర్ అన్నారు. రిచ్ ఎన్ఎస్ఐఎల్ కంపెనీ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాహుల్, రిచ్ కంపెనీ చైర్మన్ రాధాకృష్ణ, సీఈవో లక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నగేష్, సూపర్‌వైజర్ అనిల్ సైదులు, సిబ్బంది, క్షయ వ్యాధి బాధితుల అటెండర్లు తదితరులు పాల్గొన్నారు.

## జిజిహెచ్‌లో గర్భస్థ శిశు మృతి ఘటనపై విచారణ పూర్తి

కలెక్టర్‌కు నివేదిక అందజేశాం: అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్)లో శుక్రవారం జరిగిన గర్భస్థ శిశు మరణ ఘటనపై విచారణ పూర్తి చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేశామని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి తెలిపారు.శనివారం జీజీహెచ్‌లో ఆసుపత్రి వివిధ విభాగాల అధిపతులు (హెచ్ఓడీలు),డిప్యూటీ సూపరింటెండెంట్‌తో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శుక్రవారం జరిగిన గర్భస్థ శిశు మరణ ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై విచారణ చేపట్టామన్నారు.బాధిత కుటుంబ సభ్యుల ఆరోపణలు, వైద్య సిబ్బంది వివరణలు, సంబంధిత నివేదికలను పరిశీలించి పూర్తి వివరాలతో శనివారం నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించినట్లు చెప్పారు.ఆసుపత్రిలోని అన్ని విభాగాల అధిపతులతో నిర్వహించిన సమీక్షలో ఆయా విభాగాల్లో నెలకొన్న సమస్యలు, సిబ్బంది కొరత తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా వైద్యుల కొరతపై హెచ్ఓడీలు దృష్టికి తీసుకురాగా,మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌తో చర్చించి పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.జీజీహెచ్‌లో ఖాళీగా ఉన్న కొన్ని పోస్టులు, సిబ్బంది నియామకాలకు సంబంధించిన అంశాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి,జిల్లా మంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన ఫైళ్లకు ఆమోదం లభించేలా కృషి చేస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు.గైనకాలజీ విభాగంలో జరిగిన ఘటనకు సంబంధించి నర్సింగ్ సూపరింటెండెంట్ నీలాబాయి నివేదిక అందజేశారని,ఆనివేదికను కూడా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా, ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ నగేష్, అన్ని విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.



## స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల కేంద్రంలో సెప్టెంబర్ 8,9,10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సుద్దాల సాయికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో యువత శాతం అధికంగా ఉన్నప్పటికీ వారికి నాణ్యమైన విద్య,శాశ్వత ఉపాధి, అందుబాటు వైద్యం, నైపుణ్యాభివృద్ధి,సామాజిక భద్రత కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. జిల్లాలోని పరిశ్రమలలో స్థానికులకే ఉద్యోగ అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి స్పష్టమైన వార్షిక క్యాలెండర్,పెండింగ్ నియామకాల పూర్తి,జిల్లాల వారీగా పరిశ్రమల ఏర్పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రైవేట్, కాంట్రాక్ట్, గిగ్ రంగాల్లో పనిచేస్తున్న యువతకు కనీస వేతనం,ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని కోరారు.ప్రతి జిల్లాలో ఉచిత పోటీ పరీక్షల కోచింగ్ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, విద్యార్థి హాస్టళ్లు ఏర్పాటు చేయాలని,ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను బలోపేతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరు నరసింహ, ఎఐవైఎఫ్ మండల అధ్యక్షులు కళ్లెం స్వామి,కార్యదర్శి రచ్చ దయాకర్,ముగ్గు మచ్చగిరి, ముగ్గు ప్రవీణ్,రచ్చ రాజేష్, ఊట్కూరి శ్రీను,ఉట్కూరు కృష్ణ పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి

**ప్రజాపక్షం/యాదాద్రి** : పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీసీ, ఎస్సి, ఎస్టీ జేఏసి జిల్లా నాయకులు, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల శాంతి కుమార్ అన్నారు. సోమవారం బీసీ, ఎస్సి, ఎస్టీ జేఏసి జిల్లా నాయకులు, ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 33 లక్షల మంది విద్యార్థులకు రు.12 వేల కోట్లకు పైనే బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఈ సమస్య కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లింగస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలువర్తి శ్రీకాంత్, కార్యదర్శులు సురేష్, సాయి కుమారు, నగేష్, సాగర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## రాజ్యాధికారం కోసమే బడుగుల ఐక్యత



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బడుగుల రాజ్యాధికారం కోసమే బడుగుల ఐక్యత అని ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాకుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ శ్రీని ఫంక్షన్ హాలులో జరిగిన రౌండ్ టేండ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుద్ధుడు, అశోకుడు, సంత్ రవిదాస్, సంత్ కబీర్ దాస్, శివాజీ మహారాజ్, మహాత్మ జ్యోతి రావు పూలే, సాహూ మహారాజ్, డా. అంబేడ్కర్, కాన్షీరాంల ఆశయ దీపాన్ని, ఆలోచనల రథాన్ని తెలంగాణ లో వెలిగించడానికి, ముందుకు నడిపించడానికి తెలంగాణలో సమ్మక్క సారలమ్మల, సర్వాయి పాపన్న గౌడ్ల, పండగ సాయన్నల, కొండా లక్ష్మణ్ బాపూజీల, ఆత్మగౌరవ జెండాని రాజ్యాధికార అజెండాని తెలంగాణలో పునర్నిర్మించడానికే జెఎసి పుట్టిందని మరొక్కమారు సగర్వంగా చాటుతున్నామన్నారు. తెలంగాణలో 90శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బలగమంతా జేఏసీగా ఒక్కటై తెలంగాణాలో రాజ్యాన్ని స్థాపిద్దామన్నారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్, ఉపాధ్యక్షులు రాసాల వినోద్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్ కమల్ రెడపాక డాక్టర్ జె.రాజు, చిరుమర్రి కృష్ణయ్య, వజ్జగిరి అంజయ్య, టి.అర్జున్, తరి ఎల్లయ్య, నీలకంఠ నాయక్ , వెంకటేష్, లక్ష్మణ్ , ఎఐఎంఐఎం జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్ ఫారుక్ పాల్గొన్నారు

## అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పట్టివేత

ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు

20కేజీల గంజాయి స్వాధీనం : కారు,రెండు సెల్‌ఫోన్‌లు సీజ్



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓడిశా రాష్ట్రం కేంద్రపార జిల్లా రాజ్‌నగర్ గ్రామానికి చెందిన త్రిలోచన్ సామం(30),సాగర్‌బాల్(23)లు ఓడిశా రాష్ట్రం నుండి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి అక్రమంగా తెలంగాణ రాష్ట్రం హైద్రాబాద్‌కు రవాణా చేస్తున్నారు. గంజాయిని హైద్రాబాద్‌లో ఓడిశా రాష్ట్రానికి చెందిన వికాస్‌బారీ,ఆకాష్ అనే వ్యక్తులు గంజాయిని వీరి వద్ద నుండి తీసుకుని హైద్రాబాద్‌లోని పలు ప్రాంతాలకు విక్రయించడం జరుగుతుంది.విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్ ఈగల్ టీం,చౌటుప్పల్ పోలీసులు సంయుక్తంగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై ఓ కారును ఆపి చూడగా అందులో 20కేజీల గంజాయి తరలిసున్నట్లు గుర్తించి,కారులో ఉన్న త్రిలోచన్ సామం,సాగర్‌బాల్‌ను పట్టుకుని చౌటుప్పల్ స్టేషన్‌కు తరలించి విచారణ చేశారు. ఓడిశా నుండి హైద్రాబాద్‌కు గంజాయి రవాణా చేసినందుకు రూ.50వేలు తీసుకున్నట్లు చెప్పారు. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి కారు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోని సీజ్ చేశారు. త్రిలోచన్ సామం, సాగర్‌బాల్‌ను రిమాండ్‌కు తరలించగా, వికాస్ బారీ,ఆకాష్‌ల కోసం గాలింపు చర్యలు చెపట్టినట్లు సిఐ జి.మన్మథకుమార్ తెలిపారు.గంజాయి తరలింపు వెనక మరి కొంతమంది ఉన్నట్లు విచారణలో తెలిందని పేర్కొన్నారు.గంజాయి తరలిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు చెప్పారు.

## రీ-సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/దహెగాం :** మండలంలోని అమర్‌గొండ గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ కె. హరిత శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యవసాయ భూములు, సరిహద్దులు, ఆవాస ప్రాంతాలతో పాటు ప్రభుత్వ భూములను స్వయంగా తనిఖీ చేసి అధికారులతో సమీక్షించారు.సర్వేలో వినియోగిస్తున్న జిఎన్ఎస్ఎస్ రోవర్ పరికరాల పనితీరును, కంట్రోల్ పాయింట్లను పరిశీలించి సాంకేతిక ఖచ్చితత్వంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.స్థానిక రైతులు, గ్రామస్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించారు. భూ సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలనలో పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత గడువులోగా ప్రక్రియను ముగించాలని స్పష్టం చేశారు.సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకులు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే రామేశ్వర్, మండల సర్వేయర్ ధనరాజ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పకడ్బందీగా డిజిటల్ పంటల సర్వే

జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి



**ప్రజాపక్షం/రెబ్బెన :** డిజిటల్ పంటల సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి సిబ్బందిని ఆదేశించారు. మండలంలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతుల పొలాల్లో సర్వే నంబర్, భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంట వివరాల నమోదును తనిఖీ చేశారు. వాస్తవ క్షేత్ర పరిస్థితులను పరిశీలించిన తర్వాతే వివరాలను డిజిటల్ వ్యవస్థలో నమోదు చేయాలన్నారు. ప్రతి గ్రామంలోని ప్రతి రైతు సాగు వివరాలు నమోదయ్యేలా చూడాలని, ఏ ఒక్కటీ విస్మరించవద్దని స్పష్టం చేశారు. నమోదులో తప్పులు దొర్లితే వెంటనే సరిదిద్దాలని సూచించారు. ఖచ్చితమైన వివరాలు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సేవల అమలుకు కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శంకర్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులకు మెరుగైన సేవలు



**ప్రజాపక్షం/మావల:** దివ్యాంగులకు ఒకే చోట సమగ్ర వైద్య సేవలు అందించేందుకు రిమ్స్‌లో సౌండ్ ప్రూఫ్ గదిని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం స్థానిక రిమ్స్ ఆసుపత్రిలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మించిన ధ్వని నిరోధక గదిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దివ్యాంగుల వైద్య సేవలతో పాటు యుడిఐడి అసెస్‌మెంట్, సదరం సర్టిఫికేట్ జారీకి ఈ గది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పింఛన్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఆర్డీఓ రవీందర్, ఏపీఓ శేషారావు, వైద్యులు పాల్గొన్నారు.

## నీట్ (పీజీ) పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు

కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నీట్ (పీజీ) పరీక్షా కేంద్రాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో నీట్(పీజీ) పరీక్షలు 265 మంది అభ్యర్థులు హాజరు కానుండగా ఆర్సపల్లిలోని ఎంవి ఎంటర్‌ప్రైజెస్, మల్లారంలోని షిఫ్ట్ టెక్నాలజీస్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సందర్శించి నిశిత పరిశీలన జరిపారు. పరీక్షా కేంద్రాల్లో సరిపడా కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, ఇంటర్నెట్ కనెక్షన్ ఇత్యాది సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని గమనించారు.ఉదయం 9 గంటల నుండి 12.30 గంటల వరకు నీట్ (పీజీ) పరీక్ష కొనసాగుతుందని, అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఈఓ అశోక్, డీఐఈఓ రవికుమార్, డీయంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీ, ఏసీపీ ప్రకాష్, తహసీల్దార్లు హరికిషోర్, కలెక్టరేట్ ఏఓ బాలరాజు తదితరులున్నారు.

## కళ్ళకల్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** నూతన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్ తెలిపారు. మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామంలో సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజ్ గౌడ్,ఉప సర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్ ల ఆధ్వర్యంలో శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్మార్ట్ రేషన్ కార్డుల కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని వారు పేర్కొన్నారు. అనసూయ కృష్ణ, ఖాజా మొయినుద్దీన్, ఇర్ఫాన్, గుజ్జా స్వామి, రాజశేఖర్ రెడ్డి, మండల అధ్యక్షులు జూపల్లి మల్లారెడ్డి, మెదక్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎరుకలి నరసింహ, మాజీ వార్డు సభ్యులు రమేష్, వెంకటేష్, దండు సత్యనారాయణ, గ్రామ అధ్యక్షుడు రంగాచారి, గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు

# చిత్తశుద్ధితో కృషి చేయాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధనను అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని పాఠ్యాంశాలతో పాటు ప్రపంచానికి సంబంధించిన విషయ పరిజ్ఞానం విద్యార్థులకు నేర్పించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. శనివారం మోపాల్ మండలం బోర్గాం(పి) జడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అందుబాటులోని బోధనా సిబ్బందిపై అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోనే ఇతర అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే అత్యధికంగా ఈ పాఠశాలలో 1120మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండటం, ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు వరించటంతో కలెక్టర్ హర్షం వెలిబుచ్చారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా క్రీడా మైదానం లేదని నిర్వాహకులు తెలుపటంతో, స్కూల్‌కు ఆనుకుని ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం, గ్రంథాలయ భవనాలను కలెక్టర్ పరిశీలించారు. వీటిని సమీపంలో మరో చోటికి మార్చేందుకు ఏమైనా అవకాశాలున్నాయా అన్నది పరిశీలించాలని, దీంతో పాఠశాలకు క్రీడా మైదానం వసతి సమకూరటంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణాలకు వీలవుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. బడికి ఆనుకున్న ప్రైవేట్ స్థలాన్ని సైతం కొంతమేర సేకరించి పాఠశాలను మరింతగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ 10వ తరగతిని సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఫిజిక్స్, మ్యాథ్స్, ఆంగ్లం సబ్జెక్టులను బోధించి పలు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. ఏకాగ్రతతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విషయ పరిజ్ఞానం పెంపొందించుకుని ప్రతిభను మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కలెక్టర్ వెంట డీఈఓ అశోక్, మోపాల్ తహసీల్దార్ రేఖ, ఎంఈఓ సాయిలు, ప్రధానోపాధ్యాయులు శంకర్ తదితరులున్నారు.

## విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/హాజీపూర్:** విద్యార్థులు ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా స్వీకరించి, సరైన మార్గంలో పయనిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గుడిపేట కేంద్రీయ విద్యాలయంలో మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా శనివారం నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య 600కు పైగా పెరగడం సంతోషకరమన్నారు. చదువుతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు మాట్లాడుతూ చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సృజనాత్మకత పెంపొందించాలని సూచించారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని సమాజ, దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ ధర్ని మధుకర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## సింగరేణిలో 23 డిమాండ్ల పరిష్కారం

ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ



**ప్రజాపక్షం/మందమర్రి :** ఎఐటియుసి నిరంతర పోరాటం, కార్మికుల ఐక్యతతో సింగరేణి యాజమాన్యం 32 డిమాండ్లలో 23 డిమాండ్ల పరిష్కారానికి అంగీకరించిందని గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ భీమనాధుని సుదర్శన్ తెలిపారు. హైదరాబాద్‌లో ఆర్ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చల్లో పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యమే భరించేందుకు ఒప్పుకుందన్నారు. సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం, ప్రతినెలా మెడికల్ బోర్డు నిర్వహణ, ఏడాది నిబంధనతో బదిలీలు, 9 శాతం హెచ్‌ఆర్‌ఏ, 149 మంది డిపెండెంట్లకు నెల రోజుల్లో ఉత్తర్వుల జారీకి అంగీకారం కుదిరిందని వివరించారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ, హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు హామీ లభించిందన్నారు.ప్రేమ్‌లాల్ పాల్గొన్నారు.

## సిసిఐ పునర్ ప్రారంభం కోసం 2014 నుంచే పోరాటం

జోగు రామన్న



**ప్రజాపక్షం/మావల:** సిసిఐ సిమెంట్ పరిశ్రమను పునర్ ప్రారంభించాలని కోరుతూ సిసిఐ సాధన సమితి చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 21వ రోజుకు చేరుకున్నాయి. మాజీ మంత్రి జోగు రామన్న బిఆర్ఎస్ నాయకులతో కలిసి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.2014 నుంచే సిసిఐ పునర్ ప్రారంభం కోసంబిఆర్ఎస్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. ఎన్నికల్లో గెలిచాక బిజెపి ఎంపి, ఎమ్మెల్యేలు సిసిఐ హామీని విస్మరించడం విచారకరమన్నారు. నాయకులు యాసం నర్సింగరావు, అలాల్ అజయ్, మెట్టు ప్రహ్లాద్, రాజన్న పాల్గొన్నారు.

## క్రీడలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శనివారం మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 5కే,2కే రన్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. పురుషులకు వెల్కమ్ బోర్డు చౌరస్తా నుంచి ధ్యాన్ చాంద్ చౌరస్తా వరకు 5 కిలోమీటర్లు, బాలికలకు కొత్త బస్టాండ్ నుంచి ధ్యాన్ చాంద్ చౌరస్తా వరకు 2 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. విద్యార్థులు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 5కే రన్‌లో పాల్గొని విజయవంతంగా పూర్తి చేసిన పట్టణ సీఐ మహేష్ క్రీడాకారులు, క్రీడాభిమానుల్లో స్ఫూర్తి, ఉత్సాహాన్ని నింపారు.మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా .జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని, జిల్లా నుంచి జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అనంతరం ధ్యాన్‌చంద్ చౌరస్తా వద్ద ధ్యాన్‌చంద్ చిత్రపటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. విజేతలకు మెడల్స్ అందజేశారు. ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, డిఎస్‌పి ప్రసన్న కుమార్, యువజన క్రీడల అధికారి రమేష్, మెదక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు, డిపిఆర్ఓ రామచంద్రరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/రాంచంద్రాపురం :** విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవడంతో పాటు దినచర్యలో క్రీడలు భాగం కావాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. భారత నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ వాణి నికేతన్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర 45 వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ 2026 (బాలుర ,బాలికలు ) పోటీలను మెదక్ ఎం.పి రఘునందన్‌రావు ,ఎమ్మెల్సీ అంజిరెడ్డిలతో కలిసి ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలు ఎంతో కీలక పాత్ర షోషిస్తాయని అన్నారు. చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాదాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు శారీరక దృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం ,క్రమ శిక్షణ ,ఆత్మ విశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయిని తెలిపారు. చిన్న వయస్సులో నే క్రీడలపై ఆసక్తి పెంచుకుని ప్రతిభ ను మెరుగుపరుచుకుంటే జాతీయ ,అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందని అన్నారు. తల్లిదండ్రులు ,ఉపాద్యాయులు, విద్యార్థులను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడా ప్రతిభను ప్రొత్సహించేందుకు అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడు ముందుంటామని ఆయన తెలిపారు. పటాన్చెరును వేదికగా జిల్లా ,రాష్ట్ర ,జాతీయ స్థాయి క్రీడలను నిర్వహిస్తూ క్రీడారంగాన్ని పోత్సహిస్తున్నామని తెలిపారు. నిరుపేద క్రీడాకారులకు ఆర్థిక సహకారం, అందిస్తూ అండగా నిలుస్తున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొంటున్న అన్ని జిల్లాల క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసి క్రీడాస్ఫూర్తితో ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్, నా యకులు పరమేష్, యాదవ్, బాబ్జీ క్రీడా సంఘా ప్రతినిధులు నిర్మాహకులు ,విద్యార్థులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## యాప్ ప్రకారమే రైతులకు యూరియా పంపిణీ

యూరియా కొత్త యాప్‌తో రైతులకు తప్పని తిప్పలు, రైతులకు సరిపడా అందని యూరియా

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రభుత్వం కొత్తగా తీసుకవచ్చిన యూరియా కొత్త యాప్‌తో కూడా రైతులకు తిప్పలు తప్పడం లేదు. ప్రభుత్వ ఆలోచనను తుంగలో తొక్కుతున్న ఫర్టిలైజర్ దుకాణాదారులు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్లు చూపిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వ్యవసాయ అధికారుల కన్ను గప్పి రైతులను మోసం చేస్తున్నారు. మోర్తాడ్, భీమ్‌గల్, వేల్పూర్ మండలాల్లో యథేచ్చగా ఈ దందా సాగుతున్న అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఐఎఫ్ఎంఎస్ ఐడి అక్‌నాలెడ్జ్‌మెంట్‌లో వ్యాపారుల చేతివాటతో కృత్రిమ కొరతతో సామాన్య రైతాంగం అల్లాడుతుంది. బాల్కొండ నియోజకవర్గంలోని పలు ఫర్టిలైజర్ షాపులు నిబంధనలను తుం గలో తొక్కుతూ రైతుల నోట్లో మట్టి కొడుతున్నాయి. ముఖ్యంగా భీమ్‌గల్, వేల్పూర్ మండలాల్లో యూరియా విక్రయాల్లో భారీ అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు అక్కడి రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫర్టిలైజర్ షాపులకు యూరియా స్టాక్ రాగానే వెంటనే 'ఇంటిగ్రేటెడ్ ఫర్టిలైజర్ మేనేజ్‌మెంట్ సిస్టం'(ఐఎఫ్ఎంఎస్) ఐడిని అక్‌నాలెడ్జ్ చేయాల్సి ఉంటుంది. అలా చేస్తేనే ఆ స్టాక్ వివరాలు అధికారిక యాప్‌లో ప్రజలకు కనిపిస్తాయి. కానీ ఇక్కడి వ్యాపారులు మాత్రం డిజిటల్ లూప్‌హోల్స్‌ను ఆసరాగా చేసుకుని కొత్త దందాకు తెర లేపారు. తెలిసిన వారికే సమాచారం అందిస్తూ బుక్ చేసుకునేలా వారికి ఇష్టమచ్చిన సమయంలో ఎంట్రీ చేస్తున్నారు. దీంతో సామాన్యులకు నిరాశే మిగులుతుంది. షాపు నిర్వాహకులు స్టాక్ వచ్చిన వెంటనే ఐడిని అకనాలెడ్జ్ చేయటం లేదు, తమకు ఇష్టమచ్చినప్పుడు అర్ధరాత్రి వేళల్లో లేదా రహస్యంగానో ఐడి వేస్తున్నారు. భీమ్‌గల్, వేల్పూర్ మండలాల్లోని ఫర్టిలైజర్ షాపుల లాగ్‌బుక్స్, ఐఎఫ్ఎంఎస్ ఐడి ఎంట్రీ సమయాలను, యాప్ డేటాను ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈ దందా గుట్టు రట్టవుతుంది. బాల్కొండ నియోజకవర్గ వ్యవసాయాధికారులు తక్షణమే స్పందించి షాపులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, డిజిటల్ అక్రమాలకు పాల్పడుతున్న వ్యాపారుల లైసెన్స్‌లను రద్దు చేయాలని రైతాంగం డిమాండ్ చే స్తోంది. యాప్ ప్రకారమే రైతులకు యూరియా పంపిణీ జరుగుతుందని ఎవరైనా ఫర్టిలైజర్ దుకాణాల వద్ద ధర్నా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



## మోదీజీ.. మీ హామీలు నెరవేర్చండి




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మార్పు అవసరం నినాదంతో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్ లీలా మైదాన్‌లో జరుగుతున్న సభకు కొన్ని రాష్ట్రాలలో రానివ్వకుండా అడ్డుకోవటం సిగ్గుచేటన్నారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సుధాకర్ మాట్లాడారు. ఇప్పటికే గత 12 ఏళ్లుగా దేశంలో పాలన చేస్తున్న బిజెపి పెరిగిన ధరలను అరికట్టడంతో పాటు, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల హామీని మరిచిందన్నారు. అందరికి ఆరోగ్యం, విద్య ఉచితంగా అందించాలని కోరుతున్నామన్నారు. మహిళా రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగం పండించిన పంటలకు కనీస మద్దతు ధర లీగల్ గ్యారెంటీ చట్టాన్ని అమలు చేయాలని, కార్మిక హక్కులు రక్షించాలని, బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించిప్రజాస్వామ్యాన్ని రక్షించాలన్నారు.ఆదివాసులకు న్యాయ ం చేయటంతో పాటు వారిపై పెరుగుతున్న అత్యాచారాలు స్థాన చలనం ఆపాలని సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరుగుతున్న బదులావ్ జరూరి హైమార్చు అవసరం పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ కార్యకర్తలను కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓమయ్య, నాయకులు రంజిత్, హన్మాండ్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో డి-మార్ట్ అక్రమ నిర్మాణంపై లోకాయుక్త సీరియస్

సమగ్ర నివేదిక ఇవ్వాలని

ఆర్‌డిఒకు నిర్మల్ కలెక్టర్ ఆదేశం!

**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ పట్టణ పరిధిలోని సోఫినగర్ ప్రాంతంలో ఉన్న కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికావడం, అందులో భారీ వాణిజ్య సముదాయమైన డిమార్ట్ అక్రమంగా వెలవడంపై రాష్ట్ర గౌరవ లోకాయుక్త అత్యంత తీవ్రంగా స్పందించింది. సర్వే నంబర్ 256లోని ప్రభుత్వ స్థలంలో జరిగిన ఈ అక్రమ నిర్మాణంపై ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర యంత్రాంగం సంచలన ఆధారాలతో లోకాయుక్త (హైదరాబాద్) స్థానాన్ని ఆశ్రయించింది. ఆ పార్టీ పక్షాన సమర్పించిన పక్కా ఆధారాలు, ఫిర్యాదు (ఫిర్యాదు No. 412/ 2026/ బి1)పై తీవ్రంగా స్పందించిన లోకాయుక్త సంస్థ, ఈ భూ ఆక్రమణ వ్యవహారంపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి సవివరమైన నివేదికను సమర్పించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది.లోకాయుక్త సంస్థ నుంచి వచ్చిన ఆదేశాల పట్ల తక్షణమే స్పందించిన నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం, వెంటనే స్థానిక అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. నిర్మల్ రెవెన్యూ డివిజనల్ అధికారి(డిఆర్‌డిఒ),నిర్మల్ అర్బన్ తహసీల్దార్‌కు అధికారికంగా లేఖ (నోటీసు నెం. ఇ/52/20241, తేదీ: 11—08.—2026) పంపుతూ, ఈ ఆక్రమణపై పూర్తి వివరాలతో కూడిన క్షేత్రస్థాయి విచారణ జరపాలని నిర్దేశించింది. రాబోయే సెప్టెంబర్ 8—2026 లోగా విచారణకు సంబంధించిన పూర్తి నివేదికను లోకాయుక్తకు సమర్పించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ భూమి ఆక్రమణకు సంబంధించిన కీలక చట్టపరమైన ఆధారాలు మరియు లీగల్ డాక్యుమెంట్లు పక్కాగా బయటపడ్డాయి. సోఫినగర్ సర్వే నెం.256లో ఉన్న స్థలం పక్కా ప్రభుత్వ భూమి అని గతంలో స్వయంగా జిల్లా కలెక్టర్ గారే రికార్డుల్లో స్పష్టంగా ధృవీకరిస్తూ నివేదికలు ఇచ్చారు. కానీ, కోట్ల విలువైన ఈ విలువైన భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు,ఆ తర్వాత రికార్డుల్లో అక్రమంగా సవరణలు చేస్తూ ప్రభుత్వ భూమి కాదని ప్రైవేట్ స్థలంగా చూపే ప్రయత్నం చేశారు. దీనికి సంబంధించిన అన్ని రకాల అసలు డాక్యుమెంట్లు, కీలక ఆధారాలు భద్రంగా లభ్యమయ్యాయి.ప్రభుత్వ భూములను,ప్రజా ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత కలిగిన రెవెన్యూ మరియు మున్సిపల్ శాఖల అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో నేరుగా కుమ్మక్కై ఈ భారీ అక్రమాలకు పాల్పడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా రికార్డులను సవరించి డిమార్ట్ వంటి భారీ వాణిజ్య భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం చట్టరిత్యా తీవ్రమైన నేరం. లోకాయుక్త జోక్యంతో నిజాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సర్వే నెం. 256లోని డిమార్ట్ భవనం ఉన్న స్థలాన్ని తక్షణమే ప్రభుత్వం పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకోవడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన డిమార్ట్ భవనాన్ని వెంటనే కూల్చివేయాలి. రికార్డులను మార్చి అక్రమ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్క బాధ్యులైన అధికారులపై చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఈ అక్రమ నిర్మాణంపై బాధ్యులైన ఎంతటి వారైనా సరే చర్యలకు డిమాండ్ ఆప్ ఈ అక్రమ నిర్మాణంపై బాధ్యులైన ఎంతటి వారైనా వదిలేదే లేదని, లోకాయుక్తలో ఇచ్చిన ఫిర్యాదుతో పాటు ఈ ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, డిమార్ట్ నిర్మాణాన్ని కూల్చివేసేంత వరకు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజాక్షేత్రంలోనూ, న్యాయ స్థానాల్లోనూ చట్టబద్ధ పో రాటం చేస్తామని, పోరాటం ఆగేది లేదని ప్రజలకు ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ జా యింట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్ స్పష్టం చేశారు.



APPENDIX-XI(Rules 238 to 241)
FORM-II-Non- Agriculture Lands
PROFORMA FOR FURNISHING DETAILS OF PROPERTIES UNDER SECTION 22-A(1) (b) OF THE REGISTRATION ACT, 1908 FOR PROHIBITION

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 33 | Nirmal | Nirmal_U | Siddapur | 256 | - | - | 4.29 | Govt Land \| D Mart |
| 34 | Nirmal | Nirmal_U | Siddapur | 262 | - | - | 38.16 | House Sites & Industrial Area |
| 35 | Nirmal | Nirmal_U | Siddapur | 264 | - | - | 16.22 | Industrial area |
| 36 | Nirmal | Nirmal_U | Siddapur | 264/2 | - | - | 1.22 | Industrial area |
| 37 | Nirmal | Nirmal_U | Siddapur | 265 | - | - | 16.27 | Industrial area |
| 38 | Nirmal | Nirmal_U | Siddapur | 266 | - | - | 13.27 | Industrial area |
| 39 | Nirmal | Nirmal_U | Siddapur | 269 | - | - | 2.00 | Shikam (Erra Kunta) |
| 40 | Nirmal | Nirmal U | Siddapur | 270 | - | - | 5.00 | Sofi Nagar House Sites |
| 41 | Nirmal | Nirmal U | Siddapur | 271 | - | - | 3.11 | Milk Cooling Centre |
| 42 | Nirmal | Nirmal U | Siddapur | 272 | - | - | 2.34 | Milk Cooling Centre Quarters |
| 43 | Nirmal | Nirmal U | Siddapur | 276 | - | - | 8.35 | Sofi Nagar House Sites |
| 44 | Nirmal | Nirmal U | Siddapur | 277 | - | - | 6.10 | Sofi Nagar House Sites |
| 45 | Nirmal | Nirmal U | Siddapur | 278 | - | - | 3.30 | Sofi Nagar House Sites |
| 46 | Nirmal | Nirmal U | Siddapur | 279 | - | - | 4.32 | Sofi Nagar House Sites |
| 47 | Nirmal | Nirmal U | Siddapur | 282 | - | - | 5.03 | PP Sofi Nagar & House Sites |
| 48 | Nirmal | Nirmal_U | Siddapur | 284 | - | - | 1.00 | Irrigation Project Sarasswathi canal |
| 49 | Nirmal | Nirmal_U | Siddapur | 285/1 | - | - | 3.01 | Irrigation Project Sarasswathi canal |
| 50 | Nirmal | Nirmal_U | Siddapur | 286 | - | - | 1.04 | Irrigation Project Sarasswathi canal |

Revenue Divisional officer Nirmal
Additional Collector (Revenue) Nirmal
District Collector



## ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి : కల్లేపల్లి




**ప్రజాపక్షం/బోథ్ :** కరీంనగర్ లో వచ్చే నెల ఆరు నుండి 8వ తేదీ వరకు పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించే ఎఐటియుసి తెలంగాణ నాల్గవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లేపల్లి గంగయ్య పిలుపునిచ్చారు.శనివారం బోథ్ మండల కేంద్రంలో ఏఐటియుసి నాయకులతో కలిసి పోస్టర్ను ఆవిష్కరించారు.సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను నాలుగు లేబర్ కోర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్క కార్మికుడు సభలకు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. మండల నాయకులు అనుపచందు,సాయిని సత్యనారాయణ,రాథోడ్ మంగులాల్, గోవింద్ ,కార్మికులు,పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ బాద్‌షా కిచ్చా సుదీప్ పీరియ‌డయాక్షన్ స్పెక్టకిల్ ‘బిల్లా రంగా బాషా: ది ఫస్ట్ బ్లడ్ థియేట్రికల్ రిలీజ్ దిశగా యూనిక్ ప్లానింగ్‌తో ముందుకు సాగుతోంది. అనూప్ భండారి దర్శకత్వం వహిస్తున్న ఈ హై-బడ్జెట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను ష్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు.

రీల్

## ‘రంభ ఊర్వశి మేనక’ టైటిల్ సాంగ్ రిలీజ్



అల్లరి నరేష్ ఫాంటసీ కామెడీ ‘రంభ ఊర్వశి మేనక’తో అలరించబోతున్నారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వంలో, అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మించారు. సురభి, రాశి సింగ్, విష్ణు ప్రియ, ప్రిషా సింగ్ హీరోయిన్స్ గా నటించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్ టీజర్ ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా టైటిల్ సాంగ్ రిలీజ్ చేశారు. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ ఇప్పుడు టైటిల్ సాంగ్ రిలీజ్ చేస్తున్నాము. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో ఇది చాలా డిఫరెంట్. థియేటర్‌లో ఈ సాంగ్ ఇంకా చాలా బాగుంటుంది.. అల్లరి నరేష్ తో నటించడం చాలా అద్భుతమైన ఎక్స్పీరియన్స్. ఈ సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా కోసం ఆహార నియమాలు చాలా కఠినంగా పాటించాను. ఈ సినిమా షూటింగ్ కూడా మాకు చాలా ఛాలెంజింగ్‌గా అనిపించిందని అన్నారు. ప్రిషా సింగ్ మాట్లాడుతూ ఈ సాంగ్‌కి అందరూ డాన్స్ చేస్తారు. ప్రతి ఒక్కరికీ ఈ పాట నచ్చుతుంది. సెప్టెంబర్ 4న అందరూ ఈ సినిమాని థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను. విష్ణు ప్రియ మాట్లాడుతూ థియేటర్‌లో ఈ పాట మీ అందరినీ సీట్‌లో నుంచి లేచి డాన్స్ చేసేలా చేస్తుంది.‘రంభ ఊర్వశి మేనక’ చుట్టూ తిరిగే కథ ఇది. ఇప్పటివరకు రంభ, ఊర్వశి, మేనకలను ఒక డాన్స్‌కి లేకపోతే ఒక సన్నివేశానికి రావడం చూశాము. కానీ ఈ కథ మాత్రం చుట్టూ రంభ, ఊర్వశి, మేనకల చుట్టూనే తిరుగుతుంది. ఇలాంటి సినిమా చేయడం నాకు అదృష్టంగా భావిస్తున్నాను అని చెప్పారు.

## ‘కింగ్ 100’ టైటిల్ గ్లింప్స్ విడుదల



అక్కినేని నాగార్జున మైల్‌స్టోన్ 100వ చిత్రం కింగ్ 100. అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మాణంలో, రా కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. నాగార్జున పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఈ సినిమా పవర్ ఫుల్ టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.ఈ చిత్రానికి కింగ్ 100 అని నామకరణం చేశారు. నాగార్జున వాయిస్‌ఓవర్‌తో ప్రారంభమయ్యే గ్లింప్స్‌లో సమాజం మనుషులను వారి సంపద ఆధారంగా ఎలా విభజిస్తుందనే అంశాన్ని ఆసక్తికరంగా ప్రస్తావించారు. తన దగ్గర ఏమీ లేనప్పుడు తనను ‘లూజర్’ అని పిలిచారని, అదే సంపద సంపాదించిన తర్వాత ‘ది కింగ్’ అని పిలుస్తున్నారని నాగార్జున చెప్పే డైలాగ్ ఆకట్టుకుంది. మరోవైపు నాగార్జున ఫొటోతో పాటు రూ.50,000 కోట్ల భారీ స్కామ్‌కు సంబంధించిన వార్తను చూపించడం సినిమాపై మరింత ఆసక్తిని పెంచింది.నాగార్జున మైల్‌స్టోన్ 100వ సినిమాకు ‘కింగ్ 100’ అనే టైటిల్ పర్ఫెక్ట్‌గా ఉంది. గ్రౌండ్ ప్రొడక్షన్ వాల్యూస్, రిచ్ విజువల్స్ గ్లింప్స్ ను నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళాయి. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ అందించిన పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్ ఇంపాక్ట్‌ను మరింత పెంచింది. నాగార్జున– డీఎస్పీ కాంబినేషన్ మరోసారి మ్యాజిక్ క్రియేట్ చేయబోతోంది.ఈ చిత్రంలో టబు కీలక పాత్రలో నటిస్తున్నారు. ‘కింగ్ 100’ చిత్రం క్రిస్మస్ కానుకగా 2026 డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# ఎల్ఎల్‌బి మానేసి చెన్నై రైలెక్కా..

* ఇండస్ట్రీలో నా గాడ్ ఫాదర్ బాబు మోహన్
* ‘ప్రజాపక్షం’ స్పెషల్ ఇంటర్వ్యూలో దర్శకుడు వేముగంటి

తెలుగు సినిమా పరిశ్రమలో నిలదొక్కుకోవడం అంటే అంతా ఈజీ కాదు. ఎవరో ఒకరు గాడ్ ఫాదర్ ఉండాలి అంటారు పెద్దలు. కానీ ఎవరు గాడ్ ఫాదర్ లేకుండా , అసలు సినిమా ఇండస్ట్రీకి ఏ మాత్రం సంబంధం లేకుండా ఒకే ఒక్కడు చెన్నైకు వెళ్లి దర్శకత్వ శాఖలో శిక్షణ తీసుకుని ముప్పై అయిదేళ్లుగా చిత్రసీమలో నిలదొక్కుకున్నారు. తెలుగు తెరపై టాప్ కమెడియన్ గా పేరున్న అలీ హీరోగా ముప్పై ఏళ్ళ క్రితమే సినిమా చెయ్యడం అంటే తమాషా కాదు. అది కూడా తొలిచిత్రంతోనే అలీలాంటి స్టార్ యాక్టర్ తో పని చేసే అవకాశం రావడం ఏ దర్శకుడికైనా ఇంతకంటే సంతోషం ఏముంటుంది?. సినిమా పరిశ్రమకు దూరంగా ఉన్న ప్రాంతం నుంచి చెన్నైకు వెళ్లి, చెన్నై నుంచి హైదరాబాద్ కు వచ్చి పదిహేను సినిమాలు, ఆరు నంది అవార్డులు, తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డును సైతం గెలుచుకున్నారంటే ఆయనలో ఎంత ధైర్యం, ఎంత ఓపిక, ఎంత సహనం ఉందో అర్థం చేసుకోవచ్చు. సినిమాకు కమర్షియల్ హంగులు జోడిస్తునే తనదైన శైలిలో చిత్రాలు రూపొందిస్తున్న దర్శకుడు వేముగంటి. ఇటీవల వనజీవి రామయ్య జీవిత కథను వెండితెరపై ఆవిష్కరించిన దర్శకుడు వేముగంటి. మట్టిలో మాణిక్యం లాంటి దర్శకుడు వేముగంటి ‘ప్రజాపక్షం’ కు ఇచ్చిన స్పెషల్ ఇంటర్వ్యూలో అనేక విషయాలు, విశేషాలు పంచుకున్నారు.

**ప్రశ్న : మీ స్వగ్రామం ..మీ కుటుంబ నేపథ్యం గురించి చెప్పండి ?**

**వేముగంటి :** నాది ఉమ్మడి కరీం నగర్ లోని హుస్నాబాద్ ...ఇప్పుడు సిద్ది పేట జిల్లా అయింది. రైతు కుటుంబం నుంచి వచ్చిన. అయిదెకరాల పొలం ఉండేది. విద్యాభ్యాసం అంత హుస్నాబాద్ లో జరిగింది. డిగ్రీ కరీంనగర్ చదివిన. మాది కమ్యూనిస్టు ఫామిలి బ్యాక్ గ్రౌండ్ మా ఇంట్లి నేను ఒక్కడినే అబ్బాయిని. సిస్టర్స్ ఉన్నారు.

**ప్రశ్న : సినిమా రంగంలో రావడానికి ఇన్‌స్పిరేషన్ ఏమిటి?**

**వేముగంటి :** ఎన్‌టి రామారావు సినిమాలకు ఇన్స్పైర్ అయ్యాను. పుస్తకాలు చదువుకుంటూ చాలా ఎమోషనల్ అయ్యేవాణ్ణి, లాయని అవ్వాలని అనుకున్న. ఆవేశాలు, ఏదైనా అన్యాయం జరిగితే స్పందించడాలు చేసేవాన్ని. అయితే లాయర్ చదివే ముందు ‘బెబ్బులిపులి’ , ‘లాయర్ విశ్వనాథ్’ సినిమాలు వచ్చాయి. ఈ సినిమాలు చూసి లాయర్ అయితే ఇలాగే అద్భుతంగా వాదించవచ్చు అనుకునేవాన్ని . ఎల్ ఎల్ బిలో చేరిన . కొన్ని రోజుల తరువాత జిల్లా కోర్టుకు వెళ్లిన ఎలా ఉంటుందో చూద్దాం అని. అక్కడ వాదించండాలు ఏమి లేవు. అక్కడ నాకు పెద్దగా ఏమి అనిపించలేదు. అప్పుడు ఏం చేద్దామని ఆలోచిస్తుంటే... అప్పుడు నా ఫ్రెండ్స్ చెప్పారు నువ్వు బాగా రాస్తావు కదా... ఫిలిం ఇండస్ట్రీలో ట్రై చేయొచ్చు కదా అని.

**ప్రశ్న : మీ సినిమా ప్రయాణం ఎలా మొదలైంది ?**



**వేముగంటి:** నాకు మూడు వందల రూపాయలు స్కాలర్ షిప్ వచ్చింది. ఇంట్‌లో చెప్తే వద్దంటారు అని చెప్పకుండానే చెన్నైకు వెళ్లిపోయిన. కానీ అక్కడ భాష తెలియదు. సినిమా ఆర్టిస్టులు ఎక్కడుంటారో తెలియదు. ఫస్ట్ టైం చెన్నై పోయినప్పుడు నా వయసు 18 ఏళ్ళు. 23 ఎళ్లకె నేను డైరెక్టర్ అయ్యాను. రెండేళ్లు చెన్నైలో ఉన్న. తమిళ్ నేర్చుకున్న. చెన్నై వెళ్లి ఫస్ట్ కలిసింది మాదాల రంగారావును. ఎర్రమల్లెలు, యువతరం కదిలింది పెద్ద హీరో అప్పటికే ఆయన. నేను రాసిన కథలన్నీ ఇంత పెద్ద బండల్ తీసుకెళ్లి చూపించా. అప్పు డు ఆయన ఒకటే చెప్పాడు ...బ్రదర్ బాగా రాస్తున్నారు ఏదైనా మ్యాగజిన్ కు రాయండి. పాపులర్ అవుతారు అప్పుడు రండి. మీరు ఎల్ ఎల్ బి పూర్తి చేసి రండి అప్పుడు చెప్తా ఏం చెయ్యాలో అన్నారు. మళ్ళీ వెన్నకి వచ్చేశా. రిటర్న్ టూ కరీం నగర్. అదొక థ్రిల్ ...ఎప్పుడు మరచిపోలేను.

**ప్రశ్న : ఎల్ ఎల్ బి మధ్యలో వదిలేశారు ... మళ్ళీ చదువు జోలికి పోలేదా ?**

**వేముగంటి:** ఎల్ ఎల్ బి వైపుకు ఇక వెళ్ళలేదు. మళ్ళీ రెండో సారి చెన్నై వెళ్ళాను. రెండో సారి వెళ్ళినప్పుడు ఇంట్లో నచ్చచెప్పి ఆరు నెలల్లో వస్తానని వెళ్ళాను. అప్పుడే ఫిలిం ఇండస్ట్రీ హైదరాబాద్ కు షిఫ్ట్ అవుతోంది.ఏం చెయ్యాలో తెలియక అందరితో నేను హైదరాబాద్‌కు వచ్చేషాను. అప్పుడు ప్రతాప్ ఆర్ట్స్ రాఘవ పెద్ద నిర్మాత దాసరి, చిరంజీవితో సినిమాలు తీసిన మహానుభావుడు. ఆయన సంస్థలో అసిస్టెంట్ ఎడిటర్‌గా చేరాను. ఆయన దగ్గర మ్యానువల్ ఎడిటింగ్ నేర్చుకున్న. ‘మూగమనసులు’ వంటి సినిమాకు ఆయన ఎడిటర్. ‘ అప్పుడు రాజశేఖర్ జీవితతో యుగకర్తలు, ఈ ప్రశ్నకు బదులేది (రాజశేఖర్ విజయచిత్ర)గారితో సినిమా స్టార్ట్ అయింది. ఆ రెండు సినిమాల్లో పని చేస్తే పదిహేను సినిమాలు చేసిన అనుభవం వచ్చింది నాకు. ఎందుకంటే షూట్ చెయ్యడం, ఎడిటింగ్ చెయ్యడం... సో డైరెక్షన్‌తో పాటు ఎడిటింగ్ కూడా వచ్చేసింది. అట్లా నా సినిమా జీవితం స్టార్ట్ అయింది.

**డైరెక్టర్‌గా మీతొలి ‘ఆవారాగాడు’ అలీని ఎలా ఒప్పించారు?**

**వేముగంటి :** నా ఫస్ట్ మూవీ ‘ఆవారాగాడు’. అలీ హీరోగా అప్పటికే ‘యమలీల’ సూపర్ హిట్ ఉంది. యమలీల తరువాత నా సినిమా ఆవారాగాడు చేశారు. అచ్చిరెడ్డితో క్లాప్ కొట్టించా. ఆయన హస్తవాసి మంచిది. వరుసగా మూడు సినిమాలకు అచ్చిరెడ్డితోనే క్లాప్ కొట్టించా. ఆయనంటే నాకు చాలా అభిమానం.నిజానికి నేను కొత్త, మా నిర్మాతలు కొత్తే . ఒకరు కాదు ఇద్దరు కారు నలుగురు ప్రొడ్యూసర్స్. నలుగురికి కథ చెప్పి చెప్పి సినిమా అంత నోటెడ్ అయిపోయింది. అచ్చిరెడ్డి ద్వారానే అలీని అప్రోచ్ అయ్యాము. ’గన్ షాట్’ సినిమా షూటింగ్ శ్రీశైలం ఫారెస్ట్ లో ఉంటె అక్కడికి వెళ్లి శ్రీశైలం మల్లన్న దర్శనం చేసుకుని వెళ్లి అలీని కలసి కథ చెప్పాను. కథ విని వెంటనే ఒకే అన్నారు..

**ప్రశ్న : సినిమాల్లో వర్క్ చేస్తున్నారంటే అమ్మాయిని ఇవ్వరు అని చాలా మంది అంటుంటారు నిజమేనా ?**

**వేముగంటి :** నిజమే ...సినిమాలో వర్క్ అంటే వాళ్లకు అర్థం కాదు. సినిమా అనగానే వాళ్ళ ఆలోచనలు వేరే ఉంటాయి. ఆర్టిస్టులు పరిచయం అవుతారు. రకరకాల వ్యాపకాలు ఉంటాయి అనే ఫీలింగ్ లో ఉంటారు. నా భార్య నా అక్కయ్య కూతురే కాబట్టి నాకు ఇబ్బంది లేకుండా ఉంది. నేను ఈ రోజు 30 ఏళ్లకు పైగా సినిమా పరిశ్రమలో ఉన్న అంటే నా ఫ్యామిలీ సపోర్ట్ వల్లే.

**ప్రశ్న : కమర్షియల్ హిట్స్‌తో పాటు అవార్డులు కూడా బాగానే వచ్చినట్టున్నాయి మీకు ?**

**వేముగంటి:** కమర్షియల్ హిట్స్‌తో పాటు అవార్డులు కూడా అందుకున్నాను. ‘గంగ’ సినిమాకు నాలుగు నంది అవార్డులు వచ్చాయి. నటి ఈశ్వరి రావుకి నంది అవార్డు వచ్చింది.

**ప్రశ్న : మీరు అనుకున్న సక్సెస్ వచ్చిందా ?**

**వేముగంటి:** సక్సెస్ వచ్చిందనే ఫీలవుతున్న. ఎందుకంటే నేను జీరో నుంచి వచ్చిన వాన్ని. అసలు ఇండస్ట్రీ తెలియని ప్రాంతం నుంచి వచ్చిన వాన్ని . ముప్పై అయిదేళ్లుగా ఇండస్ట్రీలో ఉండటం అంటే అంతా ఈజీ కాదు. ఆరు నంది అవార్డులు తీసుకున్న, మొన్న తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు అందుకున్న, పదిహేను సినిమాలు డైరెక్ట్ చేసిన అంటే అంత ఈజీ కాదు. చాలు నాకు ఈ సక్సెస్ ...నేను తృప్తిగానే ఉన్న. ఇంకా చేస్తూనే ఉంటా. నా టార్గెట్ వేరే ఉంది.

**ప్రశ్న : బాబు మోహన్ అబ్బాయిని పరిచయం చేస్తూ సినిమా తీశారు ? మీ చేతుల్లో ఎందుకు పెట్టారు?**

**వేముగంటి:** నా మొదటి సినిమా ఆవారాగాడు నుంచే బాబు మోహన్ తో నాకు మంచి బంధం ఏర్పడింది. ఆసియాలోనే గొప్ప జాతర సమ్మక్క సారక్క. ఇంత గొప్ప జాతర నేపథ్యంలో ఎందుకు సినిమా తీయకూడదని ఉండేది. పూర్తిగా డివోషనల్ గా తీయాలని బాబు మోహన్ ను కలిసి కథ చెప్పాను. ఆయన అబ్బాయిని పరిచయం చేద్దామని అనుకున్నారు. పూర్తిగా భక్తిరస చిత్రమిది. బాబు మోహన్ నాకు ఫ్రీ హ్యాండ ఇచ్చారు. వాళ్ళ అబ్బాయి కూడా చాల బాగా యాక్ట్ చేశాడు. ఆరు సెంటర్స్ లో వంద రోజులు, పన్నెండు సెంటర్స్‌లో యాభై రోజులు ఆడింది. ప్రమోషన్ విషయంలో కొంత బాబు మోహన్ డిసప్పాయింట్ అయ్యారు కానీ ధైర్యంగా ముందుకెళ్లారు. అనుకున్న తేదీకే రిలీజ్ చేశారు. నిజంగా ఆయన గొప్ప వ్యక్తి, హాట్సాప్ టూ బాబు మోహన్. బాగా సపోర్ట్ ఇస్తారు. నాకు గాడ్ ఫాదర్ లాంటోడు.

**ప్రశ్న : వనజీవి రామయ్య జీవిత చరిత్ర తీయాలని ఎందుకు అనుకున్నారు ?**

**వేముగంటి :** వనజీవి రామయ్య మనకు తెలియని చాలా గొప్ప మనిషి. ఎందుకు అనుకున్న అంటే ... నేను బెంగళూరులో కన్నడ మూవీ షూటింగ్ లో ఉన్న . ఆయన చనిపోయినపుడూ టీవీల్లో స్క్రోలింగ్ వస్తోంది. అంతకు ముందు వనజీవి రామయ్య గురించి కొంచమే తెలుసు నాకు. 70 ఏళ్ళు ఆయన చెట్లను నాటాడు. వృక్షో రక్షతి రక్షితః అని నినాదం ఇచ్చాడు. కోటి న్నర చెట్లు నాటాడు ...ఈ రోజు ఆయన లేరు. ఆయన లెగసీని ముందుకు తీసుకువెళ్ళేవారు ఎవరు లేరా? అని టీవీల్లో వార్తలు వచ్చాయి. అపుడు నేను ఇన్‌స్పైర్ అయ్యాను.

**ప్రశ్న: ఇప్పుడు ఏ సినిమా చేస్తున్నారు?**

**వేముగంటి :** తెలంగాణ నేపథ్యంలో బతుకమ్మ మీద ఒక సినిమా చేస్తున్న. పువ్వులతోని పూజించే కల్చర్ ప్రపంచంలో ఎక్కడా ఉండదు. ఒక్క తెలంగాణాలోనే ఉంది. బతుకమ్మ పండుగ నేపథ్యం తీసుకుని యూత్ ఫుల్‌గా వినోదాత్మకంగా చెప్పే కథ ఒకటి చేస్తున్న. ఇంకా కొన్ని కథలు ఉన్నాయి ...వన్ బై వన్ మీకు అందిస్తుంటా.

## ‘బద్లావ్ జరూరీ హై’ ర్యాలీ కోసం
# కదిలిన ఎర్రదండు





### రాంలీలా మైదానంలో ఏర్పాట్లు పరిశీలించిన సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



**న్యూఢిల్లీ:** మార్పు కోసం అరుణ సైన్యం విప్లవ శంఖారావం పూరించింది. ఢిల్లీలో సెప్టెంబరు 1న జరగబోయే బద్లావ్ జరూరీ హై ర్యాలీ, సభ కోసం దేశ నలు మూలల నుంచి ఎర్ర దండు కదిలింది. మార్పు కోసం సింహగర్జనకు సమాయత్తమైంది. అనేక రాష్ట్రాల నుంచి ప్రత్యేక బస్సులు, రైళ్లు, వాహనాల్లో ఢిల్లీకి సీపీఐ శ్రేణులు, మద్దతుదారులు శనివారం పయనమయ్యారు. ఢిల్లీలోని రాంలీలా మైదానం ఇందుకోసం ముస్తాబవుతోంది. సీపీఐ అధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చకాచకా జరుగుతున్నాయి. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు అనీరాజా, రామకృష్ణ పాండా, డాక్టర్ గిరీశ్ శర్మ, అమర్‌జిత్ కౌర్ తదితరులు క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షించారు. చరిత్రాత్మక మైదానాన్ని మార్పు నినాదంతో హోరెత్తించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ‘మార్పు’ ప్రచారోద్యమంలో భాగంగా అనీ రాజా, రామకృష్ణ పాండా ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టారు. బీజేపీ పాలనలో ఆదివాసీలపై సంస్థాగత దాడులను అనీ రాజా ఆక్షేపించారు. అడవుల స్వాధీనం... కార్పొరేట్లకు దారాదత్తంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, గుర్తింపుల రద్దును ఖండించారు. అన్యాయం, హింస కొనసాగుతోందని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివాసీలకు న్యాయం, గౌరవంతో పాటు అటవీ హక్కుల చట్టం పూర్తి స్థాయి అమలు జరగాలంటే మార్పు రావాలని స్పష్టంచేశారు. అందుకే ‘బద్లావ్ జరూరీ హై’ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, ఒక దేశంరెండు ఆరోగ్య వ్యవస్థల తరహా పరిస్థితి దేశంలో ఉందని రామకృష్ణ పాండా విమర్శించారు. అందులో ఒకటి ధనికులకు కాగా మరొకటి పేదల కోసమన్నారు. భారత్‌లో దక్కాల్సింది ఇలాంటి ఆరోగ్య సంరక్షణా? అని పాండా ప్రశ్నించారు. పరిస్థితుల్లో మెరుగుదల కావాలంటే మార్పు రావాలని, సెప్టెంబరు 1న బద్లావ్ జరూరీ హై ర్యాలీ విజయవంతం కావాలని రామకృష్ణ పాండా స్పష్టంచేశారు. దేశ నలు మూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావాలనికోరారు.

# రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రశ్నించే వారికి భయం ఉండకూడదని,అధికారమా, లాఠీలా, తూటాలా, జైల్లా, సంకెళ్లా ఇంకేదైనా సరే భయపడకుండా.. ప్రశ్నించే వారు, అడిగేవారు లేకపోతే సమాజం అంతా చీకటిమయమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. ‘ప్రశ్న అనేది అంతం కాదని,ప్రశ్నించే వారికి మరణం లేదని, ప్రశ్న, ప్రశ్నించేవాడు సజీవమని, అవసరమైతే అమరంగా.. అమరజీవిగా ఉంటారని’అన్నారు. రాజకీయ ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ‘రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాజకీయ ఖైదీల విడుదల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా జరిగింది. ధర్ననుద్దేశించి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఒక్కోరు ఒక్కో ఆర్గనైజేషన్ ఉన్నప్పటికీ అందరి లక్ష్యం ఒక్కటేనని, ఆ లక్ష్యం కోసం చేసే పోరాటానికి సంపూర్ణ మద్దతునిస్తామన్నారు. హారతికర్పూరం తరహా కొవ్వత్తుల్లా కరుగుతూ, సమాజానికి వెలుగునిచ్చే త్యాగమూర్తులు ఉన్నందుకే ఈ సమాజం ఇప్పటికైనా ఇలా నడుస్తోందన్నారు. కమ్యూనిస్టు పార్టీగా, వ్యక్తులుగా ప్రజల కోసం, హక్కుల కోసం నిలుస్తున్నామని, కమ్యూనిస్టులపై నిందలు వేస్తారని, కులాలు అంటగడతారని మండిపడ్డారు. రామకృష్ణ అడవిలో ఉన్నప్పటికీ, నక్సలైట్లు ఏం కోరుకుంటున్నారని, తన దృష్టిలో అడవిలో ఉండటమే త్యాగమని అన్నారు. అందరినీ వదిలేసి అడవీలో ఉన్నవారికి కూడా కులాలు అంటగట్టారని, మండిపడ్డారు. నకలైట్ సిద్ధాంతం పట్ల బేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ , తోడుగా ఉన్నామని చెప్పడానికి తాము వచ్చామని తెలిపారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అణచివేతలపై ఉద్యమిస్తున్నప్పుడు నిర్బంధాన్ని ప్రయోగిస్తే దానికి రెట్టింపు వేగంతో ఉద్యమాలు వస్తాయన్నారు. జైళ్లలో ఉన్న రాజకీయ ఖైదీలందరినీ వెంటనే విడుదల చేయాలని, ఉపా చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులపై నమోదైన కేసులను కూడా వెంటనే ఎత్తివేయాలని, ఉపా చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐక్యవేదిక కన్వీనర్ జి .హరగోపాల్ మాట్లాడుతూ జైళ్లలో ఉన్న రాజకీయ ఖైదీలను, ముఖ్యంగా ఆదివాసీ ఖైదీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, ముస్లిం మైనారిటీ రాజకీయ ఖైదీలపై నమోదు చేసిన అక్రమ ఉపా కేసులను ఎత్తివేయాలని కోరారు. ఈ ధర్నాలో సిపిఐ (ఎం.ఎల్.) న్యూ డెమోక్రసి నాయకులు సాధినేని వెంకటేశ్వర్ పాటు ప్రొఫెసర్ జి. లక్ష్మణ్, ఎస్. నారాయణ రావు, వి.నంధ్య తదితరులు ప్రసంగించారు.

## విద్యాశాఖలోనే కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ సభ్యులు చర్చించారు. అనంతరం జెఎసి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని, ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యలో ఎటువంటి డ్రాప్‌అవుట్ లేదని, ఎప్పటి కప్పుడు తాము అప్‌డేట్ అవుతున్నామని, పాలిటెక్నిక్ పూర్తిగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఎంతో గొప్పగా సేవలను అందిస్తోందని ఉన్నత స్థాయి కమిటీకి జెఎసి ప్రతినిధులు వివరించారు. విద్యార్థులకు పాఠాలను చెబుతూనే ‘జిఒ 97ను’ ఉపసంహరించుకునే వరకు శాంతియుతంగానే తమ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని జెఎసి స్పష్టం చేసింది. పాలిటెక్నిక్ కళాశాలలో ప్రస్తుత విద్యా విధానం,తద్వారా విద్యార్థులకు జరుగుతున్న మేలు తదితర అంశాలపైన జెఎసి తమ నివేదికను ఉన్నత స్థాయి కమిటీకి సమర్పించింది. జెఎసిని సంప్రదించకుండా ఎటువంటి నిర్ణయాలు తీసుకోబోమని ఉన్నత స్థాయి కమిటీ స్పష్టం చేసినట్టు జెఎసి నాయకులు తెలిపారు. త్వరలోనే పాలిటెక్నిక్ విద్యార్థులు, విద్య నిపుణులతో కూడా ఈ కమిటీ సమావేశం కానుంది.ఈ సమావేశంలో జెఎసి ప్రతినిధులు ఎం.నాగరాజు, వి. సురేష్, బి శ్రవణ్ కుమార్, ,డి.శ్రీరామ్, కె.విష్ణు, ఎం. రాజేందర్, బి. నీరజ, సి.హెచ్ స్వాతిరెడ్డి తదితరులు పాల్గొనారు.

**‘జిఒ 97’పై కమిటీ సమీక్ష..**

పాలిటెక్నిక్ కళాశాల విషయంలో ప్రభుత్వం జారీ చేసిన జిఒ 97పైన ఉన్నత స్థాయి కమిటీ సమీక్షించినట్టు తెలిసింది.పాలిటెక్నిక్ జెఎసి సమావేశానికి ముందే జిఒ97,ప్రస్తుత పాలిటెక్నిక్ కళాశాల పనితీరు, స్కిల్ యూనివర్సిటీ విధానాలు, పాలిటెక్నిక్ కళాశాలల వద్ద జరుగుతున్న నిరసనలు తదితర అంశాలపై చర్చించింది.

## ఇద్దరు దారుణహత్య

(మొదటి పేజీ తరువాయి)

తరలిస్తుండగా మార్గమద్యలోనే మృతిచెందాడు. వేపచెట్టులో తనవైపు ఉన్న భాగాన్ని పెదబాబు పెట్రోల్ పోసి కాల్చగా వెంకటేశ్వర్లు తన వైపు ఉన్న భాగాన్ని నరుకుతుండటంతో ఈ ఘర్షణ వాతావరణం చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెం టనే ఠసంఘటన స్థలానికి చేరుకుని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు రాళ్లు రువ్వకోవడంతో ఈ దాడిలో మేళ్లచెరువు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తలకు గాయాలయ్యాయి. వెంట నే ఆయనను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామం లో ఎలా ంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుం డా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా రాము అన్న పెద్దబాబు, తల్లిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## కేంద్రంపై ఒత్తిడి తేవాలి

(మొదటి పేజీ తరువాయి)

కల్పించాలని, రైతులు–వ్యవసాయ కూలీల సమగ్ర రుణమాఫీ చేయాలని, రైతు ఆత్మహత్య కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, విద్యుత్ ప్రైవేటీకర ఘణను నిలిపివేయాసేలా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని ఈ సందర్భంగా ఎస్‌కెఎం నేతలు మల్లు రవిని కోరారు. అదేవిధంగా 4 కార్మిక చట్టాలను రద్దు చేసి నెలకు రూ.31 వేల కనీస వేతనం, ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎలో 200 రోజుల పని, రోజుకు రూ.700 వేతనం కల్పించాలని, విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లు–2025, విత్తన బిల్లు–2025, ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ సవరణ బిల్లులను ఉపసంహరించుకోవాలన్నారు. ఎఫ్‌సిఐని బలోపేతం చేయడం, ఎరువులు–ఇంధన ధరలను నియంత్రించడం, పంట–పశు బీమాను ప్రభుత్వ రంగంలో నిర్వహించడం, అన్ని భూములకు సాగునీరు కల్పించడం, సామాజిక భ దతా పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచడం, బల వంతపు భూ ఘసేకరణను అడ్డుకోవడం వంటి డిమా ండ్లను కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ఎస్‌కెఎం నాయకులు ఎంపి మల్లు రవికి విజ్ఞప్తి చేశారు.

## స్వేచ్ఛ పొందాలి

(మొదటి పేజీ తరువాయి)

నల్సార్ లా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కృష్ణ దేవ రావు ప్రసంగించారు. మేనక గురుస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థ క్రమంగా నిర్వీర్యం అవుతుండడంతో విద్యార్థుల కుటుంబాలపై ఫీజులు, కోచింగ్, హాస్టల్ ఫీజుల రూపంలో తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందన్నారు. దేశ జిడిపిలో విద్యకు కనీసం 6 శాతం నిధులు ఖర్చు చేయాల్సిన కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం 2.5 శాతం నిధులను మాత్రమే కేటాయిస్తుండడంతో ఉన్నత విద్యలో ప్రైవేటీకరణ పెరిగి యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా పరీక్షా పత్రాల లీకేజీల వల్ల ఎంతో కష్టపడి చదివే విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారుతోందన్నారు. దేశంలో ప్రతి ఏటా 6 మిలియన్ల మంది విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తి చేస్తుండగా ఉందులో 3.5 మిలియన్ల మందికి మాత్రమే ఉద్యోగ అవకాశలు లభిస్తున్నాయని, మిగిలిన 2.5 మిలియన్ల మంది ప్రతి ఏటా నిరుద్యోగులుగా మిగులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు అభివృద్ధి చెందిన దేశాల్లో విద్య మొదలు ఉద్యోగం కల్పన బాధ్యతను అక్కడి ప్రభుత్వాలే తీసుకుంటున్నాయని వివరించారు. భారతదేశంలో ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా, వారంలో ఒక గంట పనిచేసినా, ఉపాధి ఉన్నట్టేనని ప్రభుత్వం పరిగణించడం దారుణమని అన్నారు. ఇదే క్రమంలో జన్‌జీలు, యువత తమకు జరుగుతున్న అన్యాయాలను నిలదీస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్‌తో పాటు వివిధ రాష్ట్రాల్లో రాజ్యాంగ బద్దంగా నిరసన తెలిపితే వారిపై పోలీసులు చేసిన బలప్రయోగం,పెల్లెట్ గన్ల వినియోగం వంటి చర్యలపై పారదర్శకమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలీసు వ్యవస్థలో జవాబుదారీతనం అవసరమన్నారు. ఈ అంశంపైన పార్లమెంటులో చర్చించేందుకు కీలక మంత్రులు పార్లమెంట్ సమావేశాలకు రెండు వారాల పాటు హాజరుకాకపోవడం శోచనీయమన్నారు. ప్రజల సమస్యలను వారి బాధలను ప్రభుత్వాలు, పార్లమెంటేరియన్లు వినాలని, విమర్శలను, భిన్నాభిప్రాయాలను గౌరవించడంతో పాటు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాధి రాష్ట్రాలు తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**భారత రాజ్యాంగం దేశ పౌరుల మ్యానిఫెస్టో : ప్రొఫెసర్ కృష్ణ దేవ రావు**

ప్రొఫెసర్ కృష్ణ దేవ రావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ పౌరుల మ్యానిఫెస్టో అని అభివర్ణించారు. అందుకే 75 ఏళ్లు గడిచిన మన రాజ్యాంగం వెలుగొందుతోందన్నారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేతిలోనే అధికారం మాత్రమే కాదని, ప్రతి పౌరుడి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, విలువలను కాపాడటంలో ప్రతి పౌరుడు, ప్రతి సంస్థ నిర్మాణాత్మక పాత్ర పోషించాలన్నారు.రాజ్యాంగం ఎంత గొప్పగా రూపొందించినప్పటికీ, దాని స్ఫూర్తిని అమలు చేసే వారు విఫలమైతే ఆశించిన ఫలితాలు సాధ్యం కావని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ వ్యాఖ్యలను గుర్తు చేశారు. ప్రజాస్వామ్యం ప్రజల చేతిలో అధికారం, చట్టబద్ధ పాలన చట్టం ముందు అందరూ సమానమేనని, ప్రాథమిక హక్కులు పౌరులందరికీ సమాన హక్కులు, స్వతంత్ర న్యాయ వ్యవస్థ ప్రతి పౌరుడికి నిష్పక్ష పాత న్యాయం అందించడం రాజ్యాంగానికి ప్రధాన స్తంభాలని అన్నారు. రాజ్యాంగ విలువల పరిరక్షణలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com